





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


కమ్యూనిస్టుకు మరణం లేదు.. కమ్యూనిజానికి అంతం లేదు

సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవం దేనికి సంకేతం??

కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్తు ఏమిటి?

03


సంపుటి 09, సంచిక: 49 | శనివారం | 17-01-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ప్రభుత్వ శాఖల్లో ఖాళీలన్నీ త్వరలో భర్తీ

''రాజకీయ పార్టీల చేతుల్లో యువత ఆయుధాలుగా మారొద్దు

'కొలువుల పండుగ' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

''రాజకీయ పార్టీల చేతుల్లో యువత ఆయుధాలుగా మారొద్దు. ఉస్మానియా యూనివర్సిటీలో, అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులు ఏం మాట్లాడుకుంటున్నారో తనకు తెలుసు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తాం'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అలాగే లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి ప్రైవేటు రంగంలోనూ లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన చెప్పారు. మాదాపూర్‌లోని శిల్పా కళా వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'కొలువుల పండుగ' కార్యక్రమంలో టిజిపిఎస్‌సి గ్రూప్ 3 కు ఎంపికైన 1370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను సిఎం రేవంత్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ''గత పదేళ్లలో

తరువాయి 2లో

# మరో చారిత్రక ఘటనకు ఖమ్మం వేదిక

## 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ

హాజరుకానున్న డి.రాజా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం






ఖమ్మం విప్లవోద్యమాల గుమ్మం. దేశ స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత ఎన్నెన్నో ఘటనలకు వేదికైంది. ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ సాధనోద్యమం ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాల వరకు ఖమ్మంకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ప్రతి పల్లెకు, ప్రతి చెట్టుకు, పుట్టకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్ర కమ్యూనిస్టు పార్టీతో ముడిపడింది. ఉమ్మడి జిల్లాకు చెందిన నేతల త్యాగాలు, పోరాటాలు, నిజాయితీ నిత్య స్మరణీయం. తొలి దశలో సిపిఐ తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్నా, తెలంగాణ సాయుధ పోరాటంతో గ్రామ గ్రామానా ఎర్ర జెండా రెపరెపలాడింది. ఎందరో యోధులు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. మంచి ఊపు మీద ఉన్న కమ్యూనిస్టు పార్టీకి చీలిక తీరని శాపంగా మారింది. 1964లో వచ్చిన చీలిక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐని నామమాత్రం చేసింది.

**చీలిక నుంచి బలోపేతం :** 1964లో చీలిక తర్వాత సిపిఐ నుండి సిపిఐ(ఎం)గా విడిపోయింది. ఆ తర్వాత సిపిఐ(ఎం) నుండి సిపిఐ (ఎంఎల్) ఏర్పాటు

తరువాయి 12లో




## దేశ సంపద రక్షణలో కమ్యూనిస్టులు

- చారిత్రక ఘటనలో భాగస్వాములు కండి
- మా నినాదాలే పరిపాలనా నిర్ణయాలు
- స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర పాలకులు
- మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే సభ చరిత్రలో నిలిచి పోనుందని, ఈ చారిత్రక ఘటనలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం సభ కమ్యూనిస్టుల పురోగమనానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం లక్ష్యంతో పోరాడిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా మా నినాదాలే పాలకుల విధాన నిర్ణయాలుగా మారాయని గతంలో బ్యాంకుల జాతీయకరణ, మిగులు భూముల పంపిణీ, దున్నే వానికే భూమి సహా పలు సంక్షేమ పథకాలు, కమ్యూనిస్టు నినాదాలు, పోరాటాల కారణంగానే చట్టాలుగా మారి అమలయ్యాయని కూనంనేని తెలిపారు. 21వ శతాబ్దంలోనూ జాతీయ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. దేశ సంపద రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణను కమ్యూనిస్టులు బాధ్యతగా స్వీకరించారని కమ్యూనిస్టులు లేకుంటే ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలు, కోల్ ఇండియా సహా దేశీయ సుప్రసిద్ధ సంస్థలు ఎప్పుడో ప్రైవేట్ శక్తుల పరమయ్యేవని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం ప్రజాసంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమేనన్నారు. ఏ స్వేచ్ఛ కోసం పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామో అదే స్వేచ్ఛను బిజెపి హరించి వేస్తుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థి, యువజనులు ఎదుర్కొంటున్న

తరువాయి 2లో

## బాసరలో 'జ్ఞాన సరస్వతి' వర్సిటీ



పారిశ్రామికంగా, విద్యాపరంగా, సాగునీటి రంగంలో ఆదిలాబాద్ జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం

- పోరాటాల గడ్డపై రైతులకు అన్యాయం జరగనివ్వబోం
- జిల్లా రైతాంగానికి సాగునీరు అందాలంటే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మించాల్సిందే
- 'ప్రజాపాలన' బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పారిశ్రామికంగా, విద్యాపరంగా, సాగునీటి రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌లో నిర్వహించిన ''ప్రజాపాలన–ప్రగతి బాట'' భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆదిలాబాద్ అభివృద్ధికి సంబంధించి పలు కీలక హామీలను ప్రకటించడమే కాకుండా, తక్షణం అమలుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చాలా కాలం క్రితమే విశ్వవిద్యాలయం మంజూరైనప్పటికీ, స్థానిక ప్రాంతీయ విభేదాల వల్ల

తరువాయి 2లో

### 2034 వరకూ కాంగ్రెస్ రాజ్యమే

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్

తెలంగాణలో రాబోయే పదేళ్ల కాలం కాంగ్రెస్ పార్టీదేనని, 2034 వరకు రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు

తరువాయి 2లో




## రైతు, ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

జాతీయ విత్తన బిల్లును సవరించాలి

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కార్మిక సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ విత్తన బిల్లును సవరించాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల జెండాలను, బ్యాడ్జీలతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, ఆర్ వెంకట్రాములు, జక్కులవెంకటయ్య, తుకారాం నాయక్,విజయ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గత 11సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలారాయడంతో పాటు రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని విమర్శించారు. ఒక వైపు ప్రజాసంక్షేమాన్ని వల్లిస్తూనే. మరో వైపు కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను దోచిపెడుతున్నదని, మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలకు రూ. 18 లక్షల కోట్లు రాయితీలు కల్పించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను అమలు చేస్తుందని మండిపడ్డారు. కార్మికులు ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకునేందుకు లేబర్ కోడ్‌లో ఆంక్షలను విధించారన్నారు. విత్తనాల ద్వారా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారాన్ని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, కేంద్రమే తమ ఇష్టానుసారంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందని విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం 2005ను తీసుకొస్తే, ఈ చట్టానికి మహాత్మ గాంధీ పేరును, ఆ లక్ష్యాలను తొలగించి, ఆ స్థానంలో

తరువాయి 2లో



## ట్రంప్ చేతికి 'నోబెల్ శాంతి'

అందించిన మచాడో.. ప్రతీకాత్మక చర్యగా అభివర్ణన

**వాషింగ్టన్:** భారత్–పాకిస్తాన్‌సహా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో యుద్ధాలను నిలువరించానని, కాబట్టి ప్రతిష్టాతమకమైన నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాలని అమెరికా అధ్యక్షుడు పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, నోబెల్ పురస్కారం వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు దక్కింది. దీనితో డీలాపడిపోయిన ట్రంప్ చేతికి నోబెల్ పురస్కారం లభించింది. మచాడో స్వయంగా ఆయనకు పురస్కారాన్ని అందించారు. నోబెల్‌కు మరొకరికి బదిలీ చేయడానికి వీల్లేదని నోబెల్ ఇన్‌స్టిట్యూట్ స్పష్టంచేసినట్లు, సమాచారం. ట్రంప్‌కు నోబెల్ బహుమతిని అందించేయడాన్ని ఒక ప్రతీకాత్మక చర్యగా పేర్కొంది. అయితే, ట్రంప్ ఆ పతకాన్ని తన వద్దే ఉంచుకోవాలని భావిస్తున్నట్టు వైట్ హౌస్

తరువాయి 2లో

## మేడారానికి ప్రత్యేక ఆర్‌టిసి బస్సులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన'సమ్మక్క సారలమ్మ జాతర'' ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో అమ్మవార్లకు బంగారం సమర్పించాలనకునే భక్తుల కోసం టిజిఎస్‌ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేసిందని ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు (వరంగల్) జిల్లాలోని మేడారంలో సమ్మక్కసారలమ్మ దేవతలను పూజించడానికి తండోపతండాలుగా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. అయితే, వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేని భక్తులకు బంగారం ప్రసాదం తమ ఇంటి వద్దకే చేర్చేందుకు టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్ తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. దేవాదాయ శాఖ సహకారంతో, మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదం

తరువాయి 2లో



## 'విలువల శిఖరం' జైపాల్‌రెడ్డి

కేంద్ర మాజీ మంత్రికి సిఎం, ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం/ హైదరాబాద్

మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్, కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా పి.వి.మార్గ్ (నెక్లెస్ రోడ్)లో జైపాల్ రెడ్డి సమాధి 'స్ఫూర్తి స్థల్' వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు 'స్ఫూర్తి స్థల్' వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు

తరువాయి 2లో

## కనీస మద్దతు ధరతో కందుల కొనుగోళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వానాకాల 2025–26 సీజన్‌లో కందుల పంటను (రెడ్ గ్రామ్) కనీస మద్దతు ధరతో (ఎంఎస్‌పి) కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. రైతులు మధ్యవర్తుల వద్ద వెల్లి తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవద్దని, తమ సమీపంలోని టి.జి. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కందుల కనీస మద్దతు ధర క్వింటా రూ. 8,000లు ఉండగా, ప్రస్తుత మార్కెట్ ధరలు మాత్రం రూ.7,200 వరకు ఉన్నాయని, అందుకే రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి తుమ్మల శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మార్కెట్ ధరల హెచ్చుతగ్గులతో నష్టాలను నివారించి, రైతులకు లాభదాయక ధరను కల్పించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (టి.జి. మార్క్‌ఫెడ్ ) సమన్వయంతో కొనుగోళ్లు

తరువాయి 2లో

## ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో రూ.3.90కోట్ల కుంభకోణం

- 15 మంది నిందితుల అరెస్టు, మరో 9 మంది పరారీ
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు 63.19 లక్షల నగదు, బ్యాంక్‌లో లక్ష రూపాయలు,

తరువాయి 2లో

# కెనడాకు కెనోలా.. చైనా వ్యూహాత్మక నిర్ణయం

**బీజింగ్ :** చైనాతో సత్సంబంధాలకు కెనడా చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. చైనా పర్యటనకు వచ్చిన కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ పలురంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత ఆయన పేరుతో విడుదలపైన ప్రకటనలో ఒప్పందాల ప్రస్తావన ఉంది. వీటిలో ముఖ్యమైనది వాణిజ్య ఒప్పందం. కెనడాతో వాణిజ్య ఒప్పందాన్ని కేవలం వ్యవసాయ లావాదేవీగా మాత్రమే చూడడానికి వీల్లేదు. ఇది ఆర్థిక ప్రయోజనాలతో పాటు రాజకీయ, వ్యూహాత్మక అర్థాలను కలిగి ఉందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కెనడాకు కెనోలా విత్తనాల ఎగుమతి ఈ సంబంధాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం కెనోలా విత్తనాలపై ఉన్న సుంకాలు సుమారు 85 శాతం నుంచి మార్చి 1 నాటికి సుమారు 15 శాతానికి తగ్గనున్నాయి. దీని వల్ల కెనడా రైతులు విత్తే సీజన్ ప్రారంభానికి ముందే తమ ప్రణాళికలను స్పష్టంగా రూపొందించుకునే అవకాశం లభించనుంది. ఈ ఒప్పందాల ద్వారా కెనడా రైతులు, మత్స్యకారులు, ఆహార ప్రాసెసింగ్ రంగాలకు దాదాపు 3 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు లభిస్తాయని, 2007 తర్వాత మొదటిసారి చైనా పర్యటనకు వచ్చిన కార్నీ అభిప్రాయపడ్డారు. చైనా మార్కెట్‌లో ఉన్న విస్తృత అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ఇది కీలక అడుగుగా ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత ఏడాది పాటు కొనసాగిన సుంకాల గందరగోళం తర్వాత, ఈ పరిణామం కెనడా ఎగుమతిదారులకు పెద్ద ఊరటగా మారింది.



చైనా మార్కెట్ మళ్లీ అందుబాటులోకి రావడం కెనడా వ్యవసాయ రంగానికి మాత్రమే కాకుండా, ప్రాసెసింగ్ పరిశ్రమలు, అనుబంధ రంగాలకు కూడా ఊపిరి పోసే అంశంగా మారింది. దీర్ఘకాలంలో ఇది ఉపాధి అవకాశాలను పెంచడానికీ, దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడే అవకాశముంది. అంతేకాదు, చైనాకు కీలక వ్యవసాయ భాగస్వామిగా కెనడా తిరిగి బలంగా నిలబడుతున్న సంకేతంగా కూడా ఈ ఒప్పందాన్ని విశ్లేషకులు చూస్తున్నారు. కాగా, ఈ ఒప్పందాన్ని కొత్త భాగస్వామ్యం, కొత్త యుగంకు నాంది పలికే అడుగుగా కార్నీ అభివర్ణించారు. భవిష్యత్తులో ఇది కెనోలా వరకు మాత్రమే పరిమితం కాకుండా, ధాన్యాలు, పప్పులు, లాబ్‌స్టర్, బీఫ్, పోర్క్, పెట్ ఫుడ్ వంటి ఇతర ఉత్పత్తులకు కూడా విస్తరించే అవకాశముందని ఆయన తెలిపారు. అంటే, ఇది ఒకే ఉత్పత్తి ఒప్పందం కాకుండా, విస్తృత వాణిజ్య పునరుజ్జీవనానికి బీజం వేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. కార్నీ– జిన్‌పింగ్ భేటీకి ముందు నుంచే కెనడా–చైనా సంబంధాల్లో మెరుగుదల కనిపించిందన్నది గమనార్హం. గత ఆ ఏడాది ఆగస్టులో ఇరు దేశాలు సంయుక్త ఆర్థిక, వాణిజ్య కమిషన్ సమావేశాలను మళ్లీ ప్రారంభించాయి. గతంలో ఎన్నో సంవత్సరాల పాటు నిలిచిపోయిన ఈ సంప్రదింపుల వ్యవస్థ పునఃప్రారంభం కావడం ద్వైపాక్షిక నమ్మకాన్ని సూచించింది. గత సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో కార్నీ చైనా ప్రధాని లీ చియాంగ్‌ను కలవడం, ఆ తర్వాత దక్షిణ కొరియాలో జరిగిన ఎపెక్ సదస్సులో జిన్‌పింగ్‌తో భేటీ కావడం ఈ సంబంధాలకు మరింత బలం చేకూర్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కార్నీ చేసిన వ్యాఖ్యలు గ్లోబల్ ట్రేడింగ్ వ్యవస్థ భవిష్యత్తుపై ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నాయి. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి ప్రపంచ స్థాయి సంస్థలు భవిష్యత్తులో తక్కువ ప్రాధాన్యం పొందే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా విధిస్తున్న సుంకాలు, కొనసాగుతున్న వాణిజ్య వివాదాలు ప్రపంచ సరఫరా గొలుసులను అస్తవ్యస్తం చేస్తున్న నేపథ్యంలో, దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని ఆయన సూచించారు. భవిష్యత్తు వాణిజ్య నియమాలు ద్వైపాక్షిక ఒప్పందాలు, బహుళపాక్షిక ఏర్పాట్లు, నిర్దిష్ట రంగాలపై కేంద్రీకృతమైన కూటముల ద్వారా రూపుదిద్దుకుంటాయని కార్నీ అభిప్రాయపడ్డారు. డిజిటల్ ట్రేడ్ వ్యవసాయం, స్వచ్ఛ శక్తి, వాతావరణ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ సేవలు, సరిహద్దులు దాటే చెల్లింపుల వ్యవస్థలు వంటి రంగాలు ఈ మార్పులో కీలక పాత్ర పోషించనున్నాయి.

కాగా, ఏ రకంగా చూసినా, కెనోలా వాణిజ్య ఒప్పందం కెనడాకు కేవలం ఆర్థిక లాభం మాత్రమే కాదు.. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ మారుతున్న దిశలో తన స్థానం పునర్నిర్మించుకునే వ్యూహాత్మక అడుగుగా కూడా నిలుస్తోంది. చైనాతో సంబంధాల పునరుద్ధరణ ద్వారా కెనడా తన వ్యవసాయ శక్తిని రాజకీయ, ఆర్థిక ప్రభావంగా మలచుకునే ప్రయత్నం చేస్తోందని ఈ పరిణామాలు స్పష్టంగా సూచిస్తున్నాయి.

# లంచాలు ఇస్తేనే మృతదేహాల అప్పగింత!

**టెహ్రాన్ :** ఇరాన్‌లో మతపాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలువెల్లువెత్తగా, భద్రతాబలగాలు జరిపిన కాల్పుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. దేశవ్యాప్తంగా రెండు వారాలకు పైగా కొనసాగిన నిరసనల్లో కనీసం 2,435మంది మరణించినట్లు హక్కుల సంఘాలు చెబుతున్నాయి. బిబిసి కథనం ప్రకారం, ప్రదర్శనల సమయంలో మృతి చెందినవారి మృతదేహాల అప్పగింతకు ఇరాన్ అధికారులు భారీ మొత్తాలు కోరుతున్నారు. బాధిత కుటుంబాలు ఈ విషయాన్ని తెలిపినట్టు బిబిసి పేర్కొంది. పలువురిని ఉటంకిస్తూ బిబిసి ఇచ్చిన సమాచారాన్ని అనుసరించి, మృతదేహాలను మార్చురీలు, ఆసుపత్రుల్లో నిల్వ ఉంచి, బంధువులు డబ్బు చెల్లిస్తేనే భద్రతా దళాలు వాటిని విడుదల చేస్తున్నాయి. ఉత్తర ఇరాన్‌లోని రాష్ట్ నగరానికి చెందిన ఒక కుటుంబం, తమ బంధువు మృతదేహాన్ని విడుదల చేయడానికి భద్రతా బలగాలు 700 మిలియన్ టోమాన్లు (సుమారు 5,000 డాలర్లు; 3,700 పౌండ్లు) డిమాండ్ చేశాయని బిబిసికి తెలిపింది. ఆ మృతదేహం పోర్సినా ఆసుపత్రి మార్చురీలో, మరో కనీసం 70 మంది మృత ప్రదర్శనకారుల మృతదేహాలతో కలిపి ఉంచినట్లు వారు చెప్పారు.

ఇదే సమయంలో, టెహ్రాన్‌లో కుర్దిష్‌కు చెందిన సీజనల్ నిర్మాణ కార్మికుడి కుటుంబం అతని మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వెళ్లగా, దానికి బదులుగా ఒక బిలియన్ టోమాన్లు (సుమారు 7,000 డాలర్లు; 5,200 పౌండ్లు) చెల్లించాలని చెప్పినట్లు బిబిసికి తెలిపారు. ఆ మొత్తం చెల్లించలేని పరిస్థితిలో కుటుంబం తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకోకుండా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇరాన్‌లో సాధారణంగా ఒక నిర్మాణ కార్మికుడి నెలసరి ఆదాయం 100 డాలర్లకు కూడా తక్కువగా ఉంటుంది.

## రద్దు చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ జి రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రాల వాటాను పెంచి కేంద్రం తన బాధ్యత నుంచి తప్పు కునేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. నూతన విద్యుత్ బిల్లు ప్రకారం ఇక నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ బాధ్యతలను కేంద్రమే చూస్తుందని, విద్యుత్ రెగ్యులెటరీ కమిషన్ ద్వారా విద్యుత్ ధరలను కూడా నిర్ణయిస్తుందని, స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి, ముందుగానే వసూలు చేస్తారని, ఉచిత విద్యుత్‌ను, క్రాస్ సబ్సిడీని కూడా రద్దు చేస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎం, కార్మిక సంఘం నాయకులు జె. వెంకటేష్ భూపాల్, వంగూరు రాములు, ఈశ్వర్ రావు, బొప్పని పద్మ,శంకర్ ,మూడ్‌శోభన్, ఆర్. శ్రీరామ్‌నాయక్, ఎం.ధర్మా నాయక్, కోట రమేష్, ఎం.వెంకటేష్, ఎం.దశరథ్, తదితరులు పాల్గొన్నారు. విత్తన బిల్లును సవరించి, నాలుగు లేబర్ కోర్డ్‌లు రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వెంటనే కేంద్రం పునరుద్ధరించాలని, లేదంటే, తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని పశ్యపద్మ హెచ్చరించారు.టి.సాగర్ మాట్లాడుతూ అణు బిల్లు ప్రజలకు,పర్యావరణానికి నష్టం కలుగుతందన్నారు.

## త్వరలో భర్తీ
(మొదటి పేజీ తరువాయి)

రెండు సార్లు ముఖ్యమంత్రి అయిన వ్యక్తులు రాజకీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల కోసమే పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఆలోచన చేయలేదు. కుటుంబం మొదటి ప్రాధాన్యత, పార్టీ రెండో ప్రాధాన్యత, రాజకీయాలు మూడో ప్రాధాన్యతగా గత పాలకులు ఆలోచించారు. తెలంగాణ యువత గురించి ఆలోచించలేదు. వాళ్ల ఉద్యోగాలు తొలగిస్తేనే తమ ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నడుం బిగించారు. ఫలితంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడింది'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య,, ఆహారం తో పాటు నాణ్యమైన నైపుణ్యాలపై దృష్టి పెండుతోందని ఆయన చెప్పారు. నాణ్యమైన నైపుణ్యాలు లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడలేకపోతున్నామన్నారు. విద్యలో స్కిల్ చాలా ముఖ్యమైనది.. నైపుణ్యాల అభివృద్ధి కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందించే అవకాశం ప్రభుత్వం దగ్గర ఉందని ఆయన పేర్కొన్నారు. విద్య ఒక్కటే ప్రజల జీవితాల్లో మార్పు, వెలుగులు తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మమ్మద్ అజారుద్దీన్ , సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు ఆరెకపూడి గాంధీ, కాలే యాదయ్య, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రాజ్యమే
(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారిపోయిందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ను ఉద్దేశించి మాట్లాడుతూ, బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్ ఇచ్చే పవర్‌ఫుల్ పంచ్‌తో గత పాలకులను రేవంత్‌రెడ్డి పోల్చారు.''మనం ఒక్క పంచ్ ఇస్తే ప్రత్యర్థుల కథ ముగిసిపోయింది. ఆ దెబ్బకు వారు నేరుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు.''అని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అరాచకాలకు ప్రజలు తమ ఓటుతో సరైన సమాధానం చెప్పారని, ఒక్క దెబ్బతోనే ప్రత్యర్థులు రాజకీయంగా కోలుకోలేని స్థితికి వెళ్లారని ఆయన వ్యాఖ్యానించారు. ఇకపై తాను ఓడిపోయిన నాయకుల గురించి గానీ, కాలగర్భంలో కలిసిపోయిన రాజకీయ శక్తుల గురించి గానీ చర్చించి సమయం వృథా చేయదలచుకోలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని, అందుకే ప్రత్యర్థుల గురించి మాట్లాడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2024 నుండి 2034 వరకు వరుసగా రెండు పర్యాయాలు కాంగ్రెస్ జెండానే తెలంగాణపై రెపరెపలాడుతుందని, ప్రజా పాలన నిరంతరాయంగా కొనసాగుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రసంగం ద్వారా తన కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం ఖాయమనే సంకేతాలను ఆయన పంపారు.

## ట్రంప్ చేతికి 'నోబెల్ శాంతి'
(మొదటి పేజీ తరువాయి)

అధికారి ఒకరు తెలిపారు. వైట్ హౌస్‌లో భేటీ అనంతరం మచాడోను ప్రశంసిస్తూ, ఆమె ఎంతో కష్టాలు ఎదుర్కొన్న అద్భుతమైన మహిళ అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ పతకం ఇవ్వడం పరస్పర గౌరవానికి ప్రతీక అని ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'నేను చేసిన పనికి గాను ఆమె తన నోబెల్ శాంతి బహుమతిని నాకు అందజేశారు' అని ఆయన అన్నారు. మచాడో మీడియాతో మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడికి నోబెల్ శాంతి బహుమతి పతకాన్ని అందజేశానని అన్నారు. మన స్వేచ్ఛ కోసం ఆయన చూపిన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వెనిజులా అధ్యక్షుడు నికొలాస్ మదురోను డ్రగ్ ట్రాఫికింగ్ వంటి పలు ఆరోపణలపై అమెరికా నేరుగా ఆయన అధికార నివాసంపైనే దాడి చేసి, భార్యతోసహా ఆయనను బందీ చేసి న్యూయార్క్ తీసుకెళ్లిన విషయం తెలిసిందే. మదురో చిరకాల ప్రత్యర్థి మచాడో ఇప్పుడు ట్రంప్‌ను కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. వెనిజులాకు తానే తాత్కాలిక అధ్యక్షుడినంటూ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో, మచాడో చర్యను చాలా మంది పోల్చి చూస్తున్నారు. దీనిని పూర్తిగా రాజకీయ భేటీగానే పేర్కొంటున్నారు. ట్రంప్ గతంలో మచాడోకు దేశంలో విస్తృత మద్దతు లేదని వ్యాఖ్యానించినప్పటికీ, మదురో తిరస్కరించిన 2024 ఎన్నికల్లో ఆమె పార్టీ విజయం సాధించిందనే అభిప్రాయం ఉంది. వాషింగ్టన్ పర్యటనకు ముందు, మచాడో దాదాపు 11 నెలలు వెనిజులాలో రహస్యంగా గడిపారు. నోబెల్ శాంతి బహుమతిని మచాడో స్థానంలో ఆమె కుమార్తె స్వీకరించింది.

## కందుల కొనుగోళ్లు
(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నదన్నారు. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాలలో కందులు సాగు చేయగా, సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందనే అంచనాలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం వానాకాలం 2025–26కు గాను 1,71,310 మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. ఎంఎస్‌పి ధరలతో కందుల కొనుగోళ్ల ప్రక్రియ గత నెల డిసెంబర్ 27 నుంచి ప్రారంభమై 26 మార్చి, 2026 వరకు కొనసాగుతుందని, రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించగా, ఇప్పటి వరకు 13 కేంద్రాలు ప్రారంభించామని వివరించారు. శుక్రవారం (జనవరి 16వ తేదీ వరకు) 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కందులను కొనుగోలు చేశామని, దీని విలువ రూ. 0.24 కోట్లుగా ఉందని వివరించారు. ప్రస్తుతం నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సక్రమంగా కొనసాగుతున్నాయని, ఇతర కందులు సాగు చేసే జిల్లాల్లో కూడా పంట రాకలు పెరిగిన మేరకు దశలవారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు చేసిన కందులకుగాను చెల్లింపులు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డిబిటి ద్వారా నిర్ణీత కాలంలో జమ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

## 'విలువల శిఖరం' జైపాల్‌రెడ్డి
(మొదటి పేజీ తరువాయి)

అర్పించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి దేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ యోధుడు, విలువల శిఖరం, ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాకారంలో జైపాల్ రెడ్డి పోషించిన పాత్రను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని సిఎం గుర్తు చేశారు. రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్‌రెడ్డి నిలిచారని సిఎం పేర్కొన్నారు.

**జైపాల్ రెడ్డి స్ఫూర్తిదాయక వారసత్వం చిరస్మరణీయం**

మాజీ కేంద్ర మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని, గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిపిసిసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి.కుమార్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ఎస్.అన్సారీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ రావు, మణిలాల్ షా పాల్గొన్నారు. జైపాల్ రెడ్డి దేశానికి, కాంగ్రెస్‌కు అందించిన అమూల్యమైన సేవలను, ఆయన దూరదృష్టి గల నాయకత్వాన్ని, ప్రజాసేవకు అంకితమైన జీవన ప్రయాణాన్ని స్మరించుకున్నారు. జైపాల్ రెడ్డి స్ఫూర్తిదాయక వారసత్వం చిరస్మరణీయమని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన జైపాల్ రెడ్డి**

ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచారని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో అపూర్వమైన వ్యక్తిత్వం గల వ్యక్తి, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడని ఆయన ఒక ప్రకటనలో కొనియాడారు. విద్య, పర్యావరణం, భూసంస్కరణలు, పరిశ్రమలు, సమాచార సాంకేతికత వంటి కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేశ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేకించి తెలంగాణ ప్రజల హక్కుల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర స్థాయిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. నిస్వార్థ రాజకీయ జీవితం, వ్యక్తిగత నైతిక విలువలు, ప్రజాస్వామ్యం పట్ల ప్రగాఢ నమ్మకం కలిగిన నాయకుడిగా జైపాల్ రెడ్డి తరతరాలకు ఆదర్శమన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షానే నిలబడి ప్రశ్నించే స్వభావం ఆయనకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో జైపాల్ రెడ్డి ఆలోచనలు, విధానాలు మార్గదర్శకమని, యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఆచరణలో చూపిన నాయకుడిగా ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు.

**దేశానికి, రాష్ట్రానికి జైపాల్ రెడ్డి ఉత్తమ సేవలందించారు : సిపిఐ**



మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డికి సిపిఐ నేతలు నివాళులు అర్పించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఇతర నేతలు పి.వి.మార్గ్‌లోని జైపాల్‌రెడ్డి సమాధి 'స్ఫూర్తి స్థల్' వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీ య కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యులుగా, కేంద్ర మంత్రిగా దేశానికి, రాష్ట్రానికి జైపాల్ రెడ్డి సేవలందించారని, తద్వారా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నారని పల్లా వెంకట రెడ్డి కొనియాడారు.

## రక్షణలో కమ్యూనిస్టులు
(మొదటి పేజీ తరువాయి)

సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. 1925లో సిపిఐ ఆవిర్భావించిన తర్వాత నిర్బంధాల నడుమ నిషేధానికి గురైందని కమ్యూనిస్టుల భావాజాలంతో అనేక మంది కాంగ్రెస్‌లో చేరి సోషలిస్టు విభాగం ఏర్పాటు చేసి పోరాటం చేశారని కూనంనేని తెలిపారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం కమ్యూనిస్టు నాయకుడు అస్లాత్ మహని తొలిసారి ఇచ్చాడని ఆ నినాదాన్ని భగత్‌సింగ్ విశ్వవ్యాపితం చేశాడన్నారు. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయమే సరైన ప్రత్యామ్నాయమని ఆయన తెలిపారు. చిట్టగాంగ్, గదర్, తెబగా, వాయిలార్, పోనప్ప సహా పలు పోరాటాలను నిర్వహించిన వారంతా సిపిఐలో చేరారన్నారు. మీరట్, కాన్పూర్, విషాద సహా పలు కుట్ర కేసులను ఎదుర్కొని నిలబడ్డ సిపిఐ మరో వందేళ్లయినా ప్రజల పక్షాన నిలబడేందుకు సిద్ధమేనని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల వేడుక భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిని ఇవ్వనుందన్నారు.

**రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలు : ప్రకాష్‌బాబు**

శతాబ్ద కాలం పాటు పోరాటం సాగించిన సిపిఐ రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్‌బాబు తెలిపారు. మీడియా సమావేశంలో ప్రకాష్‌బాబు మాట్లాడుతూ 2024 డిసెంబర్ 24 శతాబ్ది ఉత్సవాలు కాన్పూర్‌లో ప్రారంభమయ్యాయని ముగింపు కమ్యూనిస్టు ఖిల్లా ఖమ్మంలో ముగుస్తున్నాయన్నారు. శతాబ్ద కాలం ప్రజల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పనిచేశామని అదే సిద్ధాంతం, లక్ష్యంతో భవిష్యత్తులోనూ పోరాడతామన్నారు. మతోన్మాద శక్తులను నిలువరించే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు.

**మూడు ప్రదర్శనల ద్వారా సభా స్థలికి : బాగం**

మూడు ప్రదర్శనల ద్వారా ప్రజలు బహిరంగ సభా స్థలికి చేరుకుంటారని ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. పెవిలియన్ మైదానం నుంచి జనసేవాదళ్ ప్రదర్శన ప్రారంభమవుతుందని దీనికి రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, నాయకత్వం వహిస్తారని తర్వాత కళాకారుల వృత్తి సంఘాల ప్రదర్శన ఉంటుందన్నారు. రెండవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని దీనికి జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మూడవ ప్రదర్శన నయాబజార్ కళాశాల కాల్వొడ్డు నుంచి ప్రారంభమవుతుందని దీనికి ఏపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దండి సురేష్ నాయకత్వం వహిస్తారని హేమంతరావు తెలిపారు. మూడు ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద మూడు ప్రదర్శనలకు జాతీయ నాయకులు స్వాగతం పలికేందుకు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళారూపాల ప్రదర్శనకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ పాల్గొన్నారు.

## 'జ్ఞాన సరస్వతి' వర్సిటీ
(మొదటి పేజీ తరువాయి)

దాని ఏర్పాటు జాప్యం జరిగిందని సిఎం అభిప్రాయపడ్డారు. దీనికి పరిష్కారంగా, చదువుల తల్లి కొలువైన బాసరలోనే 'జ్ఞాన సరస్వతి యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బాసర ఐఐఐటి ఆవరణలో దీనిని నెలకొల్పాలని, ఇందుకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును వేదికపైనే ఆదేశించారు. ఈ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణ విద్యార్థులకు వరంలా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**తుమ్మిడిహట్టి ప్రాజెక్టుతో సస్యశ్యామలం**

''జల్, జంగల్, జమీన్'' అని నినదించిన పోరాటాల గడ్డపై రైతులకు అన్యాయం జరగనివ్వబోనని సిఎం హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ రైతాంగానికి సాగునీరు అందాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాల్సిందేనని, గత పాలకులు దీనిని విస్మరించారని విమర్శించారు. రాబోయే బడ్జెట్ సమావేశాలలోపు తుమ్మిడిహట్టి ప్రాజెక్టు పై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆదేశించారు. ప్రాజెక్టులోని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని వెల్లడించారు. అలాగే చనాక–కొరటా ప్రాజెక్టుకు సి.రామచంద్రారెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకీ నర్సారెడ్డి పేరు పెడుతున్నట్లు ప్రకటించి, వారి సేవలను కొనియాడారు.

**ఎయిర్ బస్ నుంచి పారిశ్రామిక హబ్ వరకు..**

జిల్లా రవాణా, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని సీఎం చెప్పారు. ''ఒకప్పుడు ఎర్రబస్సు తిరగని ఆదిలాబాద్‌లో,ఇప్పుడు ఎయిర్ బస్ తిరిగేలా ఎయిర్‌పోర్టును నిర్మిస్తా'' అని ప్రకటించారు. కేవలం ఎయిర్‌పోర్టుతో ఆగకుండా, దాని అనుబంధంగా 10 వేల ఎకరాలలో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామన్నారు.దీనివల్ల స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, ఎన్నికలు ముగిశాక కేవలం అభివృద్ధిపైనే దృష్టి సారించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సాధించుకుంటానని స్పష్టం చేశారు. ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు.తనకు ఎలాంటి పర్సనల్ ఎజెండాలు లేవని,కేవలం ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాల అమలు..**

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల గురించి సీఎం వివరిస్తూ.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు సన్నబియ్యం బోనస్ వంటి పథకాలు నిరాటంకంగా కొనసాగుతాయని చెప్పారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. చివరగా, ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజా ప్రతినిధులు,అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సుదర్శన్ రెడ్డికి సూచించారు. జిల్లాకు కావాల్సిన నిధులపై నివేదిక ఇస్తే వెంటనే మంజూరు చేస్తామని, పాలమూరు జిల్లాకు సమానంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని వాగ్దానం చేస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.


## రూ.3.90కోట్ల కుంభకోణం
(మొదటి పేజీ తరువాయి)

సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్‌టాప్లు, ఐదు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో వసునూరి బసవరాజు, యాదాద్రి జిల్లా, జెల్లా పాండు, యాదాద్రి జిల్లా,మహేశ్వరం గణేష్ కుమార్,ఇయాదాద్రి జిల్లా, ఈగజులపాటి శ్రీనాథ్, జనగామ, యెనగంధుల వెంకటేష్, జనగామ,కోదురి శ్రవణ్, జనగామ, కొలిపాక సతీష్ కుమార్, కొడకండ్ల (ఎం), జనగామ,తడూరి రంజిత్ కుమార్, నర్మెట్ట, జనగామ, దుంపల కిషన్ రెడ్డి, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, దశరథ మేఘావత్, తుర్కపల్లి,నారా భాను ప్రసాద్, యాదగిరిగుట్ట, గొపగాను శ్రీనాథ్, యాదాద్రి జిల్లా ఒగ్గు కర్నాకర్, యాదాద్రి జిల్లా, కమల్ల శివ కుమార్,అమంగల్, నల్లగొండ, అలేటి నాగరాజు, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారని, ఇందులో నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్ లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చేల్లించాల్సన మొత్తాన్ని ఏన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుండి అన్లైన్ సర్వీస్ వ్యక్తులకు మరియు మద్యవర్తులకు కమిషన్ చోప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడన్నారు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణీ/భూభారతీ వెబ్సైట్లో ఇన్ స్పెక్ట్ ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుము తగ్గించేవాడని, అనంతరం అట్టి ఛలాన్ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడని,ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయములో మద్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారన్నారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడి కావున జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మద్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారని, ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారన్నారు.ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారరని, అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయని, ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాదాద్రి జిల్లాలో 15కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.ఈ ముఠా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఎ.ఎస్పీ పందరి చేతన్, జనగామ ఇన్స్పెక్టర్ సత్యానారయణ రెడ్డి, రఘునాథ్‌పల్లి సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఆర్‌టిసి బస్సులు
(మొదటి పేజీ తరువాయి)

ప్యాకెట్లో దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వస్తువులు అందజేయడం జరుగుతుంది. ఇందుకుగానూ, బంగారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299 చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్సైట్లో లాగిన్ ద్వారా లేదా సమీపంలోని టిజిఎస్‌ఆర్‌టిసి లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం, టిజిఎస్‌ఆర్‌టిసి కాల్ సెంటర్‌ను 04069440069, 04023450033 నంబర్లలో సంప్రదించవచ్చు.

## సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు



నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా,ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5వేల ఎకరాలు, కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు. పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుకు మరణంలేదు..

# కమ్యూనిజానికి అంతం లేదు



**కూనంనేని సాంబశివరావు**
**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి**

ఎన్నో కుట్రలు..ఎన్నెన్నో నిర్బంధాలు..ఉరికొయ్యలను ఛేదించి చెరసాలల్లో పురుడుపోసుకొని భారత గడ్డ పై నిండు నూరేళ్ళుగా ప్రస్థానం సాగిస్తున్న అజరామర త్యాగాలగని భారత కమ్యూనిస్టు పార్టీ. 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ముగింపు వేడుకలను లక్షలాది మందితో కమ్యూనిస్టుల పురిటిగడ్డ ఖమ్మం పట్టణంలో ఈ నెల 18వ తేదీన జరపడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. భారతదేశ చరిత్రలో మహత్తర ఘట్టంగా నిలవబోతున్న ఈ భారీ బహిరంగసభకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతున్నారు. 10వేల మంది అరుణ సైన్యం కవాతు చేయబోతున్నది. ఎర్రసముద్రంగా మారబోతున్న ఖమ్మం బహిరంగసభకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సౌహార్ధ సందేశం ఇవ్వబోతున్నారు. నాలుగు రోజులపాటు జరుగుతున్న వేడుకలలో 20వ తేదీన నిర్వహించే సెమినార్‌కు డి.రాజాతోపాటు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వార్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతున్నారు.

కంసుడు శ్రీకృష్ణుడిని పుట్టుకతోనే అంతంచేయ ప్రయత్నించిన విధంగా భారత కమ్యూనిస్టు పార్టీని చెరసాలలోనే పసిగుడ్డు ప్రాయంలోనే బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస ప్రభుత్వం అంతమొందించే ప్రయత్నం చేసింది. తుదకు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని మట్టికరిపించడంలో కమ్యూనిస్టు పార్టీ వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసింది.

**కమ్యూనిస్టు పార్టీ పుట్టుక–అవలోకనం**

సిపిఐ పుట్టుకే శ్రామికవర్గ అంతర్జాతీయత, దేశభక్తితో మిళితమై ఉంది. వివిధ విభాగాలుగా ఉన్న దేశభక్తులను, స్వాతంత్ర్య సమరయోధులను కమ్యూనిజంవైపు తీసుకువచ్చింది. ఆవిధంగా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో నాలుగు ప్రధాన స్రవంతులు కలిశాయి.

1) మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విదేశాలలో, ఆ తర్వాత జర్మనీ, అమెరికా, టర్కీ, ఆఫ్ఘనిస్థాన్‌లలో విప్లవ కార్యాచరణలో ఉన్న భారత జాతీయ విప్లవకారులు అక్టోబర్ విప్లవ ప్రభావం క్రిందకు వచ్చారు. యం.చటోపాధ్యాయ, బర్కాతుల్లాఖాన్, ఎంపిబిటి ఆచార్య, ఎంఎన్.రాయ్, అబని ముఖర్జీ తదితరులు ఒక స్రవంతి.

2) సామ్రాజ్యవాదులు, కాలిఫ్‌ల పట్ల జరిపిన అన్యాయాలకు వ్యతిరేకంగా ఇండియాలోని ముస్లీం ప్రజలు యుద్ధ కాలంలో (1914–16) విదేశాలకు వెళ్లి పాన్ ఇస్లామిక్ ఖిలాపత్ ఉద్యమాన్ని నిర్మించిన ఉద్యమకారులు, యుద్ధానంతరం మహత్తర హిజ్రత్ ఉద్యమానికి సంబంధించిన జాతీయ విప్లవకారులు కూడా అక్టోబర్ విప్లవ ప్రభావం క్రిందకు వచ్చారు. వారిలో మహ్మద్ అలీ షఫిక్, రహమత్ ఆలిఖాన్, ఫిరోజుద్దీన్ మల్సూర్, అబ్దుల్ మజీద్, సౌకత్ ఉస్మానీలు ముఖ్యులు.

3) స్వాతంత్ర్య సాధనలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని సాగించే ఆలోచనతో ఆయుధాల సేకరణకు కొన్ని గ్రూపులు విదేశాలకు వెళ్లాయి. కెనడా, అమెరికా తదితర దేశాల్లో స్థిరపడిన భారతీయులు ముఖ్యంగా పంజాబీలు 1913లో శాన్‌ఫ్రాన్సిస్కోలో ‘గదర్ పార్టీ’ని స్థాపించారు. కామా గటమార్ అనే ఒక ఓడను ఆయుధాలతో ఇండియాకు పంపించారు. ఆ పోరాటం విఫలమైన తర్వాత గదర్‌పార్టీ ముఖ్యులందరూ భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో రతన్ సింగ్, సంతోష్ సింగ్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు వ్యక్తి దర్శి చెంచయ్యలాంటి అనేక మంది ఉన్నారు.

4) భారతదేశంలో ఉన్న జాతీయ విప్లవకారులు, జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తున్న సోషలిస్టు కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది, అతివాదపక్షం, టెర్రరిస్టు సంస్థలు, ఖిలాపత్ ఉద్యమ నాయకులు, గదర్ పార్టీ నాయకులు 1921–22లో శాసనోల్లంఘన ఉద్యమం విఫలమయిన తర్వాత గాంధీజి ప్రతిఘటన సిద్ధాంతంపట్ల భ్రమలు కోల్పోయిన వ్యక్తులు, గ్రూపులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో శాస్త్రీయ సోషలిజంవైపు ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత వీరే దేశంలో తొలి కమ్యూనిస్టు గ్రూపులు స్థాపించారు. బొంబాయిలో డాంగే, మద్రాసులో సింగార్‌వేల్ సెట్టియార్, కలకత్తాలో ముజఫర్ అహ్మద్, లాహోర్‌లో ఇంక్విలాబ్ గ్రూపులకు చెందిన గులాం హుస్సేన్ తదితరుల కలయికతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అయ్యింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో, రైతాంగ పోరాటాలలో, స్వదేశీ సంస్థానాల్లో, విముక్తి పోరాటాల్లో, సంఘ సంస్కరణలు, సామాజిక మార్పుల కోసం జరిగిన పోరాటాల్లో ఇంకా అనేక రీతుల్లో జరిగిన భారత ప్రజల విప్లవ ఉద్యమంలో పాల్గొన్న ముఖ్యుల్లో అత్యధికులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

1920లో రష్యాకు చెందిన తాష్కెంట్‌లో ప్రవాస భారతీయులు భారత కమ్యూనిస్టు పార్టీ అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. సంస్థాపన సమావేశంలో ఏడుగురు పాల్గొన్నారు. వారిలో ఎంఎన్.రాయ్, ఎలెన్ రాయ్, అబని ముఖర్జి, రోజా ఇటింగఫ్, ఎంపిబిటి ఆచార్య, ఇరువురు విదేశీయులు ఉన్నారు. కార్యదర్శిగా మహ్మద్ షఫి ఎన్నికయ్యారు. ఎం.ఎన్. రాయ్ ఆ సమావేశంలో పాల్గొన్నప్పటికీ దాన్ని ఆయన సమర్థించలేదు. భారత్‌లోని కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకున్నారు. భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకుడు ఎం.ఎన్.రాయ్ అని వ్యాప్తిలో ఉన్న అభిప్రాయాన్ని ఆయన స్వయంగా తన ‘స్మృతుల్లో’ నిరాకరించారు. 1920లో విదేశీ గడ్డపైన ఏర్పాటైన ఆ తేదీని పార్టీ సంస్థాపక తేదీగా పరిగణించరాదని ఉమ్మడి పార్టీ రోజుల్లోనే కేంద్ర కార్యదర్శివర్గం నిర్ణయించింది. ఆ విధంగా సత్యభక్త ఆధ్వర్యంలో కాన్పూర్‌లో జరిగిన మహాసభలో 1925 డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన రోజును భారతదేశంలో పార్టీ వ్యవస్థాపక దినంగా పార్టీ గుర్తించింది. సింగార్‌వేల్ సెట్టియార్ మహాసభకు అధ్యక్షత వహించారు. ఎస్‌వి.ఘాటే, జెపి బాగర్‌హోట్‌లు కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా హస్రత్ మోహాని వ్యవహరించారు. ఆయనే ఇంక్విలాబ్ నినాద సృష్టికర్త. భగత్‌సింత్ ఇంక్విలాబ్ జిందాబాద్ నినదిస్తూ ఉరికంబం ఎక్కారు.



**ఎన్నో కుట్ర కేసులు :**

కమ్యూనిస్టు భావాలను అంకురార్పణ దశలోనే అణచివేసేందుకు బ్రిటీష్ పాలకులు కమ్యూనిస్టులపై ఎన్నో కేసులు పెట్టారు. అందులో ముఖ్యమైనవి 1922లో మోపబడ్డ పెషావర్ కుట్ర కేసు, 1924లో కాన్పూర్ కుట్రకేసు, 1929లో మీరట్ కుట్రకేసు. కాన్పూర్ కుట్ర కేసులో ముజఫర్ అహ్మద్, డాంగే, సౌకత్ ఉస్మానిలు ఇరికించబడ్డారు.

**చారిత్రక మీరట్ కుట్రకేసు :**

1929లో కలకత్తాలో అఖిల భారత కార్మిక మహాసభ జరిగిన తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం 31మంది కమ్యూనిస్టు నాయకులను, ఇతర పెద్ద నాయకులనందరిని అరెస్టు చేసింది. ఈ కేసు విచారణ 1929 నుండి 1933వరకు నాలుగేళ్ళు కొనసాగింది. కమ్యూనిస్టులు కోర్టును ప్రచార వేదికగా తమ సైద్ధాంతిక విస్తరణకు మీరట్ కుట్ర కేసును ఉపయోగించుకున్నారు.

**లాహోర్ కుట్రకేసు :**

సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్న పంజాబ్ కేసరి లాలా లజపతి రాయ్‌పై బ్రిటీష్ పోలీసులు విచ్చలవిడిగా లాఠీఛార్జి చేయడంతో ఆయన మరణించారు. దానికి కారకుడైన శాండర్స్‌ను 1928 డిసెంబర్ 17న భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజ్‌గురులు లాహోర్‌లో కాల్చి చంపారు. దీనికి తోడు కేంద్ర శాసనసభలో 1929 ఏప్రిల్ 8న తమ పార్టీ ఆదేశానుసారం భగత్‌సింగ్, డికే దత్తు బాంబులు వేశారు. రెండు సంవత్సరాలు జరిగిన కోర్టు విచారణ సందర్భంగా దేశభక్తి గేయాలు పాడుకుంటూ, విప్లవం వర్థిల్లాలి (ఇంక్విలాబ్ జిందాబాద్) అనే నినాదాలతో ‘మేరారంగ్‌దే.. బసంతి ఛోళా’అనే పాటతో ఈ విప్లవ వీరులు కోర్టు హాల్‌లోకి ప్రవేశించేవారు. తదనంతరం 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారు. తదనంతరం భగత్‌సింగ్ సహచరులు అందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

జితిన్‌దాస్ అనే మరో వీరుడు జైలులో 60 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి వీరమరణం పొందాడు.

**కమ్యూనిస్టు పార్టీ నిషేధం**

కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రమాదకరంగా భావించిన బ్రిటీష్ ప్రభుత్వం 1934 జూలైలో పార్టీని నిషేదించింది. ఈ నేపధ్యంలో కమ్యూనిస్టులందరూ కాంగ్రెస్‌లోనే ఉండి పనిచేసి దేశస్వాతంత్ర్యం కొరకు ద్విగుణీకృత పోరాటాలు చేశారు.

కాంగ్రెస్‌లోనే అంతర్భాగంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని 1932–34 ఏర్పాటు చేసుకున్నారు. అంతిమంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోని కమ్యూనిస్టులతో పాటు మరెంతో మంది అభివృద్ధి కాముకులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో కాంగ్రెస్‌లోని వామపక్ష గ్రూపుగా ఏర్పడ్డారు. తదనంతరం అనేక మంది కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో ఇఎంఎస్ నంబూద్రిపాద్, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, ఏకె. గోపాలన్, కంభంపాటి సీనియర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు ప్రముఖులు.

**కమ్యూనిస్టు పార్టీ చేసిన వీరోచిత పోరాటాలు**

ఒకనాటి అస్సాం రాష్ట్రంలో ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న చాబర్ సిల్‌హెట్ జిల్లాలోని లోయ ప్రాంతంలో వీరోచిత కౌలు రైతుల పోరాటాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. ఆ పోరాటవీరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

మహారాష్ట్రలోని థానే జిల్లాలో భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా వర్లీ తెగకు చెందిన ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. 1946లో రాయల్ ఇండియన్ నావీ తిరుగుబాటుదారులు కాంగ్రెస్, ముస్లింలీగ్ జెండాలతోపాటు కమ్యూనిస్టు పార్టీ జెండాను చేతబూనారు.

పశ్చిమబెంగాల్‌లోని కౌలు రైతులు చేసిన ‘‘తెభాగ’’ పోరాటం చరిత్ర ప్రసిద్ధమైంది. కేరళలోని తిరువాన్‌కూర్ సంస్థానంలో కొబ్బరిపీచు కార్మికుల, వ్యవసాయ కార్మికుల, మత్స్య కార్మికుల వీరోచిత పోరాటం ఉన్నప్రవాయిలార్ (మలబార్) పోరాటంగా ప్రసిద్ధిగాంచింది.

ఫ్రెంచ్ వలస పాలన నుంచి పుదుచ్చేరి విముక్తి పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విజయవంతమైంది. పుదుచ్చేరిలో కమ్యూనిస్టు అగ్రనాయకుడైన కీ.శే. వి.సుబ్బయ్యను ఆ రాష్ట్ర విముక్తి ప్రదాతగా గౌరవిస్తారు.

భగత్‌సింగ్ వంటి జాతీయ విప్లవకారుడు సోషలిస్టు సిద్ధాంతం పట్ల ప్రభావితమయ్యారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ తదితరులు హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ పార్టీని ఏర్పాటు చేశారు. తదనంతర కాలంలో భగత్‌సింగ్ సహచరులైన అజయ్ ఘోష్, శివవర్మ, పండిట్ కిషోరీలాల్, విజయ్‌కుమార్ సిన్హా, జయ్‌దేవ్ కపూర్, భగవతి చరణ్, సుఖ్‌దేవ్ లాంటి వారు సిపిఐలో చేరారు. అజయ్ ఘోష్ ఉమ్మడి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూనే 1962లో మరణించారు.


**చారిత్రాత్మక కకోరి పోరాటం**

లక్నో సమీపంలోని కకోరీ రైల్వే స్టేషన్‌పై దాడిచేసి డబ్బు సంపాదించి ఆయుధాలు కొనుగోలు చేయాలను కొని కొందరు విప్లవకారులు దాడి చేశారు. ఇది కకోరి కుట్రకేసుగా ప్రసిద్ధి చెందింది. ఈ కేసులో ఆసిఫ్ ఖాన్,

(మిగతా 6వ పేజీలో)




## సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవం దేనికి సంకేతం??



**కె.నారాయణ**
**సిపిఐ సీనియర్ నాయకులు**

‘పుట్టేవాడికి అన్న, పెరిగేవాడికి తమ్ముడు అదేగా సీపీఐ. నీకు సమకాలికుడు నారా చంద్రబాబు నాలుగు దఫాలు ముఖ్యమంత్రి, నిన్నగాక మొన్నపుట్టిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి, మీపార్టీ పుట్టిన 1925 సంవత్సరమే ఆర్ఎస్ఎస్ పుట్టింది, అదేమో రాజ్యాధికారానికే వచ్చే .నీవేమో జండాలు పట్టుకుని తిరుగుతున్నావు, అంతేనా??’ అని నన్ను ప్రశ్నిస్తుంటారు.

మెరిచేదంతా బంగారం కాదు, చూసేదంతా నిజమూ కాదని నానుడి ఉంది, అది తర్కం ద్వారా నిజమని తేలింది. అయితే ఆ తర్కంలోకి పోవడానికి యిది సందర్భం కాదు.

సిపిఐ గురించి మరోకోణంలో చూడగలిగితే చరిత్రకు న్యాయం జరుగుతుంది.

నిజమే వంద సంవత్సరాలలో సీపీఐ ఏమీ చేయలేదా???

స్వతంత్ర పోరాటం 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా గుర్తించబడింది. (అయితే అది సిపాయి తిరుగుబాటుగా దురుద్దేశంతో పిలవబడింది )

1885 లో బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి కాంగ్రెస్ పార్టీ స్థాపించబడింది.

1915 నుండి గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారు. అ ఉద్యమంలో యథాతథ వాదులు ,తీవ్రవాద భావజాలం కలవారు సంయుక్తంగా పని చేశారు. అయితే స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక స్పష్టత కొరవడింది. ఎలాంటి స్వాతంత్ర్యం కావాలి? పరిమిత స్వతంత్రమా లేక సర్వ స్వతంత్రమా? (సంపూర్ణ).

దీనిపై చర్చోప చర్చలు జరిగాయి. కమ్యూనిస్ట్ భావాలు కలిగిన వారి ఒత్తిడి మేరకే కాంగ్రెస్ సభ సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానం ఆమోదించబడింది. స్వాతంత్ర్యానంతరం ఎలాంటి స్వాతంత్ర్యం అమలు జరగాలో దానిపై గాంధీకి గానీ కాంగ్రెస్ పార్టీకిగాని స్పష్టత లేదు, లేదా యివ్వదలుచుకోలేదో ???

ఇక ముసుగులో గుద్దులాటకన్నా బహిరంగంగా రావడమే మేలని కమ్యూనిస్టులంతా కలిసి 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సమావేశమై జాతీయ స్థాయి పార్టీగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేసుకున్నారు.

మొదటి తీర్మానం సంపూర్ణ స్వాతంత్ర్యం, రెండు, దున్నేవాడికే భూమి తదితర మౌలిక అంశాలతో ప్రజలముందుకు వచ్చింది సిపిఐ.

ఆనాటినుండి భూ సమస్య తెరమీదికి రావడమేగాక, భూమికోసం భుక్తి కోసం తెలంగాణా సాయుధ పోరాటం, బెంగాల్‌లో తేభాగ, కేరళలో పున్నప్ర, ఆంధ్రాలో చల్లపల్లి జమీందారీ వ్యతిరేకపోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. భూ సమస్య జాతీయస్థాయి అజెండాగా ముందుకు వచ్చింది.

1917లో రష్యాలో కమ్యూనిస్టు విప్లవ విజయం ప్రభావం మనదేశంపై పడింది. ఆ ప్రభావమే బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వాన రూపొందించిన భారత రాజ్యాంగం, అలాగే ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌పై కూడా ప్రభావం పడబట్టే పబ్లిక్ సెక్టార్ నిర్మాణం.

జమ్మూ కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు ఉద్యమాలలో కమ్యూనిస్టుల ప్రతిఘటనే భారతదేశ ఐక్యతకు తోడ్పడింది. ఈ ప్రతిఘటనోద్యమంలో అనేకమంది యోధులను పోగొట్టుకున్న పార్టీ ఏదైనా వుంది అంటే అది సీపీఐ మాత్రమే.

పై ఉద్యమాలలో ఏ ఒక్కరోజయిన ఆర్ఎస్ఎస్, ఆనాటి జనసంఘ్ ఇప్పటి బిజెపి వ్యక్తులు పాల్గొన్నారా? జైలుకు వెళ్లారా?

అధికారం లేకపోయినా దేశాన్ని కాపాడగలిగాం దళితులకు,గిరిజనులకు యితర బలహీన వర్గాలకు అండగవున్నది కమ్యూనిస్టులేనని గుండె మీద చేయి వేసుకుని చెప్పగలం.

61 మంది వామపక్ష పార్లమెంట్ సభ్యులుండబట్టే గదా పనికి ఆహార పథకం సాధించగలిగాం.

కమ్యూనిస్టులు బలహీనపడబట్టేగదా అటు పార్లమెంట్‌లోనూ, యిటు శాసనసభలలో ప్రజాసమస్యలపై చర్చలు జరగకూడా నీవు వెధవవి నీవే వెధవవి తిట్టిపోసుకుంటూ, సంపద యావత్తూ కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేసే కుటిల యత్నాలు సాగుతున్నాయి.

ఇపుడు చెప్పండి! కమ్యూనిస్టులు దేశ మౌలిక విధానాల యెడల నిబద్ధతగా నిలబడ్డారా,లేదా?

వందేళ్ల సిపిఐ ప్రస్థానంలో భారతదేశ పురోభివృద్ధికి కొలమానంగా నిలబడ్డామా, లేదా?

ప్రస్తుతం కమ్యూనిస్టుల కర్తవ్యమేమిటి? ఎర్రజండాకు అంకితమయిన పార్టీలన్నీ ఒకగూటికి చేరాల్సిన తరుణం ఆసన్నమయింది. ఆలస్యం అమృతం విషం!

# కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్తు ఏమిటి?



**కె.శ్రీనివాస్‌రెడ్డి**

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సాధనలో మహోజ్వల పాత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాలను పూర్తి చేసుకుంది. భారత జాతీయ కాంగ్రెస్ 1885 డిసెంబర్ 28న ఏర్పడింది. ఆ తరువాత 1925 డిసెంబర్ 26న ఏర్పడిన పార్టీ సిపిఐ. సిపిఐ నిర్వర్తించిన మహోజ్వల పాత్రకు ఆనాటికే దేశంలో స్వాతంత్ర సాధన సమరానికి పరిస్థితులు పరిపక్వ దశకు చేరుకుంటున్నాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకత, ఫ్యూడలిజానికి వ్యతిరేకమైన వెల్లువలు, వ్యవసాయిక విప్లవం ప్రజల ఆదరణను పొందుతున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకులనేకమంది యువకులేనన్నది ఇక్కడ గుర్తించాలి. ఇందులో అత్యధికులు భారత జాతీయ కాంగ్రెస్‌లో తమ భూమికను పోషిస్తున్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలు స్వాతంత్ర్య పిపాసతో పోరాటాలకు సన్నద్ధమవుతున్న ప్రజల మనోభావాలకి అనుగుణంగా లేవన్న భావన వీరిలో నెలకొనటంతో భిన్నాభిప్రాయాలతో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని విప్లవాత్మక పంథాలో ఎదిరించాలన్న భావాలు ఉన్నందున ఈ ఆలోచనలు చివరికి భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు దారి తీసాయి. అప్పటికే సోషలిస్టు దేశంగా సోవియట్ యూనియన్ అవతరించడంతో సైద్ధాంతిక అవగాహన కూడా పెంపొందించుకోవడానికి, మార్క్సిజం వైపు ఆకర్షించబడటానికి మార్గం సుగమమైంది. అందులో భాగమే మీరట్ కుట్ర కేసు, పెషావర్ కుట్ర కేసు, కాన్పూర్ కుట్ర కేసు, తెభాగ, తెలంగాణ సాయుధ పోరాటం, పున్నప్ర–వయలార్ పోరాటాలు, వీటికి తోడు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానాలు. అందుకే జాతీయోద్యమంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలను చరిత్రకారులు సువర్ణాక్షరాలతో లిఖించదగినవని పేర్కొన్నారు.

వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొన్న మాట వాస్తవం. సాగించిన పోరాటాలన్నీ దేశాభ్యుదయానికి, ప్రజల సామాజిక అభివృద్ధికి సాగించినవే తప్ప మరొకటి కాదు. అందులో ఒడిదొడుకులను ఎదుర్కొన్నది. 1947 దేశ స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య భారతదేశంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్షంగా ప్రజలు ఎన్నుకున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ. ప్రజలు ఈ పార్టీని ప్రత్యామ్నాయ పార్టీగా భావించారు. ఆదరించారు. స్వతంత్ర దేశంలో ప్రజాస్వామ్య హక్కులు, కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం అన్న అంశాలపై నాడు కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు సాగించి నిర్ణయాత్మకమైన విజయాలను సాధించింది. అందుకే ఆనాడు ఇది తమ ప్రత్యామ్నాయ పార్టీ అని ప్రజలు గుర్తించారు. ఆ తరువాత జరిగిన పరిణామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆంతరంగిక సైద్ధాంతిక విభేదాలతో ఐక్యతా విఘాతం జరిగింది. చివరికి భారత కమ్యూనిస్టు పార్టీ విభజనకు గురైంది. ఈ విభజన కమ్యూనిస్టు శ్రేణులను, పార్టీ శ్రేయోభిలాషులను, కార్మిక వర్గాన్ని నిరాశకు గురిచేసినప్పటికీ, ఆ తరువాతి కాలంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు (సిపిఐ, సిపిఐ(ఎం)) ఒంటరి పోరాటాలు, ఐక్య పోరాటాల ఫలితంగా కమ్యూనిస్టు పార్టీలని విస్తరించి, ప్రజా విశ్వాసాలను తిరిగి కొంత పొందగలిగాయి. కానీ, ప్రజల పూర్తి విశ్వాసాన్ని చూరగొనలేకపోయాయి. విభజన వల్ల కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయ పార్టీగా అధికారాన్ని చేపట్టే అవకాశాలను, అధికారంలో నిరాటంకంగా కొనసాగుతున్న భారత జాతీయ కాంగ్రెస్‌ను 1967లో అనేక రాష్ట్రాలలో తృణీకరించిన ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. పలు పార్టీలతో కూడిన సంయుక్త విధాయక్ దళ్ (ఎస్‌విడి) ప్రభుత్వాలకు ప్రజలు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ కోల్పోవటానికి పార్టీలో అంతర్గత విభేదాలే కారణంగా భావిస్తున్నారు. తరువాత పరిణామాల్లో సోషలిస్టు శిబిరం అంతర్ధానం మరో శరాఘాతం.




దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో 1991లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల పేరుతో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలను ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణల అమలు ద్వారా ప్రైవేటు పెట్టుబడిదారులకు ద్వారాలు బార్లా తెరిచింది. ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ సంపద ప్రైవేటు వ్యక్తుల సంస్థల పాలవడంతో పాటు సంపద కేంద్రీకరణకు బాహాటంగా తోడ్పడుతున్నది. మరోవైపు, ఆ విధానాలు శ్రమజీవులను, కార్మిక వర్గాన్ని దోపిడీ చేయటానికి నిరాటంకంగా దోహదపడుతున్నాయి. అనేక చట్టాల ద్వారా సాధించుకున్న హక్కులు కాగితాలకు పరిమితమయ్యాయి. దీంతోపాటు నూతన శ్రామిక వర్గం కూడా ఆచరణలోకి వచ్చింది. అప్పటి వరకు కొనసాగుతున్న పారిశ్రామిక కార్మిక వర్గంతో పాటు, ఐటి, బిపిఒ తదితర సాఫ్ట్‌కాలర్ ఉద్యోగవర్గం కూడా వచ్చింది. ఊహించినదానికన్నా మధ్య తరగతి మరింత పెరిగింది. దీనికి తోడు భారతదేశంలో యువజనుల శాతం ఊహకందని రకంగా పెరిగి యువదేశంగా ప్రపంచంలో మొదటిస్థానంలో నిలిచింది.

ఈ పూర్వరంగంలో శ్రామిక వర్గ పార్టీలు, ప్రత్యేకంగా కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల రంగంలో, సంస్థాగత నిర్మాణరంగంలో, ఉద్యమాల రీత్యా ప్రజల ఆకాంక్షలను అందుకోలేకపోతున్నాయన్న ప్రధాన విమర్శను ఎదుర్కొంటున్నాయి. కారణాలేమైనా, ఇందులో వాస్తవం లేకపోలేదు. రోజు రోజుకు ఎన్నికల ప్రక్రియ ధనికవర్గాలు, నేరమయ శక్తుల ఆధిపత్యంలోకి వెళ్ళిపోతున్నది. నిత్యం ప్రజా జీవితంలో ప్రజలకు అందుబాటులో ఉండే పార్టీలకు, శక్తులకు ఎన్నికల్లో పోటీ చేయటం శక్తికి మించినదిగా మారిపోతున్నది. వీటన్నిటి దృష్ట్యా శ్రామిక వర్గ పార్టీగా, మార్క్సిజం సిద్ధాంతంగా అనుసరించే భారత కమ్యూనిస్టు పార్టీ, ఇతర కమ్యూనిస్టు పార్టీలు సుదీర్ఘ సమాలోచనలతో, సామాజిక, సాంకేతిక పెను మార్పుల అవగాహనతో, ప్రజల ఆకాంక్షల పట్ల గౌరవంతో ముందుకు వెళ్ళాల్సిన తరుణమిది. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న 35 సంవత్సరాల యువత ఆలోచనలను, జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల భావాలను పరిగణనలోకి తీసుకోకుండా పార్టీ ముందడుగు వేసే అవకాశం లేదు. దీంతో పాటు, పారిశ్రామిక కార్మిక వర్గం కనుమరుగవుతున్న తీరును గమనంలోకి తీసుకోవడంతో పాటు, సాంకేతిక పెను మార్పుల మూలంగా ఉద్భవించిన నూతన ఉద్యోగులను, శ్రమదోపిడికి గురవుతున్న గిగ్ వర్కర్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లాంటి నూతన ఉద్యోగులను సంఘటితపరచటం కర్తవ్యంగా సాగాలి. భారతదేశం త్వరితగతిన గ్రామీణ భారతం నుండి నగరీకరణ చెందుతోంది. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయరంగం కార్పొరేటీకరణ మార్గాన్ని అనుసరిస్తున్నది. చిన్న, సన్నకారు, ఇతర వ్యవసాయ పనులకు మరొకవైపున శ్రామికుల కొరత నెలకొంటున్నది. ఈ సమస్యలన్నీ కార్మిక వర్గ పార్టీగా కమ్యూనిస్టు పార్టీకి ఒక సవాల్.

కమ్యూనిస్టు ఉద్యమం, భారత కమ్యూనిస్టు పార్టీ మన దేశంలో బలహీనపడిందన్నది వాస్తవం. అయితే, భారత కమ్యూనిస్టులకు దేశంలో

(మిగతా 6వ పేజీలో)




## ప్రజల గొంతుక ప్రజాపక్షం పత్రిక

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల గొంతుకగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక పనిచేస్తుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు భవన్‌లో శుక్రవారం ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను యాదగిరిరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు పని చేయాలన్నారు. నిత్యం ప్రజా సమస్యలను పరిశీలిస్తూ వాటిని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం పత్రికలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజిలేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, ప్రజాపక్షం పత్రిక మండల రిపోర్టర్ ఆరెకంటి రాధా కృష్ణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు తెలియజేయడంలో 'ప్రజాపక్షం' ముందంజ



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి చేతుల మీదుగా ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజలో ఉందన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీయడంలో పత్రిక అగ్రభాగాన ఉందని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, ఉపసర్పంచ్ జంగాల పుల్లయ్య (అనంతమ్మ), వార్డు సభ్యులు షేక్ రియాజ్ (మీరాబి ఉస్మాన్), షేక్ మస్తాన్, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు మోర్తాల వెంకటరెడ్డి, నాయకులు మైబెల్లి, అబ్దుల్, నాగుల్, అమరబోయిన శ్రీను, ఎర్రం శంబిరెడ్డి, తన్నీరు కొండ, మక్తుం అలీ, చింత్రియాల సైదులు, చిలక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో ప్రజాపక్షం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గ్రామ సర్పంచ్ సలహాదారుడు పగడాల సైదులు యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శాగం పెద్దిరెడ్డి,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్యముదిరాజ్ చేతుల మీదగా శుక్రవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోడ అల్వాల గ్రామ సర్పంచ్ నాంపల్లి సైదులు,రమావత్ కిషన్ నాయక్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంగోత్ పాందు నాయక్, సీనియర్ నాయకులు శాగం అంజిరెడ్డి,సైదిరెడ్డి,అనుముల శ్రీను, అంజి,కోటేష్ పాల్గొన్నారు.

## యువత ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ ఉద్దేశమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. నకిరేకల్‌లో 2026 సిఎం కప్ క్రీడా పోటీలును క్రీడా టార్చ్‌ను వెలిగించి,జెండా ఊపి క్రీడా జ్యోతి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక బలం, క్రమశిక్షణ,నాయకత్వలక్షణాలనుపెంపొందిస్తాయని అన్నారు.యువతలో ఆరోగ్య అవగాహన, క్రీడలపై ఆసక్తి పెంచడంలో క్రీడా జ్యోతి ర్యాలీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.క్రీడారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న,నాగులవంచవెంకటేశ్వరరావు,నకిరేకంటి ఏసురత్నం, మురారిశెట్టి కృష్ణమూర్తి,గాజుల సుకన్య,రాచకొండసునీల్,యాసారపు వెంకన్న, పి ఈటి విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## క్షణికావేశంలో హత్య



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఈనెల 15న జరిగిన హత్య మద్యం మత్తులో క్షణికావేశంలో హత్య చేశారని విచారణలో తేలిందని టూ టౌన్ ఎస్ఐ వై సైదులు తెలిపారు.మృతుడు మన్యం చంద్రయ్య నల్లగొండలోని లేబర్ క్యాంపులలో తాత్కాలిక నివాసం ఉంటూ రైల్వే కూలీ పనులు చేస్తున్న నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన కూలీలు నారాయణపేట జిల్లా ధన్వాడ చెందిన కూలీలు సంక్రాం తి పండుగ సందర్భంగా గతంలో వారికి జరిగిన చిన్నచిన్న గొడవలు మనసులో పెట్టుకొని గొడవ పడుతుండగా ఇరువురు గాల చెందిన మేస్త్రీ)లు వచ్చి వారికి నచ్చజెప్పి గొడవ సర్ది చెప్పడం జరిగిందని తెలిపారు.అక్కడ పక్కనే ఇంకొక లేబర్ క్యాంపులో ఒరిస్సా,శ్రీకాకుళం చెందిన కూలీలు రైల్వే స్టేషన్లో ఫ్యాబ్రికేషన్ ఐరన్ వర్క్ కోసం వచ్చిన కూలీ లైనటువంటి లింగరాజు,కుమార్,చంద్రశేఖర్‌లు అక్కడ నిలబడి ఉండి మృతుడు మన్యం చంద్రయ్య అతని అన్న ఎల్లస్వామి బుష్‌పోగు స్వాములతో తలల మీద కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో తల మీద తీవ్ర గాయాలై కింద పడిపోగా అతని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని పోగా అక్కడ అతన్నిపరీక్షించిన డాక్టర్లు మృతుడు చనిపోయాడని ధ్రువీకరించారని అన్నారు.అదేవిధంగా అన్న ఎల్ల స్వామి,బుష్ పోగు స్వామిలకు తలలకు తీవ్ర గాయాలు అయ్యాయని మద్యం మత్తులో క్షణికావేశంలో హత్య చేసిన వారిపై మృతుని అన్న ఫిర్యాదు మేరకు టూ టౌన్‌లో కేసు నమోదు చేయడంతో హత్యజరిగిన సంఘటన స్థలాన్ని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,టూ టౌన్ ఇన్చార్జి సిఐ ఏ రాజశేఖర్ రెడ్డిలు సందర్శించారని తెలిపారు.

# ఊహాజనిత వార్తలకు 'ఫుల్ స్టాప్'

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి
ఆధారాలు లేకుండా కథనాలు రాయడం దురదృష్టకరం
మీడియాపై మాకు గౌరవం ఉంది.. కానీ బాధ్యత మరవద్దు
జర్నలిస్టుల అరెస్టులు బాధాకరం
భువనగిరి ఎంపి వెల్లడి



**ప్రజాపక్షం/యాదాద్రి :** మీడియాలో వస్తున్న ఊహాజనిత కథనాలు, తదనంతర అరెస్టుల పర్వంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కనుమ పండగ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, ఇటీవల ఒక ప్రముఖ ఛానల్ 'ఆఫ్ ద రికార్డు' కథనం వల్ల తలెత్తిన పరిణామాలపై స్పందించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు మీడియాలో వార్తలు వస్తున్నాయంటే ఖచ్చితమైన ఆధారాలు ఉండేవని, కానీ ప్రస్తుతం కేవలం ఊహాగానాలతో కథనాలు అల్లడం పరిపాటిగా మారిందని చామల విమర్శించారు. ఇలాంటి నిరాధార వార్తల వల్ల రాజకీయ నాయకులు, అధికారులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఒక మహిళా అధికారిణిని, ఆమె వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా కథనాలు రావడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఒక కేబినెట్ మంత్రి స్వయంగా ఖండించాల్సి వచ్చిందంటే 'విషయం ఇచ్చింది ఎవరు?' అన్నారంటే, సదరు వార్తలు వారిని ఎంతలా గాయపరిచాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వ్యక్తుల వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను ఇబ్బంది పెట్టే వార్తలకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని ఎంపీ స్పష్టం చేశారు. ప్రభుత్వంపై వస్తున్న ఒత్తిడి, బాధితుల ఆవేదన దృష్ట్యా ఇటువంటి చర్యలు తీసుకోక తప్పలేదని వివరించారు. జర్నలిస్టుల అరెస్టు వల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడటం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. తాను గానీ, సీఎం రేవంత్ రెడ్డి గానీ ఈ స్థాయిలో ఉండటానికి మీడియా ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో ఉందని చామల గుర్తు చేసుకున్నారు. 'మేము ప్రజలకు సుపరిచితులం కావడానికి మీడియానే కారణం. జర్నలిస్టుల పట్ల మాకు ఎంతో అభిమానం ఉంది. అయితే, మీడియా తన బాధ్యతను విస్మరించకూడదు' అని సూచించారు. నాయకులు తప్పు చేస్తే, అవినీతికి పాల్పడితే ఆధారాలతో సహా ఎండగట్టాలని, దానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కొన్ని సోషల్ మీడియా ఛానళ్లు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోబడుతున్నాయని, ప్రజలు నమ్మే ప్రధాన పత్రికలు, ఛానళ్లు 'ఆఫ్ ద రికార్డ్' పేరుతో ఊహలను ప్రచారం చేయవద్దని కోరారు. వ్యవస్థ సజావుగా సాగాలంటే మీడియా యాజమాన్యాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.85 లక్షలు వసూలు...

అంతర్ రాష్ట్ర నిందితుడు అరెస్ట్
అడిషనల్ ఎస్‌పి జి.రమేష్ వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ/చింతపల్లి :** విదేశాల్లో ఉన్నత చదువులు,ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన అంతర్ రాష్ట్ర నిందితుడిని చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారని అడిషనల్ ఎస్‌పి జి.రమేష్ పేర్కొన్నారు.శుక్రవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ముప్పాళ్ల లీలా కృష్ణ విదేశాల్లో ఉన్నత చదువులు చదివిస్తానని, అక్కడే ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుండి ఒక ల్యాప్‌టాప్,మూడు స్మార్ట్ ఫోన్లు,వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ కేసులో ముప్పాళ్ల లీలా కృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇతడు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో ఇప్పటివరకు మొత్తం 8 మంది నుండి సుమారు రూ.85 లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు గుర్తించారని తెలిపారు.ఈ విదంగా సంపాదించిన డబ్బులతో నిందితుడు కొంత డబ్బును విలాసాలకు , జల్సాలకు ఖర్చు పెట్టాడని తెలిపారు. మాల్ గ్రామం మర్రిగూడ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని గుర్తించిన చింతపల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో నిందితుడిపై ఇప్పటికే మాడుగులపల్లి పోలీస్ స్టేషన్,వరంగల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో చీటింగ్ కేసులు నమోదై ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు.ఈ కేసులో నేరస్థుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించి ప్రతిభ కనబర్చిన నాంపల్లి సీఐ డి.రాజు, చింతపల్లి ఎస్ఐ ఎం.రామ్మూర్తి చింతపల్లి పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# హైదరాబాద్‌కి వెళ్లే వాహనాల దారి మళ్లింపు

నేషనల్ హైవే 65పై ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు : జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ :** సంక్రాంతి పండగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పండగ పూర్తి చేసుకొని ఒకే సారి హైదరాబాద్ నగరానికి భారీగా వాహనాలు రానున్న నేపథ్యంలో నేషనల్ హైవే 65హైదరాబాద్ టు విజయవాడ పై చిట్యాల పెద్ద కాపర్తి వద్ద ఫ్లై ఓ వర్ నిర్మాణ పనులు కొన సాగుతోన్న నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నందున ట్రాఫిక్ రద్దీనిని వారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రయాణికులకు సురక్షితమైన, సునాయసమైన ప్రయాణ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ దారి మళ్లింపు చర్యలు చేపట్టిందన్నారు. ఈక్రమంలో ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు నల్లగొండ,మార్రిగూడ బైపాస్, మునుగోడు, నారాయణ పూర్,చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కి వెళ్లాలన్నారు. అదేవిధంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కోదాడ, హుజూర్ నగర్, మిర్యాల గూడ, హాలియా,చింత పల్లి, మాల్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. చిట్యాల,పెద్దకాపర్తిలో ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుండి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ,హైదరాబాద్‌పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి,ప్ర యాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని సూచించారు. సంక్రాంతి పండగ పూర్తి చేసుకున్న ప్రజలంతా తమ గమ్యస్థానాలకు హైద్రాబాద్‌కు సురక్షితంగా చేరుకోవాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని, ట్రాఫిక్ రద్దీ కారణంగా ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో దారి మళ్లింపు చర్యలు అమలు చేస్తున్నామన్నారు.



## నిబంధనల మేరకు అనుమతులు జారీ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పరిశ్రమలకు నిబంధనల మేరకు అధికారులు సకాలంలో అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటి, టిజి ఐ పాస్ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి సమీక్షించారు. 49 పరిశ్రమలకు గాను 119 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు ఆమోదించాలని సూచించారు. ఈ సమావేశంలో టిప్రైడ్ పథకం కింద 143 మంది లబ్ధిదారులకు రాయితీ మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని రైసు మిల్లులు, ఫార్మా అలాగే సిమెంట్ పరిశ్రమలు భద్రతా నిబంధనలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై త్వరలో అధికారులతో, యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి యాదగిరి, డిపిఓ కె యాదగిరి, ఆర్‌టిఓ జయప్రకాష్‌రెడ్డి, ఎస్‌సి డెవలప్‌మెంట్ అధికారి దయానందరాణి, ఎస్‌టి డెవలప్‌మెంట్ అధికారి కె శంకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్లు

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ల విషయమై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుకై జీవో ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేసే సమయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు నిబంధనల ప్రకారం, పారదర్శకంగా అమలు చేయాలన్నారు.గత ఎన్నికల రిజర్వేషన్ డేటా, జనాభా గణాంకాలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.మున్సిపల్ కమిషనర్లు వారి పరిధిలోని వార్డుల వివరాలు, రిజర్వేషన్ పట్టికలను ముందుగానే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని, అవసరమైన చోట స్పష్టత కోసం వెంటనే సంప్రదించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సవ్యంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

## నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి:** శ్రీ వేంకటేశ్వర స్వామిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 7:30 నిమిషాలకు శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.




## అరైవ్ ఎలైవ్ అనేది కేవలం ఒక్క రోజు కార్యక్రమం కాదు : డిఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సురక్షిత గమ్యం సజీవ ప్రయాణం (అరైవ్ ఎలైవ్) అనేది కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదని నిరంతర సామాజిక ఉద్యమమని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల రహిత సూర్యాపేట జిల్లా కోసం అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్లు బాధ్యతగా వ్యవహరించి కలిసి కట్టుగా పనిచేయాలని కోరుతూ రోడ్డు భద్రతపై అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రోడ్డు భద్రతపట్ల ప్రతి ప్రభుత్వ ఉద్యోగి వారి సిబ్బందికి విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడాలని, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పౌరులు బాధ్యతగా ఉండడం, ప్రయాణ సమయంలో సురక్షిత గమ్యాలను చేరుకోవడం లక్ష్యంగా రాష్ట్ర డిజిపి ఆధ్వర్యంలో అరైవ్ ఎలైవ్ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం రోడ్డు భద్రత పట్ల అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ అధికారులు, సిబ్బందితో రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏంవిఐ విక్రమ్, ఆర్‌టిసి సిఐ సైదులు నాయక్, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ లక్ష్మణ్, సూర్యాపేట ఎంఇఓ శ్రీనివాస్, ఎస్ఐలు సాయిరాం, మహేందర్, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## బ్రాహ్మణ వెల్లంల కుమ్మరిసంఘం నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం /నార్కట్‌పల్లి :** మండలం పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ కుమ్మరుల నూతన గ్రామ కమిటీని ఆ సంఘం జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీ ని ఎన్నుకున్నారు.శుక్రవారం గ్రామంలోని అంగన్వాడి సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కుమ్మరుల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా సిరిసన వాడ వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుగా సిరిసన వాడ శ్రీశైలం,ప్రధాన కార్యదర్శిగా నిరసన వాడ చిన్న నరసింహ,కోశాధికారిగా సిరిసనవాడ నరేష్,గౌరవాధ్యక్షులుగా సిరసనవాడ రంగయ్య, సహాయ కార్యదర్శిగా శిరసన వాడ జంగయ్య,సలహాదారుగా శిరసన వాడ లింగయ్యలు ఎన్నికైనారు. జిల్లా కమిటీ మెంబర్ తాడూరి చంద్రం,నకరెకల్ నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మనగోటి వెంకన్న,మండల శాఖ అధ్యక్షులు రాజు,ప్రధాన కార్యదర్శి సైదులు హాజరైనారు.

# పీడిత,తాడిత ప్రజల కోసం సిపిఐ పోరాటాలు




**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** ఖమ్మం జిల్లాలో ఈనెల 18నజరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల జాతీయ బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల సహాయ కార్యదర్శి చిలక రాజు రాములు పిలుపునిచ్చారు. సిపిఐ ధర్వేశిపురం గ్రామ శాఖలో బహిరంగ సభ వాల్ పోస్టర్,కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ భారత దేశంలో శతాబ్ది కాలంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మిక, విద్యార్థి, రైతు, మహిళ తదితర ప్రజా సంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు,కార్మికులను కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులుజినుకుంట్ల ఆంజనేయులు, గట్టిగుండ్ల ఎల్లయ్య,పిల్లుట్ల మురళి,యాదయ్య,పెద్దనర్సింహా, చరణ్, రిషికేష్,నర్సింహా,పండు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు ఆకుల రఘుమయ్య పటేల్ పిలుపు నిచ్చారు.శుక్రవారం కొండూరు గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పీడిత,తాడిత ప్రజల కోసం అనేక పోరాటాల చేసేందని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ శాఖ కార్యదర్శి వడ్డెమాను వెంకటయ్య అధ్యక్షత వహించగా నాయకులు ఆకుల వెంకట్రామ్ పటేల్,ఈద మారయ్య,బడేటి పెద్దయ్య,కుమ్మరి సత్తయ్య,



పడాల రాములు,నడింపల్లి సత్తయ్య,వడ్డేమాను రాములు,నున్ సావాత్ రమేష్,జర్పుల రామారాజు,ఆంబోతు నవీన్,జరుపుల రవి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ బిజిఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో జరుగు అఖిలభారత స్థాయి ముగింపు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో బహిరంగ సభ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, సిపిఐ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం నవీన్ , ఉపసర్పంచ్ గడ్డం యాదయ్య, బరిగెల శ్రవన్‌కుమార్, బాలరాజు , ఇరిగి గోపయ్య , అంజయ్య, ప్రవీణ్ , వెంకట్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.



## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మైనర్ అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా ప్రత్యేక బాధ్యతగా తీసుకోవాలని అర్వపల్లి ఎస్ఐ సైదులు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అరైవ్ ఎలైవ్ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వాహనదారులు హెల్మెట్ లేకపోవడం, డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి నగేష్, ఎంపిఓ గోపి, సిహెచ్ఓ బిచ్చు నాయక్, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఏఎన్ఎం సతీష్, మమత, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో సాగుకు నీళ్లు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని బిక్కేరువాగులో శ్రీరాంసాగర్ జలాలతో ధర్మారం చెక్ డాం ఎమ్మెల్యే మందుల సామేలు చొరవతో నిండి అలుగుపోస్తుంది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మందుల సామేలు పలుమార్లు మంటికైన ఇంటోడు ఉండాలి(మట్టిపనికైన ఇంటోడు ఉండాలి)అనే సామేలు నిజమైందని రైతుల్లో చర్చలు జరుగుతున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్లు ఎండుతున్నాయని అప్పటి ఎమ్మెల్యే, మంత్రిని కలసి గోదావరి జలాలను బిక్కేరువాగుకు వదలాలి అని రైతులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసారు. ఇప్పుడు స్టానిక ఎమ్మెల్యే స్థానికులు రైతు కాబట్టే యాసంగిలో సాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా ధర్మారం, వర్ధమానుకోట చెక్ డాంలు నింపుతున్నారని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎగువన ఉన్న చెక్ డాంలు కూడా నిండేవిదంగా చూడాలని బిక్కేరువాగు పరివాహక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇరాన్ గగనతలం మూసివేతతో
# భారత విమానాల దారి మళ్లింపు



**న్యూఢిల్లీ:** హింసాత్మక నిరసనల నేపథ్యంలో వాణిజ్య విమానాల రాకపోకలకు ఇరాన్ గగనతలాన్ని మూసివేసింది. దీంతో భారత విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు సూచనలు చేశాయి. ఉద్రిక్తతల దష్ట్యా కొన్ని విమానాలను దారి మళ్లిస్తున్నామని, మరికొన్ని సర్వీసులు రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నాయి. 'ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దష్ట్యా ఇరాన్ మీదుగా వెళ్లాల్సిన కొన్ని విమాన సర్వీసులను దారి మళ్లిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలు సాధ్యం కాని కొన్ని విమాన సర్వీసులు రద్దు చేస్తున్నాం. ప్రయాణికులు అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి. ఈ అసౌకర్యానికి మేం చింతిస్తున్నాం. కానీ... ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం' అని ఎయిరిండియా సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా ఇదేతరహా అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ గగనతలం మూసివేయడంతో కొన్ని అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడిందని తెలిపింది. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో సర్వీసులు నడుపుతున్నామని వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణికులు తమకు సహకరించాలని కోరింది. కాగా... ఇండిగోకు చెందిన ఓ విమానం ఇరాన్ గగనతలాన్ని మూసివేయడానికి కొన్ని నిమిషాల ముందు అక్కడి నుంచి బయటపడింది. జార్జియా నుంచి బయల్దేరిన ఆ విమానం గురువారం తెల్లవారుజామున 2.35 గంటల ప్రాంతంలో ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణించినట్లు ఫ్లైట్‌రాడార్24 వెల్లడించింది. ఆ తర్వాత 3 గంటల ప్రాంతంలో తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కొన్ని రోజులుగా కొనసాగుతున్న హింసాత్మక నిరసనలతో ఇరాన్‌లో పరిస్థితులు అల్లకల్లోలంగా మారాయి. మరోవైపు, ఆ దేశంపై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులంతా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచించింది. భారతీయులెవరూ ఇరాన్ వెళ్లొద్దని పేర్కొంది.

# స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలకు రెక్కలు!



**న్యూఢిల్లీ:** స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రెండు నెలల్లో వీటి ధరలు పెరగనున్నాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయి. టీవీ బ్రాండ్లు సైతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల నుంచి మెమొరీ చిప్స్‌కు ఎనలేని డిమాండే ఉండమే ఇందుకు కారణం. గత త్రైమాసికంలో మెమొరీ చిప్స్ ధరలు ఏకంగా 50 శాతం మేరకు పెరగ్గా... జనవరిమార్చి త్రైమాసికంలో మరో 40 50 శాతం పెంపు ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏప్రిల్‌జూన్‌లో మరో 20 శాతం వరకు పెరగొచ్చని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో వివో, నథింగ్ వంటి సంస్థలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.3 నుంచి రూ.5 వేల వరకు పెంచాయి. శ్యాంసంగ్ వంటి కంపెనీలు పరోక్షంగా ఖర్చులు తగ్గించుకోవడానికి క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లు నిలిపివేశాయి. మెమొరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఆ మేరకు ధరల పెంపు చేపట్టొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. తాము లాంచ్ చేయబోయే మోడళ్ల ధరలు పెంచనున్నట్లు నథింగ్ సీఈఓ కార్ల్ పై ఇప్పటికే స్పష్టంచేశారు. మరిన్ని బ్రాండ్లు ఇదే బాటలో నడవనున్నాయి. నవంబర్ డిసెంబర్ నెలల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు కనిష్ఠంగా 3 శాతం... గరిష్ఠంగా 21 శాతం మేర పెరిగాయి. రాబోయే రోజుల్లో మరో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక్క స్మార్ట్‌ఫోన్లే కాకుండా టీవీల ధరలు సైతం పెరగనున్నాయి. తాము ఆర్డర్ చేసే మెమొరీ చిప్స్‌లో కేవలం పదోవంతు మాత్రమే తమకు అందుతున్నాయని కోడక్, థామ్సన్ వంటి బ్రాండ్లపై టీవీలను విక్రయించే సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సంస్థ పేర్కొంది. మెమొరీ చిప్స్ కొరతను ఈ పరిస్థితి తెలియజేస్తోంది. ఇప్పటికే టీవీల ధరలు పెంచామని, ఫిబ్రవరిలో మరో 4 శాతం మేర పెంచాలనుకుంటున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అవనీత్ సింగ్ వెల్లడించారు. ల్యాప్‌టాప్ ధరలు ఇప్పటికే 58 శాతం మేర పెరగ్గా... మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

# స్పీకర్ ప్రజాసామ్యంలో కీలకం

### ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ పాత్ర ప్రత్యేకమైనదని, వారు తక్కువ మాట్లాడినా అందరికీ సమాన అవకాశం కల్పించాలని ప్రధాని నరేంద్రమోదీ సూచించారు. భారతదేశ వైవిధ్యాన్ని ప్రజాస్వామ్యం బలంగా మార్చిందని, స్వాతంత్ర్యానంతరం భారత్‌లో ప్రజాస్వామ్యం బతకదనే అనుమానాలను తిప్పికొట్టిందని గుర్తుచేశారు. దిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో 28వ కామన్‌వెల్త్ స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారుల సమావేశాన్ని ప్రధాని ప్రారంభించారు. మూడు రోజులు జరిగే సమావేశంలో 42 కామన్‌వెల్త్ దేశాల నుంచి 61 మంది స్పీకర్లు, ప్రిసైడింగ్ అధికారులు, నలుగురు అర్ధస్వయంప్రతిపత్తి పార్లమెంట్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంతకుముందెన్నడూ లేని విధంగా ఈ సమావేశాల్లో వివిధ దేశాల నుంచి అత్యధిక మంది ప్రతినిధులు పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షత వహించారు. మోదీ మాట్లాడుతూ 'భారతదేశంలో డెమోక్రసీ అంటే లాస్ట్ మైల్ డెలివరీ' అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు స్థిరత్వం, వేగం, ఉన్నతస్థాయిని అందిస్తాయని వివరించారు. 2024 భారత ఎన్నికలు మానవ చరిత్రలో అతిపెద్ద ప్రజాస్వామ్య కసరత్తుగా ప్రధాని తెలిపారు. 98 కోట్ల ఓటర్లు, 8 వేల మంది అభ్యర్థులు, 700 పార్టీలతో ఈ సార్వత్రిక ఎన్నికలు జరిగాయని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో మహిళా ప్రతినిధులు అత్యధిక స్థాయిలో పాల్గొన్నారని ప్రధాని చెప్పారు. భారతదేశం ప్రపంచంలో అతివేగంగా అభివద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అని మోదీ అన్నారు.

# దోషిగా తేలితే రక్షించబోము

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ స్పష్టీకరణ

### శంకరదాస్‌కు 'ఆదర్శ కమ్యూనిస్టుగా' కితాబు



**తిరువనంతపురం :** శబరిమల బంగారం నష్టం కేసుల్లో అరెస్ట్ అయిన టిడి బి మాజీ సభ్యుడు కె.పి.శంకర దాస్ ఓ 'ఆదర్శ కమ్యూనిస్టు' అని, ఆయన తెలిసి కూడా ఏ తప్పూ చేయరని కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు. దాస్ ఉద్దేశపూర్వకంగా ఎలాంటి తప్పు చేయరని పార్టీలోని ప్రతీ ఒక్కరికీ తెలుసునని బినోయ్ విశ్వం శుక్రవారం నాడు ఇక్కడ విలేకరులకు వివరించారు. 'ఆయన ఒక ఆదర్శ కమ్యూనిస్టు. కానీ ఆయన ఏదైనా అనుకోకుండా పొరపాటు చేశారో లేదో మాకు తెలియదు. కాబట్టి దర్యాప్తును కొనసాగనివ్వండి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చెప్పారు. అదే సమయంలో, దర్యాప్తులో ఆయన తప్పు చేసినట్లు తేలితే సిపిఐ లేదా ఎల్ డిఎఫ్ వారిని రక్షించదని స్పష్టం చేశారు. కేరళ హైకోర్టు నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తు చేస్తున్న ద్వారపాలక (సంరక్షక దేవత), శ్రీ కోవిల్ (గర్భగుడి) తలుపుల ఫ్రేమ్‌ల నుండి బంగారం పోగొట్టుకున్న రెండు కేసులకు సంబంధించి కె.పి.శంకరదాస్‌ను బుధవారం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో అరెస్ట్ చేశారు. ఆయన ప్రస్తుతం అనారోగ్యంతో హాస్పిటల్‌లోనే ఉన్నాడు. ఈ కేసుకు సంబంధించి 'సిట్' ఇప్పటివరకు ఇద్దరు టిడిబి మాజీ అధ్యక్షులు సహా 12మందిని అరెస్ట్ చేసింది.

## కన్నకూతుళ్లపై
# తండ్రి అఘాయిత్యం

జోధ్‌పూర్‌లో దారుణ ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత 12 ఏళ్లుగా కన్న కూతుళ్లపై ఒక తండ్రి అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తల్లీ కూతుళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. పోలీసుల సమాచారం ప్రకారం జోధ్‌పూర్‌కు చెందిన 18 ఏళ్ల బాలిక గత 12 ఏ ళ్లుగా తన తండ్రి తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపించింది. తన తండ్రి తనపై అత్యాచారం చేయడం ప్రారంభించినప్పుడు ఆమె వయస్సు కేవలం ఆరేళ్లు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడు. చివరికి తన 15 ఏళ్ల చిన్న కుమార్తెపై కూడా అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన సోదరితో చెప్పింది. దీంతో వారు తమ తల్లికి ఈ విషయాన్ని తెలియజేశారు. ఆ తర్వాత, వారు పోలీసులకు ఒక ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. జనవరి 13న ఒక ఈమెయిల్ ఫిర్యాదు అందిందని నాగౌరి గేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) దినేష్ కుమార్ తెలిపారు. ఆరోపణల తీవ్రత దష్ట్యా, పోలీసులు వెంటనే ఫిర్యాదుదారురాలిని సంప్రదించి, ఆ తర్వాత ఆమె నుండి అధికారిక లిఖితపూర్వక ఫిర్యాదును స్వీకరించారు. సహాయ పోలీస్ కమిషనర్‌మంగ్లేష్ చుండవత్ ప్రకారం, తనపై ఫిర్యాదు నమోదైన విషయం తెలియడంతో ని ందితుడు, కూలీగా పనిచేసే 45 ఏళ్ల తండ్రి పరారయ్యాడు. కానీ గురువారం అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. పోలీసులు ఇప్పటికే బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సెక్షన్ 65(2) (అత్యాచారం) ,లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## 52 మంది
# మావోయిస్టుల లొంగుబాటు




**విశాలాంధ్ర-చింతూరు:** చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 52 మంది మావోయిస్టులు లొంగిపోయారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు ఉన్నారని, వీరు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్రఒడిశా బోర్డర్ డివిజన్, భమ్రాఘర్ ఏరియా కమిటీ (మహారాష్ట్ర) చురుకుగా ఉన్నారని వారు చెప్పారు. 'పూనా' మార్గెమ్ చొరవ కింద వారు ఇక్కడ సీనియర్ పోలీసు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం సంకల్పించింది.

## 'లక్కుం'డిలో...దాగిఉన్న 'లక్కు' !
# ఓ ఇంటి నిర్మాణ పనుల్లో బయటపడ్డ లంకెబిందె

### 466 గ్రాముల బంగారు గాజులు, కడియాలు, గొలుసులు, ఉంగరాలు లభ్యం

### గ్రామంలో నిధుల కోసం తవ్వకాలకు కర్ణాటక సర్కారు ఆదేశాలు జారీ

**గడగ్ :** కర్ణాటక రాష్ట్రంలో 'దేవాలయాల స్వర్గం'గా పేరొందిన గడగ్ జిల్లా చారిత్రక 'లక్కుండి' గ్రామంలో ఇటీవల ఓ ఇంటి నిర్మాణానికి పునాది తవ్వుతుండగా ఒక లంకెబిందె బయటపడింది. 634 గ్రాముల బరువున్న ఆ తామ్రపు లంకెబిందెలో 466 గ్రాముల బంగారు గాజులు, కడియాలు, గొలుసులు, ఉంగరాలు బయటపడ్డాయి. ఆ లంకెబిందెను 14 ఏళ్ల వయసున్న ప్రజ్వల్ రిత్తి అనే బాలుడు సహా అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు. వారు ఈ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. లంకెబిందెలో బయటపడ్డ బంగారు ఆభరణాలు 400 ఏళ్ల నాటివి అయి ఉండవచ్చని పురావస్తు శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్ణాటక ప్రభుత్వం లక్కుండి గ్రామంపై దృష్టి సారించింది. పూర్వం రాష్ట్రకూటులు, చాళుక్యులు, ఇతర రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారని, ఇటువంటి చరిత్ర కలిగిన ఈ గ్రామంలో నిధులు దొరికే అవకాశాలు మెండుగా ఉన్నాయని పురావస్తు శాఖ అధికారులు చెప్పడంతో కర్నాటక ప్రభుత్వం ఆ గ్రామంలో నిధుల కోసం పూర్తి స్థాయిలో తవ్వకాలు చేపట్టేందుకు పురావస్తు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పురావస్తు అధికారులు శుక్రవారం లక్కుండి గ్రామంలో నిధుల కోసం పూర్తి స్థాయి తవ్వకాల వేట ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్‌ను పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, లక్కుండి హెరిటేజ్ డెవలప్‌మెంట్ అథారిటీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా చేపట్టాయి. నిధుల కోసం తవ్వకాలు సాగించేందుకు జెసిబిలు, ట్రక్కులు, ట్రాక్టర్లను లక్కుండి గ్రామానికి తరలించి అక్కడి కోటే వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిధులకోసం తవ్వకాలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పూర్వం ఈ ప్రాంతం చారిత్రకంగా ఒక సంపన్న కేంద్రంగా ఉండేదని, భూగర్భంలో ఇప్పటికీ అపారమైన సంపాద దాగి ఉండొచ్చని భావిస్తున్నామని, పురాతన కాలంలో లక్కుండిలో బంగారు నాణేలు ముద్రించినట్లు ఆధారాలు కూడా ఉన్నాయని, అందుకే ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధులను గుర్తించడానికి పూర్తి స్థాయిలో తవ్వకాలు సాగిస్తున్నామని అధికారులు వివరించారు.

# టికెట్ చార్జీల నిర్ణయం
## 'వ్యాపార రహస్యం': భారత రైల్వే




**న్యూఢిల్లీ:** రైలు టికెట్ చార్జీలను నిర్ణయించడానికి ప్రమాణాలను వెల్లడించలేమని భారత రైల్వే తెలిపింది. టికెట్ చార్జీలను లెక్కించే పద్ధతి రైల్వేల 'వ్యాపార రహస్యం' ... వాణిజ్య సమగ్రతకు సంబంధించిన విషయం అని రైల్వే బోర్డు కేంద్ర సమాచార కమిషన్‌కు తెలియజేసింది. ఛార్జీల నిర్ణయ వివరాలను కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించిన తర్వాత రైల్వే బోర్డు ఈ వివరణ ఇచ్చింది. బేస్ ఫేర్‌ను లెక్కించే పద్ధతి, డైనమిక్ ధర... టికెట్ చార్జీలు ఎలా ప్రభావితమవుతాయి వంటి సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరాడు. అయితే, చార్జీల నిర్ణయ విధానాలు రైల్వేల మేధో సంపత్తి హక్కుల పరిధిలోకి వస్తాయని, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ ఎనిమిది కింద మినహాయింపు పొందాయని రైల్వే వెల్లడించింది. రైల్వేలు వాణిజ్య సంస్థగా పనిచేస్తాయని, లాభాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నందున, అటువంటి సమాచారాన్ని బహిర్గతం చేయడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమని రైల్వే బోర్డు పేర్కొంది. రైల్వేల వాదనను అంగీకరిస్తూ, కేంద్ర సమాచార కమిషన్ సమాచారం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

# 'మహా' మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో...
## జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యకేసు నిందితుడి గెలుపు

### 'జాల్నా' కార్పొరేషన్‌లోని 13వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగిన పాంగార్కర్



**జాల్నా :** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శుక్రవారం జాల్నా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్యకేసు నిందితుడు శ్రీకాంత్ పాంగార్కర్ ఈ కార్పొరేషన్‌లోని 13వ వార్డు ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందడం అందరినీ ఆశ్యర్యానికి గురిచేసింది.13వ వార్డు నుంచి శ్రీకాంత్ పాంగార్కర్ పోటీచేయగా, భారతీయ జనతా పార్టీ (బిజెపి) అభ్యర్థితోపాటు, ఇతర పార్టీల అభ్యర్థులు కూడా ఆ వార్డు నుండి బరిలో నిలిచారు. శివసేన (ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని పార్టీ) మాత్రం తన అభ్యర్థిని నిలబెట్టలేదు. పాంగార్కర్ గత ఏడాది శాసనసభ ఎన్నికలకు ముందు శివసేనలో చేరడంతో ఆయన చేరికపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.అంతకుముందు 20–01–2006లో జాల్నా మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా పాంగార్కర్ శివసేన తరపున ప్రాతినిధ్యం వహించి ఉన్నాడు. 2011 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో శివసేన తరపున ఆయనకు టికెట్ నిరాకరించడంతో హిందూ జనజాగృతి (హెచ్‌జెజె)లో చేరారు. 2017 సెప్టెంబరులో జర్నలిస్ట్ గౌరీ లంకేష్‌ను బెంగళూరులోని ఆమె నివాసంలో కొందరు దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడుగా ఉన్న శ్రీకాంత్ పాంగార్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నాటక హైకోర్టు 2024లో అతడికి బెయిల్ మంజూరు చేసింది. దీనికి ముందు 2018లో బాంబులు, ఆయుధాలు లభ్యమైన కేసులో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్ట్ చేసిన విషయం విదితమే. తాజాగా జాల్నా మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13వ వార్డుకు జరిగిన ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన శ్రీకాంత్ పాంగార్కర్ విజయం చర్చనీయాంశమైంది.

# ఓటు చోరీ
## దేశద్రోహ చర్యే: రాహుల్



**న్యూఢిల్లీ:** ఓట్ల చోరీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మరోసారి స్పందించారు. మోదీ సర్కారు, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు గుప్పించారు. హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక సహా అనేక రాష్ట్రాల్లో పెద్దఎత్తున ఓటు చోరీ జరిగిందని, ఇదే పరిస్థితి మహారాష్ట్ర కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగిందని విమర్శించారు. ఎన్నికల సంఘం తీరుపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పౌరులను తప్పుదారి పట్టిస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు కారణంగానే మన ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లిందని రాహుల్ ఆరోపించారు. 'ఓటు చోరీ దేశద్రోహ చర్య' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.

# 'సుప్రీం'లో యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

**న్యూఢిల్లీ:** క్యాష్ ఎట్ హోం కుంభకోణం కేసులో జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేస్తున్న పార్లమెంటరీ ప్యానెల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. క్యాష్ కుంభకోణంలో ఆయనపై అభిశంసన ప్రక్రియ కొనసాగుతోంది. పిటిషన్ కొట్టేయడంతో అభిశంసన ప్రక్రియకు మార్గం సుగమం అయినట్లు అయింది. జస్టిస్ యశ్వంత్ వర్మ విజ్ఞప్తిపై ఈ నెల ఎనిమిదో తేదీన నిర్ణయాన్ని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి.శర్మలతో కూడిన ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా ధర్మాసనం పిటిషన్ కొట్టేసింది. దీంతో జస్టిస్ వర్మ... పార్లమెంటరీ ప్యానెల్ ముందు హాజరు కావాల్సి ఉంటుంది. కాగా, 2025, మార్చి 14వ తేదీ రాత్రి జస్టిస్ యశ్వంత వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని చెల్లాచెదురుగా పడి ఉన్న నగదు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. నగదు వీడియోలను రికార్డ్ చేసి దిల్లీ పోలీసులు... సీనియర్ అధికారులకు పంపారు. అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తికి సమాచారం అందించారు. దీంతో అప్పటి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఖన్నా విచారణకు ఆదేశించారు. దాదాపు రూ.15 కోట్ల వరకు నగదు ఉంటుందని సమాచారం. భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలీజియం... జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కానీ ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీం కోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించింది. ఈ కమిటీ కూడా నగదు ఉన్నమాట వాస్తవమేనని తేల్చింది. మే 4న కమిటీ నివేదిక ఇచ్చింది.

## నగదు అక్రమ చలామణిలో
# మెహుల్ ఛోక్సీ తనయుడు : ఇడి

**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఇడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని, ఈ కంపెనీ నిధులను విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఇడి అధికారులు చెప్పారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులు అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రోహన్ తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఇడి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వాబార్బుడాకు వెళ్లగా... నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్ తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

## చట్టవిరుద్ధంగా వాకీ-టాకీల విక్రయం
# 13 ఈ-కామర్స్ సైట్స్‌కు
## రూ.10 లక్షల చొప్పున జరిమానా

**న్యూఢిల్లీ:** చట్టవిరుద్ధంగా వాకీటాకీలు విక్రయిస్తున్న ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ (సిసిపిఎ) చర్యలు చేపట్టింది. 13 ప్రముఖ ఈకామర్స్ సైట్స్‌కు రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మీషో, మాస్క్‌మ్యాన్ టాయ్స్, ట్రేడ్ ఇండియా, ఆంత్రిక్ష్ టెక్నాలజీస్, వర్ధాన్‌మార్ట్, ఇండియామార్ట్, మెటా ప్లాట్‌ఫామ్‌లు ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, కృష్ణమార్ట్, అమెజాన్ సంస్థలు 16,970కు పైగా చట్టవిరుద్ధంగా వాకీటాకీలు అమ్మినట్లు సీసీపీఏ గుర్తించింది. ఆయా ఈకామర్స్ సంస్థలు వినియోగదారుల రక్షణ చట్టం 2019, టెలికాం చట్టాలను ఉల్లంఘించినట్లు సీసీపీఏ ఆరోపించింది. ఎనిమిది సంస్థలకు తుది ఉత్తర్వులు జారీ చేసింది. వాటికి రూ.44 లక్షల జరిమానాలు విధించింది. కాగా, మీషో, మెటా ప్లాట్‌ఫామ్స్ ఇంక్. (ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్), ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై రూ.10 లక్షల చొప్పున, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్‌లపై లక్ష చొప్పున జరిమానా విధించినట్లు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. మీషో, మెటా, చిమియా, జియోమార్ట్, టాక్ ప్రో సంస్థలు జరిమానా చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన ప్లాట్‌ఫామ్‌ల నుంచి జరిమానా చెల్లింపులు రావాల్సి ఉన్నదని వెల్లడించారు.

## ఇరాన్‌లో ఉద్రిక్తతల వేళ..
# పుతిన్–నెతన్యాహు ఫోన్ కాల్



**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్ సంఘర్షణ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై వారు చర్చించుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో మధ్యవర్తిత్వానికి అవసరమైతే తాము సాయం చేస్తామని నెతన్యాహుకు పుతిన్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్‌లో శాంతి భద్రతలను తిరిగి నెలకొల్పడానికి కావాల్సిన దౌత్య ప్రయత్నాలు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో గత కొన్ని వారాలుగా ఇరాన్‌లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. వీరిని అడ్డుకునే క్రమంలో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నిరసనల్లో 3వేలకు పైగా ఆందోళనకారులు మరణించి ఉండొచ్చని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

# సరిహద్దులో డ్రోన్ల కలకలం

**న్యూఢిల్లీ:** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తామంటూనే... మరో వైపు కవ్వింపు చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీడ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం ఇది మూడోసారి అన్నారు. పాకిస్థాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
తెలంగాణ విద్య మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ :: హైదరాబాద్
టెండర్ నోటీసు నెం. SE/TGEWIDC/HYD/NIT/1592 నుండి 1593/2025-26, తేది: 16.01.2026
కింది పనుల కోసం అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనవి: 1) నాంపల్లిలోని RUSA కార్యాలయంలో హాల్ పునరుద్ధరణ మరియు హైదరాబాద్ జిల్లా, గోల్కొండ తహసీల్ కార్యాలయానికి మౌలిక సదుపాయాల కల్పన (15.00 లక్షల నుండి 25.00 లక్షల వరకు)
(క్ర.నం. 1 (మొదటి పిలుపు) మరియు క్ర.నం. 2 (రీ-కాల్)
ఆన్‌లైన్‌లో బిడ్ సమర్పించడానికి మరియు స్వీకరించడానికి చివరి తేదీ : 16.01.2026 సాయంత్రం 4.00 గంటల వరకు
పూర్తి వివరాల కోసం, సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ భవనం, SCERT కాంపౌండ్, ఇ-గేట్ ఎదురుగా, ఎల్.బి.స్టేడియం, హైదరాబాద్ చిరునామాలోని కార్యాలయంలో వ్యక్తిగతంగా సంప్రదించవచ్చు. ఫోన్ నెం. 040-29565991.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TGEWIDC, హైదరాబాద్.
DIPR R.O. No. : 13794-PP/CL/ADVT/1/2025-26, Date: 16-01-2026

# మిత్రభేదం కలిగించిన 'మహా'నష్టం

మహారాష్ట్రలోని బృహన్ ముంబాయి (బిఎంసి) సహా 29 కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కడపటి వార్తలు అందే సరికి బిజెపి నేతృత్వంలోని మహాయుతి 25 చోట్ల పై చేయి సాధించింది. రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను కైవసం చేసుకొని తన అధికారాన్ని బిజెపి మరింత సుస్థిరపరుచుకుంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబాయి కార్పొరేషన్ బిఎంసిని శివసేనతో కలిసి దక్కించుకోవడం బిజెపికి అత్యంత సంతోషం కలిగించే అంశం. ఎందుకంటే ముంబాయి అంటే బాల్ థాక్రే శివసేనకు పెట్టని కోట. పాతికేళ్ళుగా ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన ఆధీనంలో ఉండేది. అక్కడ ఆ పార్టీకి ఉన్న పట్టును గండికొట్టాలని బిజెపి కంకణం కట్టుకొంది. అందుకే కాలపరిమితి ముగిసినా దాదాపు రెండేళ్ల పాటు బిఎంసికి ఎన్నికలు నిర్వహించలేదు. ఈ లోపు రకరకాల కుయుక్తులు, ఎత్తుగడలను అమలు చేసింది.ప్రస్తుత ఎన్నికల్లో బిజెపి, షిండే శివసేనల కూటమి బిఎంసిలో అసలు శివసేన ఆధిపత్యానికి గండి కొట్టింది. ఈ కూటమి 227 సీట్లలో అవసరమైన 114 మెజారిటీని దాటి మరిన్ని సీట్లను పొందింది. ఎన్నికలకు ముందు బిజెపి ఎత్తులను ఎలాగైనా చిత్తు చేయాలని థాక్రే తమ పార్టీని వీడి వెళ్ళిన చిన్నాన్న సోదరుడు రాజ్ థాక్రేని కలుపుకొని మహారాష్ట్ర నవ నిర్మాణ సేనతో పొత్తు పెట్టుకున్నారు. దీంతో ఆ కూటమి 80కి పైగా సీట్లను సాధించి మేయర్ పదవి దక్కకున్నా తమ బలం పోలేదని చాటుకుంది. అయితే, మహాయుతిలో భాగస్వామిగా ఉన్న అజిత్ పవార్ ఎన్‌సిపికి ఒక్క సీటు దక్కలేదు. ఇక ప్రతిపక్ష మహావికాస్ ఆగాఢీలోని నాలుగు పార్టీలు కకావికలమయ్యాయి. కాంగ్రెస్ స్వంతంగా పోటీ చేయగా, థాక్రే శివసేన, ఎంఎన్ఎస్, శరద్ పవార్ ఎన్‌సిపిలు కలిసి పోటీ చేశాయి. ఇతర మున్సిపాలిటీలలో కొన్ని చోట్ల ఈ పార్టీలు కలిసి పోటీ చేశాయి. కొన్ని చోట్ల విడి విడిగా పోటీ చేశాయి. కొన్ని చోట్ల రెండు ఎన్‌సిపిలు చేతులు కలిపి పోటీ చేశాయి.

ఈ ఎన్నిక ద్వారా ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ తన పట్టును మరింత బిగించారు. షిండే శివసేన సైతం తన అధికారం బాసటగా తన అనుయాయులను నిలుపుకోగలిగింది. ఇక ప్రతిపక్ష శిబిరమే దిశా రహితమైంది.

కాంగ్రెస్ స్వంతంగా పుంజుకోవాలనే ప్రయత్నం చేసి, లాతూర్, చంద్రపూర్, కొల్హాపూర్ కార్పొరేషన్‌ల మేయర్ స్థానాలను దక్కించుకోనుంది. అలాగే మిత్రుల సహాయంలో పర్భనీ,భీవాండీ మేయర్ పదవులు గెలుచుకునే అవకాశం ఉండడం ఆ పార్టీకి శుభవార్తే. అయితే, మహా వికాస్ ఆగాఢీలోని ఇతర పక్షాలకు మాత్రం ఫలితాలు చేదుగుళికలే.

గతంలో బిజెపికి గుడ్‌బై చెప్పి శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపిలు చేతులు కలిసి, మహావికాస్ ఆగాఢీగా ప్రభుత్వం ఏర్పాటు చేసి దేశానికే ప్రతిపక్షానికి ఒక నమూనాను అందించింది. ఒక విధంగా దాని స్ఫూర్తితోనే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఏర్పాటైంది. దీనిని జీర్ణించుకోలేని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అధికారాన్ని అడ్డంగా దుర్వినియోగం చేసి, తిమ్మిని బమ్మిని చేసి ఆగాఢీ కూటమిని గద్దెదించింది. ఇదంతా గత లోక్‌సభ ఎన్నికలకు ముందే చోటు చేసుకుంది. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల కూటమిలో ఎవరికివారేగా సాగింది. తమ బలాన్ని పునరుద్ధరించుకునేందుకు నాలుగు పార్టీలు నిర్ణయానికి వచ్చాయి. అందులో భాగంగా థాక్రే సోదరులు చేతులు కలిపారు. అలాగే ఎన్‌సిపి కురువృద్ధుడు శరద్ పవార్, అజిత్ పవార్ (బిజెపితో ప్రభుత్వంలో కొనసాగుతూనే) దగ్గరయ్యారు.

కాంగ్రెస్ మైనారిటీ ఓటు బ్యాంకును తిప్పుకునేందుకు బిఎంసిలో స్వంతంగానే పోటీ చేసింది. ఓటర్లకు మాత్రం ప్రతిపక్షాల అనైక్యత రుచించలేదు. ఓట్ల చీలిక కూడా పలు చోట్ల వారి ఓటమికి కారణమైంది. ఏ ఒక్క పార్టీ స్వంతంగా గెలుపు తలుపును తట్టలేని మహారాష్ట్ర రాజకీయాలలో బిజెపి తన బలానికి అదనంగా శివసేన చీలిక బలాన్ని తనలో కలిపేసుకుంది.

ఆ నష్టాన్ని ఎంఎన్ఎస్‌తో పూడ్చుకోవాలని ఉద్ధవ్ థాక్రే భావించినా, ఆ పార్టీ అతివాద ధోరణి రుచించని లౌకిక ఓటర్లు దూరమయ్యారు. ఎన్‌సిపి పవార్‌ల దోబూచలాట, పవార్‌లకు పట్టు కలిగిన పుణె, పింప్రి–చించోడ కార్పొరేషన్‌ల ప్రజలు ఆహ్వానించలేదు.

మొత్తానికి త్వరలో ఐదు రాష్ట్రాలకు జరిగే ఎన్నికల నేపథ్యంలో ఇండియా కూటమి మహారాష్ట్ర ఫలితాల నుంచి పాఠాలను త్వరితగతిన నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. బిహార్ ఎన్నికల్లో నామినేషన్‌ల చివరి రోజు వరకు పొత్తులు కుదరలేదు.

ఉమ్మడి ఎజెండాను ముందుంచడంలో, సైద్ధాంతిక దిశను ఇవ్వడంలో ఇండియా కూటమి సఫలం కావడం లేదు. బలమైన సంస్థాగత నిర్మాణం, ధన, ప్రభుత్వ వ్యవస్థల బలం కలిగిన బిజెపిని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాల మధ్య ఉత్కృష్టమైన ఐక్యత అవసరం.

# చరిత్ర పొడవునా రక్త తర్పణం...కుట్ర కేసులు

(3వ పేజీ తరువాయి)

రాంప్రసాద్ బిస్మిల్లా, రోషన్ సింగ్, రాజేంద్ర లహరీలను ఉరితీశారు. మిగిలినవారిలో 17 మందికి దీర్ఘకాలిక శిక్షలు, మరియు అండమాన్ దీవుల ప్రవాసం లాంటి కఠిన శిక్షలు విధించారు. చంద్రశేఖర్ ఆజాద్ ఆ కేసు నుంచి తప్పించుకోవడం జరిగింది.

**చిట్టగాంగ్ పోరాట యోధులు :**

చిట్టగాంగ్ పోలీస్ స్టేషన్‌లోని ఆయుధకారాగారంపై దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న కేసులో 1934 జనవరి 12న అనేక మందిని ఉరితీశారు. మిగిలినవారు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. చిట్టగాంగ్ పోరాట యోధురాలు కల్పనా దత్ బహుకాలంపాటు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పిసి జోషిని వివాహం చేసుకున్నారు.

**వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం :**

1946–51 మధ్య జరిగిన ఈ పోరాటం చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడిన సాయుధ పోరాటం. మూడు వేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమి రైతాంగానికి పంపిణీ, వెట్టి చారికి రద్దు లాంటి అనేక విజయాలు ఈ పోరాటంలో సాధించబడ్డాయి. ప్రధానంగా నిజాం నవాబు యూనియన్ సైన్యాలరాకతో లొంగిపోవడం, హైద్రాబాద్ రాష్ట్రం భారత్ యూనియన్‌లో విలీనం, సాయుధ పోరాట ప్రభావంతో జరిగాయి. విలీనం తర్వాత భారత సైన్యం, పోలీసులు కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడటంతో జరిగిన రైతాంగ గెరిల్లా పోరాటంలో 4000మందికి పైగా కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారు. 10వేల మందిని డిటెన్షన్ క్యాంపుల్లో పెట్టి మూడు, నాలుగు సంవత్సరాలపాటు చిత్రహింసలకు గురిచేశారు. మహిళలతో నగ్నంగా బతకమ్మలాడించారు. అన్ని నిర్బంధాలను తట్టుకొని నిలబడటమే కాకుండా 1952 లో జరిగిన ఎన్నికల్లో అటు మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలోను, ఇటు హైద్రాబాద్ స్టేట్‌లోని తెలంగాణలో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కంటే అధిక స్థానాలు సాధించారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల్లో (1946–51) కృష్ణాజిల్లాలో 102 మంది, గుంటూరు జిల్లాలో 70 మంది, కడప జిల్లాలో 7గురు, తూర్పుగోదావరి జిల్లాలో 15మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 27మంది, తెలంగాణ సాయుధపోరాటానికి సహకారం అందిస్తున్న నేపథ్యంలో చంపివేయబడ్డారు.

**తెలుగు రాష్ట్రాలలో తృటిలో చేజారిన అధికారం**

1952 ఫిబ్రవరిలో జరిగిన ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ఎన్నికల్లో ఆంధ్రాప్రాంతంలో 140 అసెంబ్లీ స్థానాలు ఉండేవి, కాగ్రెస్‌కు కేవలం 40స్థానాలు మాత్రమే దక్కాయి. సిపిఐపై నిషేధం తొలగించిన అనంతరం కేవలం నెలాపది రోజుల్లోనే జరిగిన ఎన్నికల్లో 61 స్థానాల్లో పోటీ చేసి 41 స్థానాల్లో కమ్యూనిస్టులు గెలిచారు. పార్టీబలపర్చిన 13మంది ప్రజాపార్టీ (ప్రకాశంపంతులు పార్టీ) అభ్యర్థులు, 8 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. మెజార్టీ స్థానాలు గెలిచిన కమ్యూనిస్టులు ఇతర ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలను కలుపుకొని అధికారంలోకి వచ్చే అవకాశం వచ్చింది. అధికారం ఏర్పాటు చేసే అవకాశాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం మరియు ఇతర పార్టీల కుట్రలవల్ల కోల్పోవడం జరిగింది.

తెలంగాణ స్వాతంత్ర్యం అనంతరం జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో (1952)లో కమ్యూనిస్టులు జనతంత్ర ప్రజాసంఘటన (పిడిఎఫ్) తరపున పోటీచేసిన 44 స్థానాలకు గాను 36 స్థానాల్లో గెలిశారు. పార్లమెంట్‌కు పోటీచేసిన కామ్రేడ్ రావినారాయణరెడ్డికి అప్పటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. అప్పుడే నిషేధం ఎత్తివేయడం వలన అనేక మంది జైల్లో ఉండి గెలవడం జరిగింది. కొన్ని ప్రాంతాలలో అభ్యర్థులు దొరకనందున ఆ స్థానాల్లో కమ్యూనిస్టుల పేరుతో సోషలిస్టు పార్టీలు సీట్లు సంపాదించాయి. కొంతమంది ఇండిపెండెంట్లు గెలిశారు. ఆనాటి హైద్రాబాద్ రాష్ట్రంలో మూడు ప్రాంతాలు అనగా మహారాష్ట్రలోని 5 జిల్లాలు, కర్నాటకలోని 3 జిల్లాలు, తెలంగాణలోని 8 జిల్లాలు కలిసి ఉండేవి. తెలంగాణ ప్రాంతంలో అత్యధిక స్థానాలు కమ్యూనిస్టు పార్టీ గెలవడం జరిగింది. ఆ విధంగా ఆనాడు రెండు రాష్ట్రాల్లో తెలుగు ప్రజల్లో మెజార్టీ స్థానాలు కమ్యూనిస్టు పార్టీ గెలుపొందడం జరిగింది.



మీరట్ కుట్ర కేసులో జైలు శిక్షలు అనుభవించిన కమ్యూనిస్టు ఖైదీలు

The Communist leaders jailed for Meerut Conspiracy. Back row (left to right): K. N. Sehgal, S. S. Josh, H. L. Hutchinson, Shaukat Usmani, B. F. Bradley, A. Prasad, P. Spratt, G. Adhikari; Middle Row: R. R. Mitra, Gopen Chakravarti, Kishori Lal Ghosh, L. B. Radam, D. R. Thengdi, Goura Shanker, S. Bannerjee, R. N. Joglekar, P. C. Joshi, Muzaffar Ahmad; Front Row: M. G. Desai. D. Goswami, R. S. Nimbkar, S. S. Mirajkar, S. A. Dange, S. V. Ghate, Gopal Basak

**కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలు :**

**భాషా ప్రయుక్త రాష్ట్రాలకోసం పోరాటం**

1953–56 మధ్య కాలంలో భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రగామిపాత్ర పోషించింది. ఆంధ్రాలో విశాలాంధ్ర కోసం, కేరళలో ఐక్య కేరళ కోసం, తమిళనాడులో ఐక్య తమిళ ఖజగం కోసం, మహారాష్ట్రలో సమైక్య మహారాష్ట్రకోసం ఉద్యమాలు నడిపి విజయవంతమైంది. భూ సంస్కరణలపై విజయం సాధించింది, కౌలుదారుల హక్కులు సాధించింది.

* * *

**సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపు :**

కమ్యూనిస్టు పార్టీ మొదటి సారిగా సంపూర్ణ స్వరాజ్యం కోసం పిలుపునిచ్చింది. 1921లో అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో, తిరిగి 1922లో 'గయ'లో ఈ గళాన్ని వినిపించారు. కమ్యూనిస్టు నాయకులైన మౌలానా హస్రత్ మొహాని, స్వామి కుమారన్ ఈ నినాదాన్ని ఇచ్చారు. పాలక వర్గాలు సోషలిజం, సామాజిక న్యాయం అనే మాటలను వల్లించాల్సి వచ్చింది. కమ్యూనిస్టుల ఉద్యమ ప్రభావం రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా కనిపించింది.

దున్నేవాడికే భూమి నినాదంతో జమిందారి, జాగిర్ధారీ పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను సమీకరించారు. భూ సమస్యను దేశ ఎజెండామీదకు తెచ్చారు. కార్మికులు, కర్షకులతోపాటు మహిళలు, దళితులు, ఆదివాసీలు స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చారు. మహిళా హక్కులు, కుల నిర్మూలన, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. మహిళా సమానత్వ హక్కును ఎజెండాలోకి తెచ్చింది. వరకట్నం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసింది. కందుకూరి, గురజాడ వంటి వారి సంస్కరణ ఉద్యమాలకు కమ్యూనిస్టు ఉద్యమం ఊపిరి పోసింది. రాత్రిబడుల ద్వారా అక్షరాస్యతా కార్యక్రమాలు నిర్వహించింది. యువతను విద్యా, వైజ్ఞానిక సేవా సాంస్కృతిక కార్యక్రమాల్లో సమీకరించింది.

అభ్యుదయ రచయితలను, కళాకారులను ప్రోత్సహించారు. ప్రజాకళలను విస్తృతంగా తీసుకెళ్లారు. అనేకమంది ప్రజానాట్యమండలి కళాకారులు సినీరంగంలో ప్రవేశించి రాణించారు. వారిలో నాగభూషణం, గుమ్మడి, అల్లు రామలింగయ్య, వి.మధుసూదనరావు, తాతినేని ప్రకాశరావు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి, జి.వరలక్ష్మి, జమున, తర్వాత కాలంలో మాదాల రంగారావు, ఇంకా అనేక మంది కమ్యూనిస్టు అభిమానులైన నటులు సినీరంగంలో ఒక వెలుగు వెలిగారు. మహాకవి శ్రీశ్రీ, ప్రజాకవులు సుద్దాల హనుమంతు, గద్దర్, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, వందేమాతరం శ్రీనివాస్ లాంటి వారి కలాలకు, గళాలకు వర్గ పదునుపెట్టింది.

నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం అనేక పోరాటాలు నిర్వహించింది. అందరికీ విద్య, వైద్యం, భూమి, ఇల్లు, పేదలకు చౌకగా ఆహారం కొరకు అనేక పోరాటాలు నడిపింది. కిలో రూపాయి బియ్యం నినాదాన్ని తీసుకువచ్చింది.

**వర్గసంఘాల ఏర్పాటు**

1920లో కమ్యూనిస్టుల సహకారంతో ఏఐటియుసి, 1936లో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్), 1936లో అఖిల భారత విద్యార్థి సంఘం, 1936లో అభ్యుదయ రచయితల సంఘం, 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోషియేషన్ (ఇప్టా), తెలుగు రాష్ట్రాల్లో ప్రజానాట్య మండలి ఏర్పాటు చేశారు. అలాగే బ్యాంకు ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు, బొగ్గుగని కార్మికులకు, రవాణా కార్మికులకు, ఆయా రంగాల్లో వివిధ కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు.

**సామాజిక కార్యక్రమాలు**

ఇప్టా, అరసంలాంటి సాంస్కృతిక సంఘాలు దేశవ్యాప్తంగా సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికాయి. దళితులు ఆలయ ప్రవేశంకోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా, మూఢ నమ్మకాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమా లు చేశారు. ప్రజల్లో హేతువాద, శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి కృషి చేశారు. బాల్య వివాహాల రద్దుకు, అభ్యుదయ వివాహాలకు, సతీసహగమనం రద్దుకై అనేక పోరాటాలు చేశారు.

* * *

**దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత**

దేశంలో బలమైన కమ్యూనిస్టు పార్టీ ఆవశ్యకత, అవసరం ఎన్నడూలేని విధంగా ఈనాడు ఉన్నది. ఉద్యోగ భద్రత లేదు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పేరుతో అతితక్కువ వేతనాలతో కొత్తరూపంలో శ్రమదోపిడి జరుగుతున్నది. భావాన్ని, ప్రశ్నించేవారిని అణచివేస్తున్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. కవులు, కళాకారులను మతోన్మాద ఆరాచకులు కాల్చి చంపుతున్నారు. సోషల్‌మీడియాను ఒక యూనివర్శిటీగా మల్చుకొని విద్రోహపూరిత విషజ్వాలలను సమాజంలో విరజిమ్ముతున్నారు. ఆర్థిక అసమానతలు ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చెప్పబడుతున్నప్పటికి సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అలీన విధానాన్ని గాలికి వదిలేసి అమెరికా ఆదేశాలను పాటించే స్థితికి దేశపాలకులు వచ్చారు. కరోనాలాంటి కష్టకాలంలో ప్రపంచం ఆర్థిక మాంద్యంతో తల్లడిల్లిపోయినా భారతదేశ వ్యవస్థను బలంగా నిలపగలిగిన ప్రభుత్వరంగ సంస్థలైన బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, ప్రభుత్వ రంగాలను సరళీకరణ పేరుతో విదేశీశక్తులకు, కార్పోరేట్ శక్తులకు స్వాధీనపరుస్తున్నారు. బొగ్గుగనులు, ఉక్కు కర్మాగారాలు, రైల్వే వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, ఆఖరికి అణుశక్తిలాంటి వ్యవస్థల్లో విదేశీ పెట్టుబడులను స్వేచ్ఛగా అనుమతిస్తున్నారు. ఈ దశలో దేశానికి బలమైన ఐక్య కమ్యూనిస్టుపార్టీ అవసరం ఏనాడులేనివిధంగా ఉన్నది. ప్రజలు కమ్యూనిస్టు ఐక్యతను కోరుకుంటున్నారు. హిడ్మా, నంబూరి కేశవరావు వంటివారిని ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తుంటే కోట్లాది గుండెలు తల్లడిల్లుతున్నాయి. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వర రావు, సురవరం సుధాకర రెడ్డి, ఏచూరి సీతారాం లాంటి వారు మరణిస్తే కోట్లాది మంది నీరాజనాలు పలుకుతున్నారు.

**ప్రపంచంలో బలమైన శక్తి కమ్యూనిజం**

కమ్యూనిజం ఇంకెక్కడ ఉన్నది అనేవారికి జవాబు, ప్రపంచ జనాభా 600 కోట్లలో మూడో వంతు అనగా 187కోట్ల జనాభా కలిగిన దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారు. అలాగే ప్రపంచంలోని 192దేశాలలో దాదాపు 150 దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఆయాదేశాలకు దిశానిర్దేశ పోరాటాలు చేస్తున్నాయి. చైనా, ఉత్తరకొరియా, వియత్నాం, లావోస్, కంబోడియా, శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికా దేశాలు, బ్రెజిల్ లాంటి దేశాలలో కమ్యూనిస్టులు, వామపక్షాలు అధికారంలో ఉన్నాయి. భారతదేశం లాంటి దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలో లేకపోయినా కోట్లాది మంది ప్రజాసంఘాలలో, కార్మిక సంఘాలలో సభ్యులుగా కొనసాగుతూ ప్రజాసమస్యలపైన నిరంతరం పోరాడుతున్నారు.

**కమ్యూనిస్టుల ఐక్యత నేటి కర్తవ్యం**

కమ్యూనిస్టు పార్టీ చీలికల వల్ల దేశంలో అణగారిన వర్గాల కు తీరని అన్యాయం జరిగింది. దేశప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగింది. నక్సల్స్ పేరుతో, అర్బన్ నక్సల్స్ పేరుతో కమ్యూనిస్టులను, అభ్యుదయవాదులను అంతం చేస్తున్నారు. కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పార్టీలు లక్ష్యంగా రాజ్యాంగ యంత్రాంగాన్ని ఉపయోగిస్తూ దాడులకు పూనుకుంటున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. మనిషి సంక్షేమం, సౌభాగ్యం కేంద్రంగా పుట్టిన సిద్ధాంతం కమ్యూనిస్టు సిద్ధాంతం; మనిషి ఉన్నంత కాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుంది. ఈ దశలో కమ్యూనిస్టుల ఐక్యత అంతిమంగా కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు దిక్సూచి కాగలుగుతుంది.

(కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా)

# భవిష్యత్తు ఏమిటి?

(3వ పేజీ తరువాయి)

భవిష్యత్తు లేదా? అన్న ప్రశ్న సహజంగానే ఉద్భవిస్తున్నది. కానీ, అందులో వాస్తవం లేదు. ఎందుకంటే, ప్రజల్లో నిరాటంకంగా కొనసాగుతున్న తారతమ్యాలు, కార్మిక, ఉద్యోగ వర్గాలలో అభద్రత, వ్యవసాయరంగంలో సంక్షోభం, సంపద కేంద్రీకరణ ఉన్నంత వరకు కమ్యూనిస్టుల ఆవశ్యకత తప్పని సరి. వీటికి శాస్త్రీయ పరిష్కార మార్గాన్ని యోచించేది, సూచించేంది, అందిచ్చేది మార్క్సిజం–లెనినిజం, దాని ఆచరణ కమ్యూనిస్టు పార్టీ అయినందువల్లనే. అయితే, పార్టీ ఇప్పుడనుసరిస్తున్న పద్ధతులు సరిపోవు. భారత కమ్యూనిస్టు పార్టీ పూర్వవైభవాన్ని సంతరించుకోవటానికి శ్రామికవర్గ, సామాన్య ప్రజల విశ్వాసాన్ని పొందటానికి పార్టీ తక్షణ కర్తవ్యంగా శత వసంతాల సందర్భంగా, చండీఘడ్‌లో జరిగిన సిపిఐ 25వ మహాసభ నిర్మాణ సూత్రాలను, కర్తవ్యాలను, ప్రజా కార్యాచరణకు చూపిన మార్గాలను అమలు పరుచుతామని మరోసారి ప్రతినబూనడమే.

ప్రజలాశించే కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత తక్షణావసరమే. కానీ, ఒక్క చేతితో కొడితే చప్పట్లు రా వు. గతానుభవం ఇదే సూచిస్తుంది. అందువల్ల నిర్మాణాన్ని నూతన పద్ధతుల్లో విస్తృతపరిచి పటిష్టపరచటం, మిలిటెంట్ పోరాటాలు, ఐక్య కార్యాచరణల ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీని ముందుకు తీసుకుపోవడం ద్వారానే ఇది సాధ్యమని గుర్తించాలి.

# నీతి ఆయోగ్ అధ్యయన నివేదిక బోగస్



రాజన్ క్షీర్‌సాగర్,
అధ్యక్షుడు, ఎఐకెఎస్,
9860488860

2026 బడ్జెట్ సమావేశాలకు ముందు, రాజకీయంగా సున్నితమైన తరుణంలో వ్యవసాయ ఉత్పత్తిదారుల ఆదాయంలో 126 శాతం పెరుగుదల ఉందని పేర్కొంటూ నీతి ఆయోగ్ అధ్యయనం విడుదలైంది. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఈ వృత్తాంతం తప్పు అని మాత్రమే కాకుండా, వ్యవసాయ విజయ వారసత్వాన్ని సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా రూపొందించిన మోసపూరిత గణాంక చర్యగా తిరస్కరించింది. ఈ నివేదిక ఆత్మహత్యలు, రుణగ్రస్తత, నిరసనలతో గుర్తించబడిన విస్తృతమైన రైతు బాధల ప్రత్యక్ష అనుభవాన్ని తప్పుదారి పట్టించే స్థూల ఆర్థిక మొత్తంతో భర్తీ చేస్తుంది. తద్వారా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విధానాన్ని తొక్కిపెడుతూ వివాదాస్పద విబి జి రామ్ జి చట్టం, ప్రతిపాదిత విత్తన బిల్లు విద్యుత్ బిల్లు , విపత్తు నిర్వహణ చట్ట సవరణ ద్వారా వ్యవస్థాగత విధాన వైఫల్యాల నుండి ప్రమాదకరంగా దృష్టి మళ్లించడంలో ప్రభుత్వం నిమగ్నమైంది.

**1.సంపద వృత్తాంతాల రాజకీయాలు**

వ్యవసాయ ఉత్పత్తిదారుల ఆదాయంలో 126 శాతం పెరుగుదల ఉందని పేర్కొంటూ నీతి ఆయోగ్ అధ్యయనం విడుదల, 2026 బడ్జెట్ సమావేశానికి ముందు రాజకీయంగా సున్నితమైన తరుణంలో జరిగింది. ఈ వృత్తాంతాన్ని ఎఐకెఎస్ తప్పు అని మాత్రమే కాకుండా, వ్యవసాయ విజయ వారసత్వాన్ని సృష్టించేందుకు ఉద్దేశపూర్వకంగా రూపొందించిన మోసపూరిత గణాంక చర్యగా తిరస్కరించింది. ఈ నివేదిక ఆత్మహత్యలు, రుణగ్రస్తత, నిరసనలతో గుర్తించబడిన విస్తృతమైన రైతు బాధల ప్రత్యక్ష అనుభవాన్ని తప్పుదారి పట్టించే స్థూల ఆర్థిక మొత్తంతో భర్తీ చేస్తుంది. తద్వారా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) విధానాన్ని తొక్కిపెడుతూ వివాదాస్పద విబి జి రామ్ జి చట్టం, ప్రతిపాదిత విత్తన బిల్లు 2025, విద్యుత్ బిల్లు 2025, రైతుల డిమాండ్‌లను, దానికి వ్యతిరేకం గా ఆందోళనలను అణిచివేయడం వంటి వ్యవస్థాగత విధాన వైఫల్యాల నుండి ప్రమాదకరంగా దృష్టి మళ్లించడంలో ప్రభుత్వం నిమగ్నమైందని ఈ విమర్శ పేర్కొంది.

**2. పద్ధతిలో లోపాలు: మొత్తంగా మోసం**

నీతి ఆయోగ్ అధ్యయనం ప్రాథమిక లోపం దాని ఎంపిక చేసిన పద్ధతిలో ఉంది.

**స్థూల— మొత్తంసూక్ష్మ బాధలను కప్పిపుచ్చడం:**జాతీయ ఖాతాల గణాంకాలు (ఎన్ఎఎస్), 'నిర్వహణ మిగులు/మిశ్రమ ఆదాయం' కొలతపై ఆధారపడటం ద్వారా, ఈ అధ్యయనం కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారాలు, పెద్ద భూస్వాముల ఆదాయాలను చిన్న, సన్నకారు రైతుల ఆదాయాలతో కలుపుతుంది. వీరు 85 శాతం కంటే ఎక్కువ వ్యవసాయ కుటుంబాలను కలిగి ఉన్నారు. ఈ మొత్తానికి కృత్రిమంగా సగటును పెంచి, 'మధ్యస్థ' రైతు వాస్తవికతకు సంబంధం లేని 'సగటు'ను సృష్టిస్తుంది. ఇరుకైన అగ్ర శ్రేణికి చెందిన సంపదను సాధారణీకరించిన వృద్ధిగా మోసపూరితంగా ప్రదర్శించారు.



**క్లిష్టమైన తగ్గింపుల మినహాయింపు:** నికర పునర్వినియోగపరచలేని ఆదాయాన్ని నిర్వచించే కీలక తగ్గింపులను మినహాయించడం ద్వారా ఆదాయ గణన డొల్లగా ఉంది. మూలధన వినియోగం, పన్నులను లెక్కించేటప్పుడు, ఇది రుణ సేవల ఖర్చులను స్పష్టంగా వదిలివేస్తుంది. ఇవి భరించలేని భారంగా మారాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) ప్రకారం గత దశాబ్దంలో 1.5 లక్షలకు పైగా రైతు ఆత్మహత్యలు ఆందోళనకరంగా కొనసాగడం ఈ మినహాయింపుకు అత్యంత విషాదకరమైన నిదర్శనం. ఇంకా, సబ్సిడీలను తిరిగి జోడించినప్పటికీ, ఇన్‌పుట్ సబ్సిడీలు ఎక్కువగా రైతులకు కాదు, కార్పొరేట్ తయారీదారులకు ప్రయోజనం చేకూరుస్తాయని, డీజిల్, విత్తనాలు, పురుగుమందుల ధరల పెరుగుదల ద్వారా తటస్థీకరించబడతాయని గుర్తించడంలో విశ్లేషణ విఫలమైంది.

**3. సామాజిక– ఆర్థిక క్షేత్ర–స్థాయి వాస్తవాల పూర్తిగా అనుసంధానం లేకపోవడం**

నివేదిక నిర్ధారణలలో స్వతంత్ర క్షేత్రస్థాయి సూచికలు ప్రత్యక్ష వైరుధ్యాలు కలిగి ఉన్నాయి. గత దశాబ్దంలో 1.5 లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారనేది నివేదిక డొల్ల వాదనలకు తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రచారం నుంచి విధాన న్యాయం దిశగా ప్రభు త్వం దృష్టి సారించాలని ఎఐకెఎస్ కోరుతుంది.

**ఎఐకెఎస్ డిమాండ్‌లు ఇవే :**

1. తప్పుదారి పట్టించే అంకెల వ్యాప్తిని తక్షణమే నిలిపివేయడం, అప్పు, వాతావరణ నష్టాలు, గృహ ఖర్చులను కలుపుకొని పారదర్శకంగా, విభజించబడిన, రైతు కేంద్రీకృత ఆదాయాన్ని నిబద్ధతతో అంచనా వేయాలి.
2. సి2+50 శాతం ఫార్ములా ఆధారంగా ఎంఎస్ పి కోసం చట్టపరమైన హామీని అమలు చేయడం.
3. దేశీయ ఉత్పత్తిదారులను అణగదొక్కే దోపిడీ దిగుమతి విధానాలను తిప్పికొట్టడం.
4. రైతులకు సమగ్ర రుణ మాఫీ, ప్రయోజనాత్మక పెన్షన్ వ్యవస్థ.
5. వాతావరణ దుర్బలత్వాలను పరిష్కరించడానికి బలమైన, సకాలంలో , రైతుస్నేహపూర్వక పంట నష్ట పరిహార వ్యవస్థ. విపత్తు నిర్వహణ సవరణ చట్టం – 2025 రద్దు చేయాలి.
6. ప్రతిపాదిత విత్తన బిల్లు, విద్యుత్ బిల్లు ఉపసంహరణ.
7. విబి జిరామ్‌జిని ఉపసంహరించుకొని, 200 రోజుల పని, గౌరవప్రదమైన వేతనంతో మహాత్మా గాంధీ నరేగాను తిరిగి ప్రవేశపెట్టడం.
8. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే అన్ని రైతు వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను నిలిపివేయాలి.
9. అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిడి కింద భారత్ –అమెరికా ఒప్పందానికి వద్దని చెప్పాలి.

నేటి అవసరం మెరిసే నివేదికలు కాదు, జవాబుదారీ పాలన. వ్యవసాయ సంక్షోభం అనే నిజం సమిష్టి జాతీయ ఖాతాలలో కాదు, రైతుల కనుబొమ్మలలో, వారి నిరాశ బ్యాలెన్స్ షీట్లలో, వారి ఆత్మహత్యల వెంటాడే గణాంకాలలో లఖించబడింది. మేము ఆ సత్యానికి అండగా ఉన్నాము. ఎఐకెఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది.

## వైభవోపేతంగా గానుగ నోము



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** కనుమ పర్వదినోత్సవంను పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలో పెద్ద ఎత్తున మహిళామణులు సామూహికంగా కన్నుల పండుగగా గానుగ నోము నోచుకున్నారు. గానుగ నోమును సంక్రాంతి పండుగలలో ముఖ్యమైన ఆచారంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తుంటారు. కుటుంబ ఐశ్వర్యం అంతా సంతోషంగా ఉండటంతో పాటు భర్త, పిల్లల క్షేమం కోసం అలాగే పంటలు బాగా పండాలని రైతులకు శుభ ఫలితాలు ఈ సమయంలో కలుగాలని కోరుతు ఈ నోము నోచుకున్నారు.నాగిశెట్టి జ్యోతి, సునీత, కావ్య, జ్యోతి, మ ల్యాల సంగీత తో పాటు దాదాపు రెండు వందల మంది మహిళలు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండలంలోని కర్జవెల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి అగ్నికి ఆహుతైంది. గురువారం ఉదయం రైతు చౌదరి భాస్కర్ ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విద్యుత్ వైర్లలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మంటలను గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే స్పందించి ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఇంట్లోని పత్తి అధిక మొత్తంలో కాలిపోయింది. ఈ అగ్నిప్రమాదంలో రైతుకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి పెద్ద ప్రమాదం తప్పించారు. సాగు కోసం చేసిన కష్టం మంటల్లో కలిసిపోవడంతో ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని బాధిత రైతు భాస్కర్ వేడుకుంటున్నారు. గ్రామంలో తరుచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్రామంలో దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/భైంసా :** గ్రామంలో దశలవారీగా సమస్యలు పరిష్కారానికి పాటు పడతానని ఇలేగాం సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని అన్ని వార్డుల్లో తిరిగి సమస్యలను గుర్తించారు. సి.సి.రోడ్లు,డ్రైనేజీ నిర్మాణానికి కొలతలు సేకరించారు.ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు.గ్రామ పంచాయతీ నిధులు రాగానే అభివృద్ధి పై దృష్టి సారిస్తామన్నారు.ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్,వార్డ్ మెంబర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## సర్పంచ్,వార్డు సభ్యులకు ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం / జన్నారం :** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కామన్ పల్లి గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమితి నూతన అధ్యక్షులు జాడి కిరణ్ ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధి కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎన్నికైన అభ్యర్థులు నిబద్ధతతో పనిచేసి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఉపాధ్యక్షులు వంగాల శేఖర్, ప్రధాన కార్యదర్శి చాట్ల తిరుపతి, క్యాషియర్ సొల్లు సత్యం, తాళ్ల పల్లి రమేష్, సలహాదారులు పంచరపు మల్లేష్, లోడియ అరవింద్, సభ్యులు కొలిమి కుంట్ల లక్ష్మీ పతి, పసుల రాజు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** వాహనాలు నడుపుతున్న ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ భూమేష్, సింగరేణి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ సిఎంఓ మధుకుమార్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని పేర్కొన్నారు. వాహనం నడిపే సమయంలో అత్యవసరమైనా ప్రధ్రువించకుండా తమ కుటుంబ బాధ్యతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ప్రయాణించాలని హితవు పలికారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల జీవిస పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరేపల్లిలో ముగ్గుల పోటీలు

### విజేతలకు బహుమతులు అందజేత

**ప్రజాపక్షం/పాపన్నపేట:** సంస్కృతి సాంప్రదాయాలు నేటి తరానికి తెలియజేయడానికి ప్రతి పండగను ఘనంగా జరుపుకుంటున్నామని ఆరేపల్లి సర్పంచ్ రజిత రాజశేఖర్ అన్నారు. ఆరేపల్లిలో సంక్రాంతి పురస్కరించుకొని సింజెంట ఫర్టిలైజర్ అండ్ కెమికల్స్ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.వీరిలో మొదటి బహుమతి నిర్మల, ద్వితీయబహుమతి దివ్య, తృతీయ బహుమతి స్నేహ లు గెలుచుకున్నారు. వీరికి సర్పంచ్ రజిత ఉపసర్పంచ్ రేష్మ లు బహుమతులు అందజేశారు.

# జిల్లాలోని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి

### భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్/ మంచిర్యాల :** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, భూగర్భ గనులు శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో కోట్లాది రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు, మురుగు కాలువ ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫలాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధమైన తాగునీరు అందిస్తామన్నా రు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1, 2, 7, 8, 9, 12, 13, 14, 16 వార్డులతో పాటు తిమ్మాపూర్ ప్రాంతాల్లో టియుఎఫ్, ఐడిసి, డిఎంఎఫ్‌టి, సిఎస్ఆర్ నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంజూరైన నిధులను ప్రణాళికాబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అమృత్ పథకం పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, తహసిల్దార్ సతీష్, డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకూ సాగునీరు

### కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



**ప్రజాపక్షం / దండేపల్లి :** మంచిర్యాల నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వ రకు సాగునీరు అందిస్తామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు స్పష్టం చేశారు. దండేపల్లి మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం నుండి నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి వారు సాగునీటి పంపిణీని శుక్రవారం ప్రారంభించారు.ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు భూముల చివరి వరకు పంటలకు అవసరమైన నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన నీటిని ప్రణాళికాబద్ధంగా విడుదల చేస్తున్నామని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో వరి సాగును స కాలంలో ప్రారంభించాలని, ఆలస్యమైతే ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. 20టిఎంసిల నీరు నిల్వ ఉందని, ప్రణాళిక ప్రకారం సాగు, తాగునీటి అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేంచంద్, ఆర్‌జిపిఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి శ్రీనివాస్,గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

### జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చే స్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పేదల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని,దేశంలో ఎక్కాడా లేనివిధంగా ఇల్లు లేని పేద వారందరికీ సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించామని చెప్పారు.అంతకుముందు ఆదిలాబాద్ పార్లమెంట్ స భ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ ఆధునీకరించాలని కోరారు. నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని తెలిపారు.జెడ్పి భవన నిర్మాణంతో పాటు ,రోడ్లు,వంతెనల నిర్మాణాలు మరమ్మత్తులు చేయాలని చెప్పారు.నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన మేర నిధులు కేటాయించాలని తెలిపారు.ఎమ్మెల్సీలు దండే విటల్,అంజిరెడ్డి,ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్‌రామారావు పటేల్,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్లు ఫై జాన్ అహ్మద్,కిషోర్ కుమార్ ,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కు మార్,ఆర్డీవో రత్న కళ్యాణి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ,ప్రజా ప్రతినిధులు,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## గాడియం ఇంటర్నేషనల్ స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు

### ఎస్ఐఎస్ఎఫ్ 2026 విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2026 రాష్ట్ర జిల్లా ప్రతిష్టకు కీలకమని అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈ నెల 19 నుండి 23 వరకు రామచంద్రాపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2026 ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టర్ గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంట్రెన్స్ ఎగ్జిట్ మార్గాలు ,సైనేజ్ ఏర్పాటు ఎట్టిబిట్ల సంఖ్య ,విద్యుత్ కనెక్షన్లు భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అలాగే సైన్స్ ఫెయిర్ లో పాల్గొనున్న విద్యార్థులు ,ఉపాధ్యాయులు, అతిథులకు అవసరమైన వసతి భోజనం రవాణా ఏర్పాట్లపై అదికారులను అడిగి తెలుసుకున్నారు. సౌత్ ఇండియా నలుమూలల నుం చి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు, అతిథులు ,హాజరు కానున్న నేఫథ్యంలో ఏలాంటి లటు పాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ కనెక్షన్లు ,బ్యాకప్ ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైన్స్ ఫేయర్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వసతి భోజనం రవాణా భ ద్రత పారిశుద్ధ్యం వైద్య సదుపాయాలు ,విద్యుత్ ,తాగునీరు తదితర కమిటీలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిక మిటీ ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేస్తూ ఏ లాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు అతిథులకు ఏలా ం టి ఇబ్బందులు కలగకుండా ప్రతి అంశంపై ప్ర త్యేక దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు అ న్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రిజిస్ట్రార్ ,రెవె న్యూ డివిజనల్ అదికారి రాజేందర్ జిలా సైన్స్ అదికారి సిద్దారెడ్డి,నోడల్ అదికారి లింబాజీ, ఎం ఈఓ నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్ ,పటాన్చెరు తహసీల్దార్ వివిద కుమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల గొంతుక ఖమ్మం సభ



**ప్రజాపక్షం / తాండూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వేడుకల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ తాండూర్ మం డల కార్యదర్శి కొండు బానేష్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో శుక్రవారం సభకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్నదని తెలిపారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలిసారి గర్జించిన పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. బ్రిటిష్ పాలన నుండి విముక్తి కోసం పోరాటాలు చేసినందుకు ఆనాడు పార్టీపై నిషేధం విధించి నాయకులను జైల్లో ని ర్బంధించినా వెనకడుగు వేయలేదని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది ప్రాణత్యాగంతో 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర సిపిఐది అని కొనియాడారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం రావడంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, బలహీన వర్గాల గొంతుకగా సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ నిలుస్తుందని వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేము ందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు.సిపిఐ జిల్లా సమితి సభ్యులు భయ్యా మొగిలి, మండల ఆర్గనైజర్ సెక్రటరీ వాసాల నాగరాజు, లక్ష్మి, ఎడ్ల గోపాల్, సన్యాసి, పుప్పాల అశోక్, ఇందారపు పోషం, రాజేశం, భూమయ్య పాల్గొన్నారు.

## జాన్కంపేట్ శివారులో పేలుడు కలకలం

### అడవి పందుల వేటగాళ్ల ఉచ్చుకు ఆవు బలి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** వన్య ప్రాణుల వేట కోసం దుండగులు వేసిన ఉచ్చు ఒక పాడి ఆవు ప్రాణాలను బలితీసుకుంది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో చోటుచేసుకున్న ఈ మందుగుండు పేలుడు ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పండుగ వేళమూగజీవం మృతి చెందడంతో బాధితుడు ఆవేధన వ్యక్తం చేస్తున్నాడు. రెంజల్ మండలం ధూపల్లి గ్రామానికి చెందిన కారే సాయి కుమార్ అనే రైతు తన ఆవును మేత కోసం జాన్కంపేట్ శివారులోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లారు. అడవి పందుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు ప్రమాదకరమైన పేలుడు మందును పశువుల ఆహారమైన తవుడులో ముద్దలుగా చేసి అక్కడక్కడ ఉంచారు. మేత మేస్తున్న క్రమంలో ఆవు ఆ తవుడు ముద్దను తినగానే ఒక్కసారిగా నోట్లోనే పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఆవు నోటి భాగం తీవ్రంగా ఛిద్రమై, రక్తం మడుగులో అక్కడికక్కడే మృతి చెందింది.అక్రమ వేటగాళ్ల నిర్వాకం వల్ల ఒక పేద రైతు కుటుంబానికి తీరని నష్టం వాటిల్లిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులో యధేచ్ఛగా పేలుడు పదార్థాలు వాడుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పేలుడు ముద్దలు పశువులకే కాకుండా, అటుగా వెళ్లే మనుషులకు ముఖ్యంగా చిన్న పిల్లలకు తగిలితే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

## కమ్యూనిస్టు వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

### సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్



**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** జహీరాబాద్ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సిపిఐ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీనన్ పాల్గొని ప్రసంగించారు.భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు కేవలం వేడుకలుగా కా కుండా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను ఆ ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను గుర్తు చేసుకునే చారిత్రాత్మక సందర్భమని అన్నారు . దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచే కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేశారని బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాల్లో కమ్యూనిస్టు నాయకులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు, పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో త్యాగాలు విడదీయరానివని పేర్కొన్న ఆయన దేశవ్యాప్తంగా జరిగిన రైతాంగ ఉద్యమాలు కార్మిక ఉద్యమాలు భూ పోరాటాలు ప్రజాస్వామ్య హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో సుమారు నాలుగు వేల మంద కి పైగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు.ఆ వీరుల త్యాగాల పునాదిపైనే నేటి ప్రజాస్వామ్య హక్కుల కార్మిక చట్టాలు భూ హక్కులు నిలబడి ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో కూడా వెట్టిచాకిరి నిర్మూలన, భూమి కోసం, భూపోరాటాలు, జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని ఆయన గుర్తు చేశారు. వారి రక్తంతో రాసిన చరిత్ర నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఆ త్యాగాలను మరచిపోతే చరిత్రకు ద్రోహం చేసినట్టేనని స్పష్టం చేశారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ధరల పెరుగుదల ,నిరుద్యోగం ,రైతుల ఆత్మహత్యలు ,ప్రజారంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రజాస్వామ్యం హక్కులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ బాధ్యత మరింత పెరిగిందని సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల మార్గమని అదే భావజాలంతో సిపిఐ ముందుకు సాగుతోందని చెప్పారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలు యువతకు కమ్యూనిస్టు బావజాలాన్ని పరిచయం చేసి గొప్ప వేదికగా నిలుస్తాయని పార్టీ చరిత్రను వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరికి చేరవేయావల్సిన బాధ్యత కార్యకర్తలంతరిపై ఉందని తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు,కార్మికులు,రైతులు,యువత మహిళలు భారీ సంఖ్యలో తరలించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల.. మాఘ స్నానాలకు భారీ ఏర్పాట్లు

### పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని సన్నిధిలో మాఘ అమావాస్య సందర్భంగా మాఘ స్నానాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఏడుపాయలలో జిల్లా అదనపు ఎస్పి ఎస్. మహేందర్ భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. బారికేడ్లు, పార్కింగ్, భక్తులు ఉపయోగించే క్యూలైన్ల నిర్వహణను సమీక్షించారు. 250 మందికి పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఏడుపాయలకు వచ్చే భక్తులు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి తెలియని లోతట్టు ప్రదేశాలకు వెళ్లకూడదన్నారు. వారి వెంట మెదక్ రూరల్ సిఐ జార్జ్, కొల్చారం ఎస్సై మొహినోదిన్, పాపన్నపేట పోలీసులు ఉన్నారు.



## గృహ జ్యోతితో విద్యుత్ బిల్లులకు ఊరట

**ప్రజాపక్షం/ఆజూనియర్ సివిల్ జడ్జ్, కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ర్మూర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో చేపట్టిన గృహజ్యోతి పథకం ద్వారా సామాన్యులకు విద్యుత్ బిల్లుల భారంనుంచి పేదవారికి ఎంతో ఊరట లభిస్తుందని పల్లె (హరిపూర్) సర్పంచ పార్దేమ్ మనీషా సంజీవ్ అన్నారు. ఆర్మూర్ మండలంలోని పల్లె (హరిపూర్) గ్రామంలో ఉపముఖ్యమంత్రి విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జారీ చేసిన గృహజ్యోతి ఉచిత విద్యుత్ కరపత్రాలను నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ తన చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు.ప్రభుత్వం రాయితీ ఇస్తున్న ఉచిత విద్యుత్ బిల్లు డబ్బులను వినియోగదారులు తమ పిల్లల చదువులు ఆరోగ్యం కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత

### ఎస్ఐ రంజిత్ కుమార్




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ఆవరణలో, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కార్యక్రమాన్ని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్, నర్సాపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు సమిష్టిగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ విచ్చేసి మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా కానీ, నిత్య జీవితంలో కానీ తమ తమ ద్విచక్ర వాహనాలను కానీ, వాహనాలను కానీ నడిపేటప్పుడు చట్టబద్ధంగా అన్ని రకాల అనుమతులతో పాటు ఇ న్సూరెన్స్ కలిగి ఉండాలని, రోడ్డు భద్రత కు సం బంధించిన జాగ్రత్తలను పాటించి, ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకొని ప్రయాణాలు చేయాలని, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త పడుతూ మీపై ఆధారపడ్డ కుటుంబాలను సంరక్షించుకోవాలన్నారు. లేనియెడల ప్రమాదాలకు గురై మీ పైన ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం నెలకొంటుంది అన్నారు. అనుమతులు లేకుండా చిన్నపిల్లలకు రోడ్డుపైన వాహనాలు నడుపుటకు ప్రోత్సహిస్తే ప్రాణాలకు ప్రమాదం వాటిలి చట్ట ప్రకారం చట్టపరంగా శిక్షార్హులవుతారు అన్నారు. ప్రతి ఒక్కరూ సంబంధిత పాలసీలు తమ తమ పేరు పై నమోదు చేసుకొని కుటుంబాలకు ఆర్థిక స్థైర్యాన్ని ఇవ్వాలి అన్నారు.ప్రతి ఒక్కరూ వాహనాలకు లైసెన్స్ ఇన్సూరెన్స్ స్వీ కరించి రోడ్డు భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణాలు కొనసాగించి ప్రమాదాలకు గురి కాకుండా తమ తమ విలువైన ప్రాణాలను కాపాడుకోలే అన్నారు. రోడ్డు భద్రతలో ఎవరైనా అలసత్వం వహించకుండా వాహనాలను సన్మార్గంలో నడుపుతూ ప్రమాదాలను నివారించాలన్నారు. పోలీస్ కానిస్టేబుల్స్, న్యాయస్థాన ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

# నాణ్యత విషయంలో రాజీ ప్రసక్తే లేదు

వాకింగ్ చేసే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు* ఐటిఐ కళాశాలలో రూ.1.5 కోట్లతో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు
* పట్టణంలో వెలుగులు నింపేలా సెంట్రల్ లైటింగ్ * అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
* చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడేదే లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజు నపెద్దపల్లి పట్టంలోని ఐటిఐ కళాశాల మైదానంలో వాకర్ సౌకర్యార్థం రూ. 91 లక్షలతో, ఐటిఐ కళాశాలలో రూ. 1.5 కోట్లతో స్విమ్మింగ్ పూల్,అలాగే రూ. 39 లక్షలతో పెద్దపల్లి బస్ స్టాండ్ సమీపంలో అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి సిసి రోడ్డు, డ్రైనేజీ లు మరియు పలు అభివృద్ధి కార్యక్రమాలకు అనంతరం రూ. 29 లక్షలతో పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్లో వెయిటింగ్ హాల్ మరియు టాయిలెట్స్ నూతన నిర్మాణాలకు శంకుస్థాపన అనంతరం పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి , తెనుగువాడలో 1.50 కోట్ల తో నూతన సెంటర్ లైటింగ్ ప్రా రంభోత్సవాలు చేశారు.అనంతరం పట్టణంలోని చందప ల్లి 15,15,17 వార్డుల్లో 54 మంది లబ్ధిదారుల ఇందిర మ్మ ఇళ్ల నూతన నిర్మాణాలకు ముగ్గులు పోసి శంకుస్థాపన అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మం జూరు పత్రాలను పంపిణీ చేసిన అనంతరంఆయన మాట్లాడుతూపెద్దపల్లిలో జరుతున్న అభివృద్ధి కార్యక్రమాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఐటిఐ కళాశాలలో వాకింగ్ చేసే ప్రజలు మమ్మళి సంప్రదించగా వారి కోరిక మేరకు రూ. 91 లక్షలతో నూతన వాకింగ్ ట్రాక్ లైట్లతో పాటు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పట్టణం సుందరంగా మారుతుందని ప్రజలందరూ అభివృద్ధిని గమనిస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి బస్ స్టాండ్ సమీపంలో, మహిళా పోలీస్ స్టేష న్లో, ఐటిఐ కళాశాలలో స్విమ్మింగ్ పూల్ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం రోజున శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

పట్టణంలోని చందపల్లిలో మరియు పె ద్దమ్మ నగర్లో రూ.1.50 కోట్లతో ప్రార ంభం చేసుకోవడం జరిగిందని అన్నారు. గతంలో ఎన్న డూ లేని విధంగా పెద్దపల్లి పట్టణంలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృ ద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం కాం గ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి పట్టణాన్ని సిద్ధం సుందరంగా మారుస్తున్నారని వ్య క్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, హౌసింగ్ డిఇ,ఎ.ఈ, ఐటీ ఐ కళాశాల ఉపాధ్యాయులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ కాంగ్రెస్‌నాయకులు,పలు గ్రామా ల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు సాధించడంలో సిపిఐ కీలకపాత్ర



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సిపిఐ కార్మికసంఘాలు స్థాపించి ప్రజలను చైతన్యపరిచి జమీందార్,జాగిర్ధార్ పాలన అంతం కావాలని,శ్రమకు తగిన వేతనం కార్మికులకు దక్కిందని అన్నారు.సిపిఐ పోరాటం చేసిందని గుర్తు చేశారు.ఖమ్మంలో 5లక్షల మందితో,40 దేశాల ప్రతినిధులతో జరిపే ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడి అధ్యక్షతన మండల విద్యా కార్యాలయం నుండి ర్యాలీతీశారు.అనంతరం ఖమ్మం మహసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.సిపిఐ తల్లిపార్టీగా ప్రజలపక్షాన ఉండి అనేక పోరాటాలు చేసిందని మాట్లాడారు.ఖమ్మం జిల్లా భారివత్తున సిపిఐ బహిరంగసభ 18 నిర్వహిస్తుందని వేలాదిమందిగా ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి,గంబీరావుపేట తదితర మండలాల నుం డి కార్మికసంఘాలు బహిరంగసభకు వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసంలక్ష్మ ణ్ తెలిపారు.యువనాయకుడు కుర్రరాజేష్. కార్మికులు మహేష్,నర్సవ్వ,దేవలక్ష్మ ,కవిత,రోజా,కీర్తన,మహేశ్వరి,రేఖ,దేవనర్సవ్వ,బాలలక్ష్మి వెంట శ్రామికవర్గం ఉన్నారు.

## కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి క్యాంప్ కార్యాలయంలో గురువారం సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో అలంకరించగా, సిబ్బంది పండుగ వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, వ్యవసాయం, ప్రకృతి, కుటుంబ బంధాల ప్రాధాన్యతను ఈ పండుగ ప్రతిబింబిస్తుందన్నారు. అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ ఆత్మీయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహణ



**ప్రజాపక్షం/చందుర్తి :** 'అరైవ్ అలైవ్' కార్యక్రమం లో భాగంగ మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో శుక్రవారం చందుర్తి ఎస్ఐజిల్లెల్ల రమేష్ గ్రామస్తులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ గమ్య స్థానాలను సురక్షితంగా చేరుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరు కుటుంబాలను దృష్టి లో ఉంచుకొని పరిమిత వేగం తో వాహనాలు నడుపుతూ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ,అజాగ్రత్త తో రోడ్డు ప్రమాదాలకు కారణమైన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు,యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జనవరి 26 రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహి ంచే ఆటల పోటీలకు ఆటంకంగా ఉన్న జనవరి 23, 24 తేదీలలో నిర్వహించే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి వినోద్ కు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణలు వినతి పత్రం అందజేశారు. జిల్లా విద్యాధికారి సానుకూలంగా స్పందించి ఇట్టి విషయాన్ని పై అధికారులకు చూచిస్తామని అన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుగంటి రమేష్, కొనరావుపేట మండల అధ్యక్షుడు గాజేంగివిష్ణు, తంగళ్ళపల్లి మండల అధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తిగుల్ పరిసరాలలో పులి సంచారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ పరిసర ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లుగా పాద ముద్రలు కన్పించటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కొంత మంది రైతులు తమ వ్యవసాయ పోలాలకు వెల్తుతున్న క్రమంలో తిగుల్‌వెంకటాపూర్ (బిజి)రోడ్డు ప్రాంతంలో పులి పాద ముద్రలు కనిపించండంతో గ్రామస్థులు ఆటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.దీంతో ఫారెస్టు జిల్లా అధికారి పద్మజరాణి, ఫారెస్టు సెక్షన్ అధికారి మల్లేశం తమ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యటించి పులి పాద ముద్రలను పరిశీలించారు. అలాగే మండలంలోని అంతాయిగూడలోని పులి పాదముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పాద ముద్రలు పరిశీలించి పులి లేదా చిరుత పులిలా అనేది నిర్థారిస్థామని చెప్పారు. ఇటీవల జిల్లాలోని దౌల్తాబాద్, రాయపోల్ ఆటవీ ప్రాంతంలో చిరుత సంచరించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందులో భాగంగానే జగదేవ్‌పూర్ మండలంలో కూడా పాద ముద్రలు చూస్తుంటే ఇక్కడ కూడా పులి సంచరిస్తున్నట్లుగా అవగాతమవుతుందని పేర్కొన్నారు. రైతులు తమ పోలాల వద్దకు వెల్లేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని తెలిపారు. పసువులను వ్యవసాయబావుల వద్ద ఒంటరిగా కాకుండా పశువుల పాకలో కట్టేసుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులపై పులి దాడులు చేస్తే వెంటనే ఆటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కాగా పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారణ జరిగితే సిసి కెమోరాలు ఏర్పాటు చేసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తామని అన్నారు.

## శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణ కేంద్రంలో నిర్మాణ దశలో నున్న ఇందిరమ్మ ఇండ్లను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడం ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మిస్తున్న ప్రతీ గృహానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్నదని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలకు జగిత్యాల ప్రాంతంలో ఇసుక బజార్ ను ఏర్పాటు చేసిన విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇటుక,కంకర,బేస్మెంట్ పై ధరల నియంత్రణకై లబ్ధిదారులకు అనుగుణంగా ఉండేలా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి టార్గెట్ ను చేరుకోవాలన్నారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకెపి,మెప్మా సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని చెప్పారు. దశలవారీగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు నేరుగా వారి ఖాతాలోకి చేరడం జరుగుతుందని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి,మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ భాస్కర్,తహసీల్దార్ ఏ.శ్రీనివాస్,ఎంపీడీవో రవీందర్ తదితరులు ఉన్నారు*మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని మౌళిక వసతులు ఇతర ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికలు శాంతియుతంగా సజావుగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## రానున్నది కెసిఆర్ పాలనే

పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** 10 ఎళ్ల బిఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ ప్రజలంతా ఆనందంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ రాష్ట్రం మళ్లీ అభివృద్ధికి దూరమవుతుందని, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం కెసిఆర్ పదేళ్ల కాలం పాలనలో అభివృద్ధిలో పరుగులు తీస్తే.. రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలోనే అభివృద్ధిలో వెనుకకు వెళ్లి పోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. మకర సంక్రాంతి పండు గ సందర్భంగా గురువారం గోదావరిఖని చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి గాలి పాటలను ఎగురవేస్తూ కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బిఆ ర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి గాలిపటాలను గాల్లోకి ఎగురవేస్తూ సంబరాలను జరుపుకున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో ప్రజలంతా సంక్షేమ పథకాలను పొందుతూ సంతోషంగా ఉన్నారని కానీ నేడు కాంగ్రెస్ పాలనలో రామగుండం ప్రజ లు భయంతో బతుకుతున్నారని తెలిపారు. ఇక రానున్నది మళ్ళీ బిఆర్ఎస్ పాలనేనని ప్రజలకు మంచి రోజులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిమ్మిబాబు బుర్రి వెంకటేష్ నూతి తిరుపతి, కిరణ్ జీ, మెతుకు దేవరాజు, సట్టు శ్రీనివాస్, తిమోతి, పిల్లి రమేష్, నిమ్మరాజుల సాగర్ ఆర్నపల్లి శ్రీనివాస్ ఇరుగురాళ్ల శ్రావన్, చింటూ, కొడి రామకృష్ణ, భానుచందర్, ఆవునూరి వెంకటేష్, కనకరాజ్, పవన్, ప్రదీప్,తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమానికి నిధులు

రూ. కోటి నిధులతో తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, ఇన్‌చార్జి కలెక్టర్ తో కలిసిమంత్రి సీతక్క శంకుస్థాపన



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ వద్ద జంక్షన్ అభివృద్ధి పనులను కోటి రూపాయలు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

**భీమేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) గురువారం వేములవాడలోని శ్రీ భీమేశ్వర వసతి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వేములవాడ ఏ ఎస్ పి రుత్విక్ సాయి, ఆలయఇఒరమాదేవి , వేములవాడ ఆర్‌డిఒ రాధాబాయి కలిసి మంత్రికి మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందజేశారు. శుక్రవారం ఉదయం భీమన్న సన్నిధికి చేరుకున్న రాష్ట్ర మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంత్రి వెంట ఉండి స్వామి వారి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మంత్రిని మర్యాదపూర్వకగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వేములవాడ సీఐ వీరప్రసాద్, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## సమ్మక్క జాతర వద్ద కైట్ ఫెస్టివల్!

**ప్రజాపక్షం/గోదావరిఖని :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గోదావరిఖని గంగానగర్ సమీపంలోని గోదావరినది ఒడ్డున ఉన్న సమ్మక్క, సారాలమ్మ జాతర వద్ద శుక్రవారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ పాల్గొన్నారు. ఉత్సాహంగా పతంగులను ఎగురవేశారు. కైట్ ఫెస్టివల్‌లో పలువురు పాల్గొనడంతో జాతర ప్రదేశమంతా సందడి నెలకొంది. అదేవిధంగా సింగరేణి ఆర్‌జి1 జీఎం డి.లలిత్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే జాతర వద్ద చేపడ్తున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ నెలాఖరులో జరగనున్న సమ్మక్క, సారాలమ్మ జాతరకు లక్షలాది భక్తులు తరలిరానున్నందున అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబురాల్లో ఎమ్మెల్యే హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాతి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువత రంగు,రంగుల గాలిపటాలు వేస్తు ఉత్సాహాంగా పండుగ వేడుకల్లో పాలుపంచుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే హరీష్‌రావు యువతతో కలసి సంక్రాంతి సంబురాల్లో పాల్గొని ఉత్సహాంగా గాలిపటాలు ఎగురవేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం ఇంటికి చేరుతుందని కాబట్టి ఇది రైతుల పండుగ అన్నారు. సంక్రాంతి పండుగ శీతకాలంలో రావటం వల్ల చలి ఎక్కువగా ఉంటుందని. ఈ సమయంలో ఎండలో గాలిపటాలు ఎగురవేయటం వల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుందన్నారు. వ్యాపార దృక్పథంతో ప్రవేశించిన చైనమంజా మన పండుగలనుకలుషితం చేస్తుందన్నారు. చైనామాంజను ఎవ్వరు వినియోగించవద్దని సూచించారు. చైనామాంజా విషయంలో ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని సూచించారు. పతంగుల పండుగలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పేదల అభివృద్ధే ధ్యేయంగా పాలన

సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** కాంగ్రెస్ పార్టీలో నూతనంగా చేరిన వారితోపాటు పార్టీ సీనియర్ నాయకులందరినీ సమన్వయం చేస్తూ ప్రతీ కార్యకర్త గౌరవాన్ని కాపాడతానని రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి,దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న,మాజీ కౌన్సిలర్లు అయ్యోరి వేణుగోపాల్, సయ్యద్ యూనుస్, సీనియర్ నేతలు స్తంభంకాడి రమేష్,సాంబమూర్తి, కొమురయ్య లతో పాటు సుమారు 200 కు పైగా మంత్రి అడ్లూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాప్రయోజన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్న ప్రతీ ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని అలాగే పార్టీలో కొత్తగా చేరేవారితోపాటు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గౌరవాన్ని కాపాడుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల జీవితాలలో నేరుగా మార్పులు తీసుకొచ్చే పలు చారిత్రక నిర్ణయాలు తీసుకున్నదని మంత్రి పేర్కొన్నారు.రాజీవ్ యువ వికాసం, చేయూత,ఆసరా పెన్షన్ పునరుద్ధరణ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి పథకం,అన్నపూర్ణ పథకం ద్వారా పేదల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో సంస్కృతా ంధ్ర డిగ్రీ కళాశాల పునఃప్రారంభం, ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితుల కు రూ.18 కోట్ల పరిహారం పంపిణీ,నూతన డిగ్రీ కళాశాల,ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణాలు,గోదావరి నది సీవరేజి పనులు ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈనెల 20న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ధర్మపురికి రానున్నారని ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరపనున్నారని మంత్రి తెలిపారు.2027 గోదావరి నది పుష్కరాలను నభూతో నభవిష‌త్‌లా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భారీగా ప్రత్యేక నిధులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.ది నేష్, వేముల రాజేష్,చిలుముల లక్ష్మ ణ్, జక్కు రవీందర్, చీపిరిశెట్టి రాజేష్ ,సొల్ల భీమయ్య,ఎస్. గణే ష్,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకూ నీరందించాలని సిఎంకు వినతి



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** కోరుట్ల నియోజవర్గంలో సదర్ మట్ ప్రాజెక్ట్ ద్వారా కోరుట్ల నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. నిర్మల్ జిల్లా గోదావరి నదిపై నిర్మించన సదర్ మట్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ శుక్రవారం కలిసి నియోజకవర్గ సమస్యలపై విన్నవించారు. గంగనాల ప్రాజెక్టు ప్రత్యేకత తూము ఏర్పాటు చేసి మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట సంగం శ్రీరాంపూర్, కొత్త దామరాజు పల్లి ఓబులాపూర్ గ్రామాలకు సాగు నీరు అందించడంతో సుమారు 8000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లబ్ధి చేకూరుతుందని, అలాగే గొర్రెపల్లి చెరువు పునరుద్ధరణ రేగుంట మాటు కాలువ, చెక్ డ్యామ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.కోరుట్ల నియోజకవర్గంలో విద్య వైద్యరంగంతో పాటు మౌలిక వసతుల ఏర్పాటుకు నిధుల మంజూరు చేయాలని కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ నాయకులు,తదితరులున్నారు.

## ఎంఆర్‌సి భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/చందుర్తి(రుద్రంగి):** సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.48 .60 లక్షలతో రుద్రంగి మండల కేంద్రంలో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం భవనాన్ని ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లోనే రెండో అతిపెద్ద గ్రామం అయిన రుద్రంగిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.త్వరలోనే క్రీడా మైదానం ఏర్పాటు,ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటేడ్ భవన నిర్మాణం ,ఎటిసి పనుల ప్రారంభం చేస్తామన్నారు. కోటి 50 లక్షల రూపాయాలతో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.విద్యావనరుల కేంద్రం అందుబాటులోకి రావడంతో మండలంలో విద్యాభివృద్ధిసమావేశాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. అనంతరం గ్రామపంచాయితీ ఆవరణ లో 21మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గండి నారాయణ,ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, ఎఎంసి చైర్మన్ చెలుకల తిరుపతి,ఆర్‌డిఓ రాధబాయి,అధికారులు , స్థానిక నాయకులు పాల్గొన్నారు

## 'చిన్నస్వామి'కి పూర్వవైభవం దక్కేనా...

ఒకప్పుడు ఐపిఎల్ మ్యాచ్‌లతో కోలాహలంగా కనిపించిన చిన్నస్వామి స్టేడియానికి పూర్వ వైభవం తేవాలని కర్నాటక క్రికెట్ సంఘం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఎలాగైనా ఐపిఎల్ మ్యాచ్లను మళ్లీ చిన్నస్వామిలో నిర్వహించాలనే ఉద్దేశంతో రాయల్ ఛాలెంజర్స్



బెంగళూరు ఫ్రాంచైజీ కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. స్టేడియంలో అభిమానులను నియంత్రించేందు కు, వారికి భద్రత కల్పించేందుకు కృత్రిమ మేధ తో పనిచేసే కెమెరాలు ఉపయోగిస్తామని ఆర్సీబీ యాజమాన్యం తెలిపింది. నిరుడు జూన్ 4న తొక్కిసలాటలో 11మంది మరణించడంతో చి న్నస్వామి స్టేడియం మూతపడింది. భద్రతాపరమైనలోపాలు ఉన్నందున చిన్నస్వామిలో మ్యాచ్ల నిర్వహణకు కోర్టు ససేమిరా అంది. పోలీసులు కూడా నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. దాం తో.. అప్పటి నుంచి ఆమైదానంలో ఒక్క క్రికెట్ మ్యాచ్ కూడా జరగలేదు. ఇటీవలే విజయ్హజారే ట్రోఫీ మ్యాచ్లకు కూడా చిన్నస్వామి మైదానం నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఈమధ్యే ఎన్నికైన వెంకటేశ్ ప్రసాద్ నేతృత్వంలోని కొత్త కార్యవర్గం పూర్వవైభవంపై దృష్టి సారించింది. ఈమేరకు ఆర్సీబీ యాజమాన్యంతో చర్చలు జరిపింది. చిన్నస్వామిలో భద్రతపై భరోసా కల్పించేందుకు అనువైన చర్యలను ప్రకటించింది. తొక్కిసలాట అనంతరం 'ఖేల్ డీకున్హ కమిషన్' కర్నాటక క్రికెట్ సంఘానికి కీలక సూచనలు చేసింది. అభిమానుల భద్రత కోసం తగిన ఏర్పాట్లు చేసిన తర్వాతే మ్యాచ్ల గురించి ఆలోచించాలని ఈ ఏకసభ్య కమిషన్ పేర్కొంది. దాంతో.. చిన్న స్వామి స్టేడియంలో 300 నుంచి 350 ఏఐతో పనిచేసే కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం భావిస్తున్నాయి.

**4.5 కోట్లు ఖర్చుతో...** కృత్రిమ మేధతో పనిచేసే కెమెరాల సాయంతో పోలీసులు ప్రేక్షకుల మధ్య తోపులాట జరగకుండా చూస్తారు. అంతేకాదు స్టేడియంలోకి అభిమానులను అనుమతించేటప్పుడు, మ్యాచ్ అనంతరం బయటకు వెళ్లేటప్పుడు క్యూలో వెళ్లేలా చర్యలు తీసుకుంటారు. తద్వారా ఎవరికి ఎ లాంటి ఇబ్బంది, ప్రమాదం జరగకుండా చూసుకుంటామని ఆర్సీబీ, కేఎస్సీఏ అంటున్నాయి. అందుకని ఒక్కసారే స్టేడియమంతా రూ.4.5 కోట్లు ఖర్చుతో ఈ ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయాలని అనుకుంటున్నామని ఫ్రాంచైజీ వెల్లడించింది. ప్రస్తుతానికైతే చిన్నస్వామిలో ఐపిఎల్ మ్యాచ్లకు అనుమతులు లేవు. బిసిసిఐ నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తుందా? లేదా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది. ఒకవేళ ఆమోదం రాకుంటే బెంగళూరు బయట ఐపిఎల్ ఆడేందుకు ఆర్సీబీ సిద్ధమవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే పుణేలోని స్టేడియాన్ని ఫ్రాంచైజీ పరిశీలించింది. సో.. ఐపిఎల్ షెడ్యూల్ వచ్చాకే చిన్నస్వామిలో మ్యాచ్లు ఉంటాయా? ఉండవా? అనేది తెలియనుంది.

## టి–20ల్లో డేవిడ్ అరుదైన రికార్డు!

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ వయసు పైబడుతున్నా కొద్దీ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. 39 ఏళ్లలోనూ తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ తన బ్రాండ్ క్రికెట్తో అభిమానులను అలరిస్తున్నాడు. రెండేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన వార్నర్.. ఫ్రాంచైజీ క్రికెట్లో సెంచరీలతో విరుచుకుపతున్నాడు. బిగ్బాష్ లీగ్లో విధ్వంసక శతకంతో రికార్డు నెలకొల్పాడు. పొట్టి ఫార్మాట్లో పదోసారి మూడంకెల స్కోర్ అందుకోవడంతో పాటు14 వేల పరుగుల మైలురాయిని అధిగమించాడీ చిచ్చరపిడుగు. ఫార్మాట్ ఏదైనా దూకుడే మంత్రంగా చెలరేగే డేవిడ్ వార్నర్ స్వదేశంలో జరుగుతున్న బిగ్బాష్ లీగ్లో సెంచరీలతో మెరుస్తున్నాడు. జనవరి 3వ తేదీన హోబర్ట్ హరికేన్స్ బౌలర్లను ఉతికేస్తూ 57 బంతుల్లోనే వంద కొట్టి.. 130 పరుగులతో అజేయంగా నిలిచాడీ మాజీ ప్లేయర్. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ టీ20ల్లో అతడికి 9వ సెంచరీ అది. తాజాగా సిడ్నీ సిక్సర్స్ బౌలర్ల భరతం పట్టిన అతడు.. 101 రన్స్తో జట్టును గెలిపించాడు. గత నాలుగు మ్యాచుల్లో వార్నర్ స్కోర్లు.. 110 నాటౌట్, 82, 67 నాటౌట్, 130 నాటౌట్.



**14 వేల క్లబ్‌లో.. ఆ ముగ్గురితో...** పొట్టి ఫార్మాట్లో వార్నర్ అరుదైన ఘనత సాధించాడు. సిడ్నీ సిక్సర్స్పై సెంచరీతో వీరవిహారం చేసిన అతడు అంతర్జాతీయ, ఫ్రాంచైజీ టీ20ల్లో 14 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా ఈ ఫీట్ నెలకొల్పిన నాలుగో బ్యాటర్గా అవతరిచాడతడు. వార్నర్ కం ముందు వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్, మాజీ ఆల్రౌండర్ కీరన్ పొలార్డ్, ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ అలెక్స్ హేల్స్ ఈ మైలురాయికి చేరుకున్నారు. ప్రస్తుతం గేల్ 14,562 రన్స్తో అగ్రస్థానంలో ఉన్నాడు. పొలార్డ్ 14,462 పరుగులతో, అలెక్స్ 14,449 రన్స్తో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. వార్నర్ 14,028 రన్స్తో నాలుగో స్థానంలో నిలిచాడు.

**విజయంతో వీడ్కోలు...** రెండేళ్ల క్రితం సొంతగడ్డపై పాకిస్థాన్తో జరిగిన సిడ్నీ టెస్టుతో సుదీర్ఘ ఫార్మాట్కు వీడ్కోలు పలికాడు వార్నర్. అనంతరం భారత్లో వరల్ కప్ ట్రోఫీ గెలుపొదాక వన్డేలకు వీడ్కోలు పలికేసిన డేవిడ్ భాయ్.. టీ20 వరల్ కప్తో మూడు ఫార్మాట్ల నుంచి వైదొలిగాడు. తన సుదీర్ఘ కెరీర్లో బాదుడే పరమావధిగా అభిమానులను అలరించిన వార్నర్ పలు రికార్డులు తన పేరిట రాసుకున్నాడు.

## టాస్ గెలిచిన గుజరాత్.. ఆర్‌సిబి 'హ్యాట్రిక్' కొట్టేనా?

మహిళల ప్రీమియర్ లీగ్‌లో మరో ఆసక్తికర పోరుకు వేళైంది. వరుసగా రెండు విజయాలతో దూసుకెళ్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు గుజరాత్ జెయింట్స్ సవాల్ విసురుతోంది. హ్యాట్రిక్‌పై కన్నేసిన ఆర్సీబీకి చెక్ పెట్టాలనుకుంటోంది గుజరాత్. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో కంగుతిన్న ఆ జట్టు ఈసారి గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశమున్న ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన గుజరాత్ సారథి అష్ గార్డ్నర్ బౌలింగ్ తీసుకుంది.

**గుజరాత్ తుది జట్టు :** బేత్ మూనీ(వికెట్ కీపర్), సోఫీ డెవినె, అష్లే గార్డ్నర్(కెప్టెన్), శివాని సింగ్, జార్జియా వరేహం, కనికా ఆహుజా, భారతి ఫుల్మాలి, కష్వీ గౌతమ్, తనూజ కన్వర్, రాజేశ్వరీ గైక్వాడ్, రేణుకా సింగ్.


**ఆర్సీబీ తుది జట్టు :** గ్రేస్ హ్యారిస్, స్మృతి మంధాన(కెప్టెన్), దయలాన్ హేమలత, గౌతమీ నాయక్, రీచా ఘోష్(వికెట్ కీపర్), రాధా యాదవ్, నడినే డీక్లెర్క్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, లిన్నే స్మిత్, లారెన్ బెల్.



## సైన్స్

నక్షత్ర విస్ఫోటనానికి సంబంధించిన 'సూపర్ నోవా' అనే పదాన్ని తరచు వాడుతుంటారు. అయితే, ఇప్పుడు శాస్త్రవేత్తలు మరో కొత్త భౌతిక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నారు. అదే 'సూపర్‌కిలోనోవా'. ఇది అత్యం వేగంగా ఎదుగుతున్న అతి శక్తివంతమైన విస్ఫోటన సిద్ధాంతం. ఇటీవల, ఐఐటి బాంబే, ఐఐటి బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఎ) కు చెందిన శాస్త్రవేత్తలు కూడా సభ్యులుగా ఉన్న ఒక అంతర్జాతీయ పరిశోధక బృందం 'సూపర్‌కిలోనోవా' అనే అత్యంత అరుదైన, అపార శక్తివంతమైన ఖగోళ విస్ఫోటనం జరిగి ఉండొచ్చని నివేదించింది.ఇది ఇప్పటికీ పూర్తిగా నిర్ధారితమైన ఖగోళ సంఘటన కాదు. అయినప్పటికీ, బలమైన పరిశీలనా ఆధారాలపై ఆధారపడి ఎదుగుతున్న ఒక పరిశీలనాత్మక సిద్ధాంతంగా శాస్త్ర ప్రపంచంలో చర్చకు వస్తోంది. కిలోనోవా అనేది ఇప్పటికే శాస్త్రీయంగా స్థిరపడిన ఖగోళ సంఘటన. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానితో ఒకటి ఢీకొని విలీనమయ్యేటప్పుడు ఈ సంఘటన జరుగుతుంది. ఈ విలీనంలో, బంగారం, ప్లాటినం, నియోడియమియం వంటి భారీ రేడియోధార్మిక మూలకాలు విపరీతంగా అంతరిక్షంలోకి విడుదలవుతాయి. ఈ మూలకాలు కాలక్రమంలో రేడియోధార్మిక విచ్ఛిన్నం చెందుతూ వెలుగు, ఇన్‌ఫ్రారెడ్ కాంతిని విడుదల చేస్తాయి. ఈకాంతి ఉద్గారాన్నే కిలోనోవా అంటారు. మనం భూమిపై మనం ఉపయోగించే బంగారం వంటి మూలకాలు కూడా ఇలాంటి న్యూట్రాన్ నక్షత్రాల విలీనాల ద్వారానే ఏర్పడతాయని ఆధునిక ఖగోళ శాస్త్రం చెబుతోంది. అయితే సూపర్‌కిలోనోవా అంటే ఏమిటి? అనేప్రశ్న ఇక్కడ ఉపయిస్తుంది. సూపర్‌కిలోనోవా అనేది సాధారణ


## ఖగోళ శాస్త్రంలో సరికొత్త విస్ఫోటన సిద్ధాంతం...



కిలోనోవా కంటే ఒక స్థాయి ముందుకు వెళ్లిన భావన. ఇది రెండు దశలుగా జరుగుతుందని పరిశోధకులు సూచిస్తున్నారు. మొదటి దశ.. సూపర్ నోవా పేలుడు. ఒక భారీ నక్షత్రం సూపర్‌నోవాగా పేలినప్పుడు, ఒక్క న్యూట్రాన్ నక్షత్రం కాదు.. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక రెండో దశ న్యూట్రాన్ నక్షత్రాల విలీనం. కాలక్రమంలో ఈ రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానివైపు ఒకటి తిరుగుతూ దగ్గరవుతాయి చివరికి పరస్పరం విలీనమవుతాయి ఈ విలీనమే తర్వాత కిలోనోవా సంఘటనకు దారితీస్తుంది. అందుకే దీనికి సూపర్‌కిలోనోవా అనే పేరు. కాగా, సూపర్‌కిలోనోవాలో అటు సూపర్ నోవా పేలుడి లక్షణాలు.. ఇటు, కిలోనోవా ఉద్గార లక్షణాలు.. రెండూ కలసి కనిపిస్తాయి. అందువల్ల ఇది, సాధారణ కిలోనోవాకంటే ఎక్కువ శక్తివంతమైనది. ఎక్కువ ప్రకాశవంతంగా, ఎక్కువ కాలం గమనించదగినదిగా ఉంటుంది. శాస్త్రవేత్తల అంచనాలను అనుసరించి, సూపర్‌కిలోనోవా నిజంగా జరిగితే, అదిఐ అత్యంత తీవ్రమైన గ్రావిటేషనల్ వేవ్స్ (అంతరిక్ష–కాల వంకరలు), అతి శక్తివంతమైన ఎలక్ట్రోమాగ్నెటిక్ పేలుళ్లను విడుదల చేస్తుంది. ఇవి సాధారణ కిలోనోవాల కంటే, ఎక్కువ ప్రకాశవంతంగా ఎక్కువ శక్తి విడుదల చేస్తూ, ఎక్కువ సమయం కనిపించేలా ఉంటాయి. అయితే, సూపర్‌కిలోనోవాలు ఇప్పటికీ, పూర్తిగా స్థిరపడిన ఖగోళ సంఘటనలుగా అధికారికంగా ఇంకా గుర్తించబడలేదు. అవి ఇప్పటికీ పరిశీలనల ఆధారంగా ఎదుగుతున్న లేదా నిర్ధారణ దశలో ఉన్న ఖగోళ సంఘటనల వర్గానికి చెందుతాయి. అంటే, ఇది ఖచ్చితంగా ఉందే అని చెప్పడానికి ఇంకా ఎక్కువ డేటా, మరిన్ని పరిశీలనలు అవసరం. సూటిగా చెప్పాలంటే కిలోనోవా అనేది ఇప్పటికే స్థిరపడిన ఖగోళ సంఘటన. సూపర్‌కిలోనోవా: బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ, ఇంకా నిర్ధారణ దశలో ఉన్న అత్యంత శక్తివంతమైన విస్ఫోటనం. సూపర్‌కిలోనోవా నిజమని పూర్తిగా నిర్ధారితమైతే, నక్షత్రాల జననం, భారీ మూలకాల ఉత్పత్తి, గ్రావిటేషనల్ వేవ్స్ యొక్క మూలాలు తదితర అంశాలపై మరింత లోతైన, సమగ్రమైన విశ్లేషణకు అవకాశం ఏర్పడుతుంది. ఇది ఖగోళ శాస్త్రంలో కొత్త అధ్యాయానికి దారితీసే అవకాశం ఉన్న భావన.

## భూమి లోతుల్లో 'బ్లోబ్స్'

ఆఫ్రికా, పసిఫిక్ మహా సముద్రాల కింది భాగంలో, భూమి లోతుల్లో.. దాదాపు మధ్యభాగానికి సమీపంలో రెండు మహా విస్తృత, దట్టమైన నిర్మాణాలు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని 'బ్లోబ్స్' అని పిలుస్తారు. పరిణామం పరంగా ఇవి చాలా దేశాలకంటే పెద్దవి. అత్యంత వేడితో ఉండే బ్లోబ్స్ ఎలా ఏర్పడ్డాయనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. తాజా పరిశోధనలను అనుసరించి, ఇవి భూమి ప్రారంభ దశలో మాగ్మా ఓషన్ దశలో ఏర్పడిన పురాతన రాళ్లు లేదా కోర్ నుండి లీకైన పదార్థాలు లేదా క్రస్టు భాగాలు. కొన్ని పరిశోధనల ప్రకారం, ఇవి ఒక ప్రాచీన గ్రహం 'థియా' భూమిని ఢీకొన్నపుడు ఏర్పడ్డ మిశ్రమ పదార్థాలు కావొచ్చు. ఇవి బహుశా 4.5



బిలియన్ సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నాయని అంచనా. భూ భ్రమణం, పరిభ్రమణం ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. అదే విధంగా భూమి అటూఇటూ ఊగకుండా, స్థిరంగా ఉంచడంలో తోడ్పడుతున్నాయి. ఇవి భూమిలోని వేడి, ఖనిజాలు ఉపరితలానికి చేరే మార్గాన్ని ప్రభావితం చేస్తున్నాయి. దీనివల్ల అగ్ని పర్వత దీవులు ఏర్పడ్డాయి. బ్లోబ్స్ ద్వారా కార్బన్, హైడ్రోజన్ వంటి మూలకాలు అధికంగా భూ ఉపరితలం వైపు ప్రవహించాయి. ఇది మిగిలిన జీవపరేణు, వాతావరణ, సముద్రం కొన్నాళ్లు ఏర్పడడంలో కీలక పాత్ర పోషించింది. భూమిలో వాతావరణ మార్పులు, జీవవైవిధ్యం, కాంతి విడుదల, మొదలైనవాటిపై గణనీయ ప్రభావాన్ని చూపాయి. ఇలా జీవం ఆవిర్భావానికి అవసరమైన ఘటి, వేడి, మూలకాలు అందించడంలో వీటి పాత్ర ఉందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ బ్లోబ్స్ భూమి మొదటి రోజుల్లో నుంచి ఎలా మార్పులకు గురయ్యాయో, ఎందుకు భూమి జీవానికి మరింత అనుకూలంగా తయారైందో తెలుసుకోవడానికి ఈ బ్లోబ్స్ అధ్యయనం ఉపయోగపడుతుంది. ఇవే సిద్ధాంతాలను, అధ్యయనాలను శుక్రుడు, శని, అంగారకుడు వంటి గ్రహాలకు కూడా వర్తించే అవకాశం ఉందని అంటున్నారు.

## శతాబ్ది సభకు తరలిరండి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధానకార్యదర్శి లతాదేవి పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 18న ఖమ్మంలో జరిగే బహిరంగసభకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి విజ్ఞప్తి చేశారు. మహిళా సమాఖ్య జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మహిళల హక్కుల కోసం నికరంగా నిలబడి పోరాడింది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. నాటి సతీసహగమన దురాచారం నుండి ఇప్పటి వేధింపుల వరకు మహిళల పక్షాన నిలబడిన మహిళలకు కమ్యూనిస్టులు రక్షణగా నిలిచారన్నారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మహిళల వేధింపులకు వినియోగించడం శోచనీయమన్నారు. మహిళా ఐక్య పోరాటాల అవసరం మరింతగా పెరిగిందని లతాదేవి తెలిపారు. 18న ఖమ్మంలో జరిగే ప్రదర్శన బహిరంగ సభలో మహిళలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో సిహెచ్ సీతామహాలక్ష్మి, మందడపు రాణి, బత్తినేని నీరజ, పోటు మమత, ఒరుగంటి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల చరిత్ర సిపిఐది

పార్టీ సీనియర్ నాయకుడు ఆందోజు రవీంద్రాచారి




**ప్రజాపక్షం/రంగారెడ్డి/అబ్దుల్లాపూర్‌మెట్:** నాటినుంచి నేటి వరకు పోరాటాల చరిత్ర సిపిఐ దని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. శుక్రవారం రావినారాయణరెడ్డి కాలనీ, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో రవీంద్రాచారి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డిలతో కలసి మాట్లాడారు. పేదల సమస్యలు, ఇండ్లు, ఇండ్లస్థలాలు, సాగుభూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న సిపిఐ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో సొంత ఇల్లు లేని నిరుపేదల కోసం భూపోరాటాలు నిర్వహించి వేలాది మంది నిరుపేదలకు నీడ కల్పించిన ఘనత సిపిఐకి దక్కుతుందన్నారు. నాటినుండి నేటి వరకు కార్మికులు కర్షకులు నిరుపేదలు బడుగు బలహీన వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి సిపిఐ కృషిచేసిందన్నారు. పోరాటాలు, ఉద్యమాల జరిత్ర కలిగిన సిపిఐ వంద సంవత్సరాలు ముగింపు ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో ఈనెల 18న జరిగే భారీ బహిరంగసభకు రంగారెడ్డి జిల్లా నుంచి సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలిరావాలని రవీంద్రాచారి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండలకార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మండల కౌన్సిల్ సభ్యులు సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

## తండోపతండాలుగా ఖమ్మం సభకు..

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు పిలుపు




**ప్రజాపక్షం/హనుమకొండ :** సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరుగనున్న భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ,వరంగల్ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొంటారని తెలిపారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ తప్పా మరెవరు న్యాయం చేయలేరని, భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) పుట్టి వంద సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు, ఇండ్లస్థలాలు, సాగుభూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న భారత కమ్యూనిస్టుపార్టీ అన్నారు. వందేళ్ల ప్రస్థానంతో ముందుకు సాగుతూ నాడు స్వాతంత్రోద్యమం నుంచి నేటి వరకు ప్రజల కోసం ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణమన్నారు.40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి సిపిఐ ప్రతినిధులు, శ్రేణులు తరలివస్తున్న ఈ భారీ బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు, అభిమానులు, సానుభూతిపరులు, కార్యకర్తలు పెద్దఎత్తున కదలివచ్చి బహిరంగసభను విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాష్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్ జ్యోతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, వరంగల్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లేదేళ్ల శరత్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాలకు వెరవకుండా ప్రజల పక్షాన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో శాఖ కార్యదర్శి పూజారి రామన్న అధ్యక్షతన జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో సింగరేణి కార్మికులు, ప్రజల హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర తమ పార్టీకి ఉందని గుర్తు చేశారు. ప్రాణత్యాగాలకు వెరవకుండా ప్రజల పక్షాన నిలిచిన నాయకులను మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వందేళ్ల శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. సమావేశంలో మేకల దాసు, బొడ్డు లచ్చన్న, కొత్తపల్లి మహేష్, మూడ సుధాకర్, కూన సాయి, కిరణ్, నూకల రాజయ్య, అంజయ్య, మాశం నవీన్, రాజేష్, సంపత్ పాల్గొన్నారు.




## నేటి యువత ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

సిపిఐ శతాబ్ది ఉత్సవాల క్రీడల ముగింపు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పేర్కొన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాలలో నిర్వహించిన గ్రామీణ క్రీడోత్సవాల ముగింపు సభకు హాజరై విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పశ్య పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరి నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన క్రీడల ముగింపు సభలో రూరల్ సిఐ సర్వయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి, నెల్లూరి శ్రీనివాసరావుతో కలిసి పశ్య పద్మ మాట్లాడారు. యువకులు ప్రశ్నించే తత్వాన్ని ఎంచుకున్నప్పుడే దేశానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. యువకులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వారి మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి తోడ్పడుతుందన్నారు. నేటి యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బలపాల గ్రామం ఎంతో చైతన్యవంతమైన గ్రామమని, ఇక్కడ రాజకీయాలు పక్కనపెట్టి క్రీడలను సమర్థంగా నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. అనంతరం కబడ్డీ, షటిల్, ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, బలపాల సర్పంచ్ బాదావత్ బిక్కు నాయక్, నామ సైదులు, బత్తుల వెంకన్న, కోటయ్య, అంబటి వెంకటనారాయణ, లింగయ్య తండా సర్పంచ్ హరిలాల్, రొయ్యల నాగేశ్వరరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి రామగాని రవి, సిపిఐ మండల నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, కన్నూజు వెంకట నారాయణ, సిపిఐ తొమ్మిదో వార్డు మెంబర్ రన్వాల్ రమేష్, రొయ్యల సూరి, రేపాకుల పాపయ్య, బొల్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.




## హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



సిపిఐ జాతీయ నేత ప్రకాష్‌బాబు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్మిక హక్కులు, సంక్షేమంకోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్‌బాబు తెలిపారు. శుక్రవారం శ్రీశ్రీ సెంటర్‌లో శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ ప్రచారంలో భాగంగా ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల శ్రమకు తగిన వేతనం లభించడం లేదన్నారు. శ్రమకు తగిన విధంగా వేతనం లభించే చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ప్రకాష్‌బాబు ఆరోపించారు. మోదీ తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని భవిష్యత్తులో కార్మిక వర్గం మరిన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని, యావత్ కార్మికలోకం భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధులు కావాలన్నారు. ఆటో ర్యాలీ నగరంలోని అన్ని ప్రధాన వీధుల్లో సాగింది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు, సిపిఐ హవేలి ఏరియా కార్యదర్శి ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి.మోహన్ రావు, శ్రీనివాసరావు, జాకీర్, ఆముదాల వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఖమ్మంలో ముఖ్యమంత్రి పర్యటన





## రూ.362 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు

## ఈ నెల 19న మేడారం అభివృద్ధి పనులు ప్రారంభం

## ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఈనెల 18న ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఖమ్మం పర్యటన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం మద్దులపల్లి నర్సింగ్ కళాశాల వద్ద జిల్లా ఇంచార్జి కలెక్టర్ డా. పి.శ్రీజ, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత జిల్లా అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలో రూ.362 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారన్నారు. మద్దులపల్లిలో జెఎన్‌టియు కళాశాల భవన నిర్మాణానికి, మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. నూతన మార్కెట్ యార్డు, కూసుమంచిలో వంద పడకల ఏరియా ఆసుపత్రి ప్రారంభోత్సవ పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇంచార్జి మంత్రి శ్రీహరి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహలతో పాటు తాను కూడా పాల్గొంటానని తెలిపారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఒక కార్పోరేషన్, ఆరు మున్సిపాలిటీలకు సంబంధించిన ఎన్నికలకు సంబంధించి ముఖ్య కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి ఆయా డివిజన్లకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు. మేడారాన్ని ఈనెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతుందని ప్రతి రెండేళ్లకు జాతర జరుగుతుందన్నారు. ఈసారి జరిగే జాతరకు ప్రత్యేకత ఉందని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా అక్కడ కాకతీయుల రాతి కట్టడాల తరహాలో సుందరీకరణ, శాశ్వత రాతి కట్టడాలను అద్భుతంగా నిర్మించామన్నారు. పూజారుల సూచనల ప్రకారం జనవరి 19న మేడారం అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. 18న సాయంత్రం మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరుగుతుందన్నారు. కుంభమేళ తరహాలో మేడారం జాతరకు ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో చారిత్రక సభ

### సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు

**ప్రజాపక్షం/చింతకాని:** వందేళ్ల సుధీర్ఘ పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేసేందుకు రేపు ఖమ్మంలో చారిత్రక సభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పేర్కొన్నారు. శుక్రవారం చింతకానిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న సాయంత్రం 3 గంటలకు డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాదిమందితో బహిరంగ నిర్వహిస్తున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరానున్నారు. నలభై దేశాల నుండి ప్రతినిధులతో పాటు జాతీయ కార్యదర్శి రాజా, సిపిఐ జాతీయ నాయకత్వంతో పాటు అన్ని రాష్ట్రాల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, లక్షలాది మంది కార్యకర్తలు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో వాసు, కరీముల్లా, సాయి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో విస్తృతంగా ప్రచారం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావి శివరామకృష్ణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** రేపు ఖమ్మం పట్టణంలో జరగనున్న సిపిఐ వందేళ్ల శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో మండల నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోనే పలు ప్రాంతాల నుండి అనేక వాహనాల ద్వారా కార్యకర్తలను ఈ భారీ బహిరంగ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో పాటు కార్యకర్తలను సభకు తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు పుచ్చకాయల శ్రీనివాసరావు, వద్దే వెంకటయ్య, పుచ్చకాయల వెంకటకృష్ణ, వద్దే వెంకటయ్య, పుచ్చకాయల వెంకటకృష్ణ, బొమ్మల కృష్ణమూర్తి, మేదరమట్ల ప్రేమ్చంద్, సిపిఎం నాయకులు ఎస్కె సైదులు, హలవత్ చిన్నా, బొచ్చు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు ఐక్యం కావాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్ తెలిపారు. స్థానిక కర్నాటి కృష్ణయ్య భవన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న కమ్యూనిస్టులు అంతా ఒకే తాటిపై రావాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వందేళ్లను పూర్తి చేసుకున్న సిపిఐ ఖమ్మంలో 18న బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నాయకుల వేషదారణ. డప్పు వాయిద్యాలతో 3 కిలోమీటర్ల వరకు ప్రదర్శన చేయనున్నటు తెలిపారు. 3 వేల మందితో పెద ఎతునర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. వామపక్షాలు ఏకతాటి పై రానున్నట్లు తెలిపారు. మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, అనంతు పుల్లయ్య, కాశిబోయిన అయోధ్య, ఎలగాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల ఉత్సవానికి కదలిరండి

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని పిలుపు



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఈనెల 18న జరిగే సిపిఐ వందేళ్ల వేడుకకు ఉపాధి కూలీలంతా తరలి రావాలని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సభా సాక్షిగా ఎండగట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి మేళ్లచెరువు వీరబాబు, జిల్లా నాయకులు బట్టు బాబు, కోటయ్య, శ్రీను పాల్గొన్నారు.

## త్యాగాల చరిత్ర సిపిఐది

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/పాల్వంచ :** భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వందేండ్లని, నూరేండ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా 18న ఖమ్మం పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభకు ఊరూ, వాడ, పల్లె, పట్టణం దండుగా తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజాపక్షంతో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న, కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించి శత వసంతాలు పూర్తి చేసుకొందన్నారు. స్వాతంత్ర్య సమరంలో పోరాడిన సిపిఐ సంపూర్ణ స్వాతంత్రానికై ముందుగా పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ అన్నారు. కాన్పూర్‌లో ఆవిర్భవించిన తరువాత బ్రిటీషు పాలకుల నుండి దేశాన్ని విముక్తి చేసేందుకు రాజీలేని పోరు చేసిందన్నారు. కాన్పూర్, మీరట్, పెషావర్ తదితర కుట్ర కేసులు బనాయించి ఎందరో నాయకులను నిర్భంధించి జైలులో పెట్టానారన్నారు. నిషేధాలు, నిర్భంధాలను లెక్కచేయకుండా స్వతంత్ర పోరాటంలో ముందుండి పోరు సల్పిన పార్టీ సిపిఐ అన్నారు. ఎంఎల్ఏ కూనంనేని సహకారంతో నియోజకవర్గాన్ని, కొత్తగూడెం కార్పోరేషన్‌ను మరింత అభివృద్ధి చేసుకొందామన్నారు. ఇప్పటికే వందల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. దేశంలో ఏపార్టీకి లేని నూరేండ్ల చరిత్ర కలిగిన సిపిఐలో సభ్యత్వం కలిగి ఉండటం గర్వకారణమన్నారు. విశ్వనాథం వెంట జిల్లా కార్యవర్గ సబ్యులు, జిల్లా నాయకులు, మండల, పట్టణ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## నిబంధనల ప్రకారం సిఎం పర్యటనకు ఏర్పాట్లు



### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి జిల్లా ఇంచార్జి కలెక్టర్ పి.శ్రీజ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనపై అధికారిక సమాచారం, మినిట్ టూ మినిట్ షెడ్యూల్ వచ్చేలోపు అవసరమైన సన్నద్ధత ఏర్పాటు చేయాలన్నారు. సిఎం పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు జరగాలన్నారు. వాహనాలను ముందస్తుగానే చెక్ చేయాలని, ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో పూర్తి బందోబస్తు ఉండాలన్నారు. రూరల్‌లోని నర్సింగ్ కళాశాల, సర్దార్ పటేల్ మైదానం హెలీప్యాడ్‌ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు విధులు నిర్వహించే అధికారులు ప్రత్యేకమైన ఐడి కార్డులు అందించాలని మీడియాతో సమన్వయం చేసుకుంటూ మంచి కవరేజ్ వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి బ్రీఫ్ నోట్స్ శాఖల వారీగా అధికారులు తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

## రాఘవాపురంలో విస్తృత ప్రచారం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపర్తి



**ప్రజాపక్షం/చింతకాని:** రేపు ఖమ్మంలో జరిగే సిపిఐ శతవసంతాల ముగింపు సభ చరిత్రలో నిలిచిపోతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని మండలం రాఘవాపురం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాఘవాపురం గ్రామంలో మహిళలు ఇంటింటికి తిరిగి బొట్టు పెట్టి సభకు రావాలని ఆహ్వానం పలికారు. శాఖ ఆధ్వర్యంలో చింతకాని వెంకటాయపాలెం రోడ్డులో బారీ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. రాఘవాపురం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బెలూన్ ఆవిష్కరణ సభలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ కమ్యునిజం అజేయమని.. మరో వందేళ్లు ప్రజల హృదయంలో కమ్యునిజం నిలిచి ఉంటుందన్నారు. సిపిఐ ఆవిర్భావం నుంచి అనేక నిర్బందాలను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలిచిందన్నారు. 18న సాయంత్రం నాలుగు గంటలకు డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాదిమందితో బహిరంగ నిర్వహిస్తున్నామని ఈ సభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి రానున్నారు. ఈ సభను జయప్రదం చేసేందుకు గ్రామం నుంచి అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి సీతయ్య, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, సింగారపు సత్యనారాయణ దొబ్బల వెంగళరావు, శ్రీరామ్ వెంకన్న, కంప అమరయ్య, కొల్లి వెంకటేశ్వర్లు, దొబ్బల జగదీష్,నున్న మురళి, నల్గొండ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం నగరాన్ని ఎర్ర సంద్రంగా మారుద్దాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం/జూలూరుపాడు :** వందేళ్ల స్ఫూర్తితో ప్రజా పోరాటలకు మరింత పదును పెడదామని, ఖమ్మం నగరంలో సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభను వేదికగా చేసుకునేందుకు సంసిద్ధులు కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. రేపు ఖమ్మం నగరంలో జరిగే శతాబ్ది ముగింపు సభను జయప్రథం చేయాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని వన్నందాస్ గడ్డ, పాత కొత్తగూడెం, బర్మాక్యాంపు,ప్యూన్ బస్తీ, బూడిదగడ్డ, మేదర్ బస్తీ, ప్రగతి నగర్, లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని సీతారాంపురం గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం, కార్పోరేట్ శక్తుల ఆగడాలను అడ్డుకో గల శక్తి కేవలం ఎర్రజెండాకే ఉం దన్న విషయాన్ని ఈ వందేళ్ల చరిత్ర నిరూపించిందన్నారు. ఖమ్మంలో ప్రదర్శించబోయే వేలాది మంది క్రమశిక్షణాయుత రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు విప్లవగీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు పీడిత వర్గాల్లో నూతన ఉత్తేజాన్ని నింపుదాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా ప్రచార జాతాల ద్వార పెద్ద ఎత్తున ప్రచారం పూర్తి చేశామని, కరపత్రాలు, పోస్టర్లు, మీడియా మాధ్యమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు, ప్రతి గడపకు బహిరంగ సభ సమాచారాన్ని చేరవేశామన్నారు. లక్షలాది మంది జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, చంద్రగిరి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, ము నిగడప పద్మ, నాయకులు నునావత్ గోవింద్, గోపి, కృష్ణ, గుత్తుల శ్రీనివాస్, తూముల శ్రీను, సపావట్ రవి, మోతీరాం, రాములు పాల్గొన్నారు.

## శతాబ్ది స్ఫూర్తితో యువత ఉద్యమించాలి



సిపిఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఆటల పోటీలు

### విజేతలకు జమ్ముల బహుమతుల ప్రదానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో సిపిఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పగడాల బసవయ్య, పగడాల భరత్ జ్ఞాపకార్థం, సిపిఐ శత వసంతాల సందర్భంగా క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల చరిత్రలో అనేక పోరాటాలు చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి హక్కులను సాధించి పెట్టిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఈనెల 18న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. క్రికెట్ పోటీల్లో రెడ్ స్టార్ యూత్ మొదటి బహుమతి రూ. 20వేలు, వైఠి 11 రెండవ బహుమతి రూ. 10వేలు సాధించింది. వాలీబాల్ పోటీల్లో ముత్తగూడెం టీమ్ మొదటి బహుమతి రూ. 5వేలు, కొత్తగూడెం టీమ్ రెండవ బహుమతి రూ. 4వేలు, ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి సీతల కళ్యాణి డ్రెసింగ్ టేడెసింగ్, రెండవ బహుమతి మాకనబోయిన ఉమారాణి, మూడవ బహుమతి మాకనబోయిన దుర్గ సాధించారు. పలువురికి కాన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, పొట్ట ప్రసాద్, జంగాల రాజు, భూమా రామ్మూర్తి, తుపాకుల శ్రీకాంత్, లింగం సూరి, భూమా ఉపేందర్, పగడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిన పెద్ద ప్రమాదం..

### అదుపుతప్పి గోడను ఢీ కొట్టిన సిఎన్‌జి గ్యాస్ వ్యాన్

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని పడమటి నరసాపురం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో సీఎన్జీ గ్యాస్ వ్యాన్ ముందు టైర్ పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కనే వున్న బాదావత్ కీమా నివాస గృహ ప్రహరీ గోడను ఢీ కొట్టి పక్కనే వున్న చెట్టును ఢీకొట్టి ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడం, ఇంటిముందు ఎవరు లేకపోవడం, వాహనాలుగాని, పాదచారులుగాని రాకపోకలు జరపక పోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రధాన రహదారిపై ఖమ్మం వైపు నుంచి సీఎన్జీ గ్యాస్ లోడుతో కొత్తగూడెం వైపు వెళ్తున్న వ్యాన్ శుక్రవారం ఉదయం తెల్లవారు జామున దట్టమైన పొగ మంచులో వస్తున్న వ్యాన్ నరసాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి వ్యాన్ ముందు చక్రం టైరు పగిలి పక్కన వున్న ఇంట్లోకి దూసుకెళ్లే సమయంలో ప్రహరీ గోడను ఢీకొట్టింది. దీంతో అప్రమత్తమై వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేసేందుకు బ్రేకు వేయడంతో పక్కనే వున్న చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. అదే సమయంలో బస్సులు కానీ వేరే వాహనాలు కానీ వచ్చి ఉంటే పెను ప్రమాదం జరిగేది. అదే విధంగా తెల్లవారు జాము కావడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలు లేకపోవడం కూడా ప్రాణాపాయం తప్పడానికి కారణమైందని గ్రామస్తులు తెలిపారు.

## వందేళ్ల సభ నేటి తరానికి ఆదర్శం

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించే సిపిఐ వందేళ్ల వేడుక నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో సభ విజయవంతానికై రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైజాం పాలన అంతం, భూమి భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించిన ఫలితాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఎంతో విశిష్టతను కలిగిఉన్న సభకు రైతులు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో వస్తున్న అనేక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు రైతులు చైతన్యంతో పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మిడికంటి చిన్న వెంకటరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, జల్లా రైతు సంఘం కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి పగిళ్ల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ సభకు తరలిరండి: మహ్మద్ సలాం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు బహిరంగ సభకు మైనార్టీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఇన్సాఫ్ కమిటీ ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం తెలిపారు. శుక్రవారం మసీదు వద్ద ముస్లింలను కలిసి సభకు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ మైనార్టీలకు అనుకూలంగా ఉంటూ వారి హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతరం పోరాడుతుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో జరిగే పలు పోరాటాల్లో సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. సిపిఐ పార్టీ శత వసంతాల ముగింపు సభలో మైనార్టీలు కూడా భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈనెల 18న ఖమ్మంలోని సర్దార్ పటేల్ మైదానంలో సభకు మైనార్టీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఎస్కె సైదా, నాయకులు ఎస్కె యాకూబ్, ఎండి రెహ్మాన్, ఎండి అజీజ్, డాక్టర్ ఖాసీం పాషా, మహ్మద్ మజీద్, ఎస్కె కరీం తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్‌పై పాండిచ్చేరి నుంచి ఖమ్మం సభకు.. స్వాగతం పలికిన బాగం, జమ్ముల



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు పాండిచ్చేరి రాష్ట్రం నుంచి సైకిల్‌పై బయలుదేరి ఖమ్మం చేరుకున్నారు. వారికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సిపిఐ కార్యాలయం వద్ద శుక్రవారం స్వాగతం పలికారు. పాండిచ్చేరి రాష్ట్రంలోని ఇల్గరేట్ నియోజక వర్గం నుంచి జనవరి ఎనిమిదిన బయలుదేరిన పుదుచ్చేరి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు దైవ సగయం, పాండిచ్చేరి జిల్లా సమితి సభ్యులు పి. శరవణన్ వీరిరువురు సైకిల్‌పై ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు వచ్చారు. పాండిచ్చేరి నుంచి బయలుదేరి కాంచీపురం, నగరి, ఒంగోలు, నాయుడుపేట, చిలకలూరిపేట, గుంటూరు, విజయవాడ, నందిగామ, మధిర, వైరా మీదుగా సైకిల్‌పై ఖమ్మం చేరుకున్నారు. వీరికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, తోట రామాంజనేయులు, శాఖమూరి శ్రీనివాసరావు, దూసరి గోపాలరావు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి



**ప్రజాపక్షం/మణుగూరు:** ఖమ్మంలో ఆదివారం నాడు జరుగు సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మణుగూరు నుండి ప్రజలు తరలి రావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలు 18న ఖమ్మం నగరంలో ముగింపు వేడుకలు పెద్ద ఎత్తున జరగనున్నాయని, ఈ బహిరంగ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరుకానున్నారని బహిరంగ సభను హాజరై విజయవంతం చేయగలరని కోరుచున్నామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీ కుమారి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సింగరేణి కాలేజ్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీ నారాయణ, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మాజీ ఎంపిపి ఎడారి రమేష్ సీనియర్ నాయకులు ఎస్కె సర్వర్, మంగి వీరయ్య, ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, చింతల దశరథం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఎం.రామ నర్సయ్య, నాగరాజు, పుల్లారావు, మేకల ఈశ్వర్, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు కె సుజాత, బోలగాని సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## 18న చలో ఖమ్మం జయప్రదానికి సిపిఐ ప్రచార జాత- బైక్ ర్యాలీ

వేలాదిగా కదలిరండి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిపిఐ 100 ఏళ్ల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో జరిగే శతాబ్ది ఉత్సవాల సభకు మానుకోట జిల్లా కేంద్రం నుంచి వేలాదిగా కదలి రావాలని సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం కాలనీలు శాఖలు, వార్డులో విస్తృతంగా ప్రచార జాత మరియు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర దేశంలో ఏ పార్టీకి లేదని, ఖమ్మం పట్టణ కేంద్రంలో జనవరి 18న 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని ఈ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటుగా 40 దేశాల నుండి ప్రతినిధులు మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు మానుకోట ప్రాంతం నుంచి 5,000 మంది కదలి వెళుతున్నట్లు అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నర్రా శ్రావణ్, కేదాసు రమేష్, ఎండి మహమూద్, చీదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, ఎండి రఫీ, గారా రవిచంద్రబోస్, మంద శ్రీను, కొమ్ము యాకయ్య, రమేష్, యాకయ్య, చారి,ఎర్రోజు పద్మ యాకమ్మ, శ్రీకాంత్, నటరాజ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాహిత కార్యక్రమాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అయూబ్ నూతనంగా పార్టీలో చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పేదలు, రైతులు, మహిళలు, యువత అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మినీ మేడారం జాతరలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులతో మినీ మేడారం జాతరల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంగణంలో పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. జాతరలు జరిగే మార్గాల్లో రోడ్లకు ఇరువైపుల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, మూల మలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర జరిగే ప్రదేశాలను పరిశీలించి చేయాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతరలు నిర్వహించే మండలాల్లో మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, భూపాలపల్లి మండలంలో కమలాపూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగుతున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మినీ మేడారం జాతరలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ కేటాయించాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని జాల్ బాయ్ తండా గ్రామ ప్రజలకు రేషన్ తీసుకోవాలన్నా వేరే గ్రామ పంచాయతీకి వెళ్లి తీసుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మా గ్రామంలో రేషన్ బియ్యం వచ్చేలా చూడాలని గ్రామ సర్పంచ్ అన్నారు. మండల కేంద్రంలో తహశిల్దార్ మహిపాల్‌రెడ్డికి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహశిల్దార్ తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ తహశిల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జనసంద్రంగా మేడారం జాతర



**సంక్రాంతి అనంతరం భారీగా తరలివచ్చిన భక్తులు**
**జంపన్నవాగులో పుణ్యస్నానాలు,**
**అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు**
**పోలీసుల పకడ్బందీ ప్రణాళికతో ప్రశాంతంగా దర్శనం**

**ప్రజాపక్షం/ములుగు/తాడ్వాయి:** సంక్రాంతి పండగ ముగియడంతో మేడారం మహాజాతరలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మేడారం జాతర భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకొని ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించేందుకు బంగారు బుట్టలను తలపై పెట్టుకొని గద్దెల వద్దకు చేరుకున్నారు. తమ కోరికలను తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలకు భక్తులు వడి బియ్యం, బంగారం, చీర, సారె, పసుపు కుంకుమతో పాటు బంగారాన్ని నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవార్ల దయతో తమ కుటుంబాలు సుఖ శాంతులతో, పిల్లా పాపలు, పాడిపంటలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. మొక్కులు చెల్లించిన అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా కంక వనా మధ్య ఉన్న పచ్చని ప్రకృతిలో వంటా వార్పు చేరుకొని, పిల్లలతో కలిసి సంతోషంగా సమయం గడిపారు. జాతర ఆనందాన్ని మనసారా అనుభవించిన భక్తులు, అమ్మవార్ల కృపతో తిరిగి తమ ఇళ్లకు ప్రయాణమవుతూ మేడారం మహాజాతరను మరపురాని అనుభూతిగా మలుచుకున్నారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా అంచనాలకు మించి భారీ సంఖ్యలో భక్తులు మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ములుగు ఎస్పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపిఎస్ ముందస్తు ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. భక్తుల రద్దీ నియంత్రణ కోసం యాక్సెస్ కంట్రోల్, క్యూలైన్ నిర్వహణ వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకున్నారు. మేడారానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నిర్వహణ కోసం 300 మందికి పైగా పోలీస్ సిబ్బందిని మోహరించారు. సరైన డైవర్షన్ ప్లాన్ అమలు చేయడంతో ఎక్కడా వాహనాల రద్దీ లేకుండా సజావుగా ట్రాఫిక్ కొనసాగింది. ఈ బందోబస్తులో మొత్తం 600 మందికి పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో ఓఎస్‌డి ములుగు శివం ఉపాధ్యాయ, ఏఎస్పి ఏటూరు నాగారం మనన్ బట్, అదనపు ఎస్పి ఏఆర్ సదానందం, డిఎస్పి ములుగు రవీందర్, ములు గు, భూపాలపల్లి, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మ ం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఏసిపి, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ నష్టాలపై క్షేత్రస్థాయి పరిశీలన




**ప్రజాపక్షం/నెక్కొండ:** గత కొన్ని నెలల క్రితం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో కురిసిన అతి భారీ వర్షాలు, ముంథాన్ తుఫాన్ ప్రభావంతో చంద్రుగొండ, పనికర గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. వట్టే వాగు ఉధృతి కారణంగా రైతుల పంట పొలాలు పూర్తిగా ధ్వంసం కాగా, చంద్రుగొండకు వెళ్లే ప్రధాన రహదారి కూడా భారీగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం సెంట్రల్ టీంతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు కలిపి మొత్తం 60 మంది వివిధ శాఖలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట పొలాలు, రహదారి తదితర నష్టాలను పరిశీలించారు. బాధిత రైతుల వివరాలు నమోదు చేసుకొని నివేదికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిఈఓ రామ్ రెడ్డి, శ్రీనివాసరావు, బాలకృష్ణ, దామోదర్ రెడ్డి, రాజకుమార్, లావణ్య, నాగరాజు, మమత, పలు శాఖల అధికారులు, కవిత అశోక్, లక్ష్మ ణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందజేయాలని, రహదారి మరమ్మత్తులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రజాపక్షం కోరుతుంది.

## మేడారంలో డిజిఒఎస్, గోడపత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ములుగు:** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా గోడపత్రిక, టేడపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణను ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర ఐఏఎస్‌చే శ్రీ సమ్మక్క సారలమ్మ సన్నిధిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టిజిఓ అసోసియేషన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేడారం జాతరకు ప్రతి అధికారి బాధ్యతగా నిర్వహిస్తు భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా వారికి కేటాయించిన విధులను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిజిఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం సంపత్‌రావు(అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్), సెక్రటరీ కందుల జీవన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రాజు, జాయింట్ సెక్రటరీ రాజేశ్వరరావు, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, కొమురయ్య, యశ్వంత్, ప్రశాష్‌రెడ్డి, కరిష్మా, రఫిక్, పాల్గొన్నారు.

## ఎంపి డాక్టర్ కడియం కావ్య కృషి 'సక్సెస్'

**వరంగల్‌లో ఆకాశవాణి క్వార్టర్స్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు**
**అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రి**



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఏడాదిన్నర కాల నిరంతర కృషికి కీలక విజయం లభించింది. మొదట వరంగల్ జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు నాలుగు అనువైన ప్రభుత్వ కార్యాలయాలను అధికారులతో కలిసి ఎంపీ స్వయంగా పరిశీలించారు. వాటిలో వరంగల్‌లోని ఆకాశవాణి పరిధిలోని సిబ్బంది క్వార్టర్స్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా అమలుకు నోచుకోని వరంగల్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం పార్లమెంట్ సమావేశాల్లోనూ, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారులతోనూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన నిరంతర సంప్రదింపులు, కృషి ఫలితంగా వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 22 కేంద్రాలకు వెల్‌నెస్ సెంటర్లకు మంజూరు లభించగా, వరంగల్ జిల్లాకు మాత్రమే పూర్తి అనుమతులు లభించాయని ఎంపీ స్పష్టం చేశారు. వెల్‌నెస్ సెంటర్‌ను తన ఎంపీ నిధుల ద్వారా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేసారు. వరంగల్ పరిధిలో ఉన్న 54 ప్రధాన పట్టణాల్లో నివసిస్తున్న 15 వేల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఆరోగ్య సేవల సదుపాయాలు అందించడంలో ఈ వెల్‌నెస్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఇప్పటి వరకు వెల్‌నెస్ సెంటర్ సేవల కోసం హైదరాబాద్ లేదా ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై వరంగల్‌లోనే వైద్య సేవలు అందుబాటులోకి రావడం పట్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటన


**జిల్లాలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇండ్లను పరిశీలించిన బృందం ప్రతినిధులు**

**ప్రజాపక్షం/హనుమకొండ:** అక్టోబర్ నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం హనుమకొండ జిల్లాలో శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టం పై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొన్నుస్వా మి నేతృత్వంలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. గ్రా మం లో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. రైతులు స్థానికులతో మా ట్లాడి ఏయే పంటలకు ఎంత నష్టం వాటిల్లింది, ఎంత మేరకు రోడ్లు దెబ్బతిన్నాయనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను, స్థానికులను అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షా ల కారణంగా గ్రేటర్ వరంగల్ ము న్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృం దం పరిశీలించారు. తుఫాను వల్ల వాటిల్లిన పంట నష్టం, ఆస్తి, ఇండ్లు, పశు సంపద కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, బాధితులు కేంద్ర బృంద ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా కేంద్ర అధికారుల బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి అధికారులు గోపికృష్ణ, ఉదయ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## నీదా? నాదా? సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్ష పదవి!

**ఏకగ్రీవ సర్పంచ్‌లను సమన్వయపరుచుకోవడంలో బిఆర్ఎస్ పార్టీ విఫలం**
**ఉత్కంఠగా మారిన సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షపదవి**
**ప్రత్యేక చొరవతో అధ్యక్ష పదవిని ఎంఎల్ఎ కడియం శ్రీహరి చక్కదిద్దేనా...!**



**ప్రజాపక్షం/వేలేరు:** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో సర్పంచ్ ఫోరం మండలఅధ్యక్ష పదవి నీకానాకా అనేఉత్కంఠ కొనసాగుతోంది ఇటీవలే గ్రామపంచాయితీ ఎన్నికలు మండలంలోని 12 గ్రామాలలో జరుగగా ఒకరు ఇండిపెండెంట్, ఆరుగురు బిఆర్ఎస్ పార్టీ, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ, ఇద్దరు ఏకగ్రీవంగా గెలుపొందగా బుధవారం వేలేరు మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురావత్ లక్ష్మ ణ్ నాయక్ నివాసంలో ఉదయం వేలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సంపత్ అధ్యక్షతన బిల్ల యాదగిరితో పాటు ముగ్గురు కాంగ్రెస్‌కి చెందిన సర్పంచ్‌లు, ఇద్దరు ఏకగ్రీవమైన సర్పంచ్‌లతో పాటు ఒకరు బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ సహకారంతో మొత్తం ఏడుగురు సర్పంచ్‌లతో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగా వేలేరు మండలకేంద్రానికి చెందిన బిల్ల యాదగిరిని ప్రకటించడం జరిగింది. అదే రోజు సాయంత్రం వేలేరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కీర్తి వెంకటేశ్వర్లు, మరిజె నర్సింగారావు తదితరుల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన చెందిన బత్తుల శ్రీనివాస్‌తో మంతనాలు జరిపి ఆరుగురు సభ్యులతో బిఆర్ఎస్‌కి ఆరుగురు సభ్యులు ఉన్నారు. కనుక మా అభ్యర్థి జోడు ముంతల కిరణ్ ను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షునిగి కొనసాగిస్తున్నామని బిఆర్ఎస్ నాయకులు పీచర సమ్మక్క సారక్క ఆలయ సమీపంలో ప్రకటించారు. ఇదిలా ఉండగా మండలంలో అత్యధిక మెజార్టీ స్థానాలు గెలుచుకున్న బిఆర్ఎస్ పార్టీ అధినాకులు స్టేషన్ ఘన్‌పూర్ మాజీఎంఎల్ఏ డా,టి రాజయ్య, వేలేరు మండల ముద్దుబిడ్డ జనగామ ఎంఎల్ఏ పల్ల రాజేశ్వర్‌రెడ్డి, మండలనాయకులు మండలంలో ఏకగ్రీవమైన ఇద్దరు సర్పంచ్‌లను ఏఒక్కరినైనా సమన్వయ పరుచుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని మండలంలో బాహాటంగానే చర్చమొదలైంది. బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ బత్తుల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి ఎలా మద్దతు తెలుపుతారనే చర్చ కొనసాగుతున్నప్పటికీ వేలేరు సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షపదవి ఉత్కంఠ మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిలో కొనసాగుతోంది ఈఉత్కంటకు స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో సర్పంచల ఫోరం మండల అధ్యక్ష పదవిని చక్కదిద్ది ఉత్కంటకు తెరపడేనా వేలేరు మండల ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు.

## స్పందించిన అధికారులు... సెంటర్ లైట్లు అమర్చారు




**ప్రజాపక్షం/గోవిందరావు-పేట:** పసర గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి సెంట్రల్ లైటింగ్ కొన్ని రోజులుగా రాకపోవడం వల్ల ప్రయాణికులు గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు గ్రామస్తులు అధికారులకు చెప్పినప్పటికి పట్టించుకోకపోవడం వల్ల కొన్ని రోజులుగా వీధిలైట్లు రాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురుయ్యారు దీనిపై ప్రజలు అనుకుంటుండగా ప్రజాపక్షం రిపోర్టర్ స్పందించి పేపర్లో ప్రచురణ చేయడం వల్ల అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాట్లు చేశారు దీనిపై గ్రామస్తులు ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

## అభ్యర్థుల ఆశలన్నీ రిజర్వేషన్ల పైనే




**ఉత్కంఠంగా చైర్మన్ రిజర్వేషన్..!**
**నేడు ప్రకటించనున్న మున్సిపల్ రిజర్వేషన్లు**
**ప్రజల్లో మొదలైన చర్చ**

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నేడు భూపాలపల్లి మున్సిపాలిటీ రిజర్వేషన్లు ఐ డి ఓ సి కార్యాల యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఇటీవలే గత కొద్ది రోజుల క్రితం భూపాలపల్లి మున్సిపాలిటీ అధికారులు ఎన్నికల తుదిఓటర్ల జాబితాను విడుదల చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులలో 52,726 మంది ఓటర్లతో జాబితాను ప్రకటించారు.అందులో పురుషులు 26,786 మంది, మహిళలు 25,936 మంది. ఇతరులు నలుగురు ఉన్నారు.

**రిజర్వేషన్ల పైన్నే అభ్యర్థి ఆశలు**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగే ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈసారి మా వార్డు రిజర్వేషన్ మళ్ళీ మాకు అనుకూ లంగా వస్తుందలేదా అని ఉత్కంఠగా ఎదిరి చూస్తున్నారు. ఈ సారి రిజర్వేషన్ వస్తేనే పోటీచేస్తానని, కొంతమంది ఏ వార్డులో వచ్చిన బరిలో పోటీలో ఉండి ఎట్లాగైన గెలవాల్సిందే అని కొంతమంది, అట్లాగే చైర్మన్ మనకు అనుకూలంగా వస్తే పోటీచేస్తా చైర్మన్ రిజర్వేషన్ కూడా పోటీ చేయడానికి నాయకులను ప్రభావితం చేయనుంది. భూపాలపల్లి మున్సిపల్ లో 30 వార్డులు ఉండగా ఎస్సీ 6, బీసీ07, ఎస్టీ 02, అన్ రిజర్వ్ 15 మొత్తం 30 వార్డులకు గాను రిజర్వేషన్లను అధికారులు ప్రకటించనున్నారు. **చైర్మన్ రిజర్వేషన్ పై ఉత్కంఠ! :** భూపాలపల్లి మున్సిపాలిటీలో 30 వార్డులలో గతంలో ఉన్న రిజర్వేషన్లు మారుతాయని ప్రచారం జోరందు కుంది. దీంతో ఆశావాహులు అయోమయానికి గురవుతున్నారు. సారి ఎన్నికల్లో చైర్మన్ పదవీని కైవసం చేసుకోవడానికి అధికార పార్టీతో పాటు బీఆర్ఎస్, సన్నద్ధమవుతున్నాయి. గతంలో రెండుసార్లు ఎస్సీ మహిళకు రిజర్వుడు కాగా ఇప్పుడు జనరల్, బీసీలకు కేటాయిస్తారా అని ఉత్కంఠతో ఆశావహులు ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి అధికార పార్టీ ఇప్పటికే అభివృద్ధి మంత్రం తో వార్డులలో శంకుస్థాపనలతో సిద్ధమవు తుండగా, బిఆర్ ఎస్ పట్టణంలో ఎలాగైన తమ పార్టీ జెండాను ఎగురవేసి పట్టు నిలుపుకోవాలని బస్తి బాట పేరుతో వార్డుల పర్యటన చేస్తున్నారు. ఈ తరుణంలో మున్సిపాలిటీలో రిజర్వేషన్ పై ఉత్కంఠ నెలకొంది.

**ఫిబ్రవరిలో ఎన్నికలు:** ఇప్పటికే మున్సి పాలిటీల్లో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం కూడా పూర్తయింది. ఫిబ్రవరిలో ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నది. జనవరి 20వ తేదీ లోగా నోటిఫికేషన్ రానున్నట్లు తెలుస్తోంది. అంతా అనుకున్న ట్లుగా జరిగితే ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలు పూర్తి చేసి కొత్త పాలకవర్గాలు కొలువుదీరే అవకాశముంది.

'కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్‌లో 'సీతారామం'తో భారీ గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి సోషల్ మీడియా, సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇటీవల వీరిద్దరూ ఒకరికొకరు దగ్గరయ్యారని, రిలేషన్‌షిప్‌లో ఉన్నారనే వార్తలు తమిళ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి.'

లీక్

# సంక్రాంతి కానుకగా 'ఎల్లమ్మ' ఫస్ట్ గ్లింప్స్..



'బలగం' లాంటి ఎమోషనల్ డ్రామాను తెరకేకించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు వేణు ఇప్పుడు తన రెండో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. అద్భుతమైన కథలని ఎన్నుకునే విజనరీ స్టార్ ప్రొడ్యూసర్ గా ఎదిగిన దిల్ రాజు, బలగం ఫేమ్ డైరెక్టర్ వేణు యెల్దండి కాంబినేషన్‌లో వస్తున్న మరో ప్రతిష్ఠాత్మకమైన చిత్రం 'ఎల్లమ్మ'. తొలి చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన వేణు పవర్ ఫుల్, ఆధ్యాత్మికతతో నిండిన కథని సిద్ధం చేశారు. ప్రతిష్ఠాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు సంగీత ప్రపంచాన్ని ఏలుతున్న రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ కెమెరా ముందు అడుగుపెడుతున్నాడు. ఎల్లమ్మ చిత్రంతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. హీరోగా చెయ్యాలనే దేవిశ్రీ ప్రసాద్ కోరిక ఈ సినిమాతో తీరుతోంది. ఎల్లమ్మ సినిమాలో హీరోగా నటిస్తూనే సంగీతాన్ని కూడా అందిస్తున్నాడు. ఎల్లమ్మ సినిమా దైవిక శక్తి నేపథ్యంగా, స్థానిక సంప్రదాయాలు, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాన్ని బలంగా ప్రతిబింబించేలా రూపొందుతోంది. మకర సంక్రాంతి శుభ సందర్భంగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ అందరిని ఆకట్టుకుంటోంది. గ్లింప్స్ ఒక స్టన్నింగ్ విజువల్‌తో మొదలవుతుంది. సుడిగుండలా తిరుగుతున్న గాలిలో ఓ ఒంటరి వేపాకు పైకి దూసుకెళ్తుంది. దాన్ని గమనిస్తూ ఓ మేక నిలుస్తుంది. క్షణాల్లో వాతావరణం ఉత్కంఠ భరితంగా మారుతుంది. వేప, పసుపు, కుంకుమ విజువల్స్ డివైన్ ఆరాను జోడిస్తే, దేవిశ్రీ ఇచ్చిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ కాన్సెప్ట్ గ్లింప్స్‌తోనే సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'ఎల్లమ్మ' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# 'అనగనగా ఒక రాజు' థాంక్యూ మీట్



నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా సంక్రాంతికి విడుదల అయిన 'అనగనగా ఒక రాజు చిత్రం థ్యాంక్యూ మీట్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. సితార ఎంటర్టైన్మెంట్స్ అనేది బ్లాక్ బస్టర్ ప్రొడక్షన్ హౌస్. అలాంటి సంస్థ నుంచి ఇటీవల ఒకట్రెండు సినిమాలు ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయాయి. ఇలాంటి తరుణంలో 'అనగనగా ఒక రాజు' రూపంలో ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్‌ను అందించడం.. మా అందరికీ సంతోషాన్ని కలిగించింది. ముఖ్యంగా నాగవంశీ ముఖంలో చిరునవ్వు చూడటం సంతోషాన్ని ఇచ్చింది. కథానాయకుడిగా నాకిది కేవలం నాలుగో సినిమా. నా మొదటి సంక్రాంతి సినిమా. పోటీలో పెద్ద సినిమాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ మా సినిమాని బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అని చెప్పారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఆరేళ్ళ తర్వాత నాకు సంతృప్తిని ఇచ్చిన సంక్రాంతి ఇది. 2020లో వచ్చిన 'అల వైకుంఠపురములో' సినిమా తర్వాత ఆ స్థాయి తృప్తిని ఇచ్చిన సంక్రాంతి ఇది. ఈ సంక్రాంతికి ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మా డిస్ట్రిబ్యూటర్లు అందరూ తగినన్ని థియేటర్లను మాకు కేటాయించి ఎంతో అండగా నిలిచారు. అందుకే రెండు రోజుల్లోనే రూ.41 కోట్ల గ్రాస్ రాబట్టగలిగిందని అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. 'మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. అందరూ మమ్మల్ని ప్రశంసిస్తున్నారని తెలిపారు. దర్శకుడు మారి మాట్లాడుతూ ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ స్పందన.. మా అందరి కష్టాన్ని పూర్తిగా మర్చిపోయేలా చేసింది. నవీన్‌కి వరుసగా నాలుగో విజయం దక్కడం సంతోషంగా ఉంది. ఆయన వల్లే నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీకి కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు రావు రమేష్, రచయిత్రి, క్రియేటర్ డైరెక్టర్ చిన్మయి, ఛాయాగ్రాకుడు యువరాజు, కళా దర్శకుడు గాంధీ, నటుడు చంద్ర పాల్గొన్నారు.




# లోకేశ్ కనగరాజ్ కాంబోలో అల్లు అర్జున్ సినిమా..

హీరో అల్లు అర్జున్. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప 2 తరువాత అల్లు అర్జున్ తమిళ దర్శకుడు అట్లీతో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే మరో తమిళ దర్శకుడితో సినిమా చేయడానికి సిద్ధమైయ్యాడు. అల్లు అర్జున్ హీరోగా బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, బివి వర్క్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ భారీ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. బన్నీవాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. కమల హాసన్‌తో విక్రమ్ సినిమా తీసిన దర్శకుడు లోకేష్ కనకరాజ్ ప్రస్తుతం అల్లు అర్జున్ తో కలిసి ఈ సినిమాలో పని చేస్తున్నారు. ఈ సినిమాకు రాక్‌స్టార్ అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. ఏఏ 23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కబోతోంది.

# 'కటాలన్' సెకండ్ లుక్



క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ 'కట్టాలన్' సెకండ్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఏనుగుల వేట నుండి ప్రేరణ పొందిన ఉత్కంఠభరితమైన మాస్ యాక్షన్‌తో ఈ పోస్టర్ మలయాళ సినిమా చరిత్రలో మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో ఆంటోనీ వర్గీస్‌ను పరిచయం చేస్తుంది. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే, ఆంటోనీ వర్గీస్‌ను ఫస్ట్ లుక్‌లోనూ, తాజాగా విడుదలైన సెకండ్ లుక్‌లోనూ పవర్ ఫుల్ లుక్‌లో చూపించారు. మలయాళ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ రిలీజ్‌గా నిలవనున్న 'కటాలన్', మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. షరీఫ్ మహమ్మద్ నిర్మించిన పాన్‌ఇండియన్ యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుండి వస్తున్న మూవీ ఇది. 'కటాలన్' ఇప్పటికే మలయాళ సినిమా చరిత్రలోనే అతి పెద్ద ఓవర్సీస్ డీల్స్‌లో దక్కించుకుందని, షూటింగ్ పూర్తి కాకముందే అనేక ప్రీరిలీజ్ రికార్డులను బద్దలు కొట్టింది. ఫార్స్ ఫిలమ్స్‌తో కలిసి, 'కటాలన్' ఒక మలయాళ చిత్రానికి ఇప్పటివరకు ఎన్నడూ లేని అతిపెద్ద ఓవర్సీస్ రిలీజ్ కానుంది.

# నభా నటేష్ ఫస్ట్ లుక్



అభిషేక్ నామా నిర్మిస్తున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'నాగబంధం', విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. చిత్ర బృందం హీరోయిన్ నభా నటేష్‌ను పార్వతి పాత్రలో పరిచయం చేస్తూ ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా విడుదల చేసిన ఈ పోస్టర్‌లో, నభానటేష్ అద్భుతమైన, సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తుంది. హుందాతనం, పవిత్రత, ఆధ్యాత్మికత వెదజల్లుతోంది. ఆమె ముఖంలో కనిపించే ఆత్మీయమైన భావం, భక్తి, పురాణాల మూలాల నుంచి పుట్టిన పాత్రను సూచిస్తుంది. పోస్టర్‌కు మరింత వైభవాన్ని జోడిస్తూ ఆమె చేయి సమీపంలో నీలి రంగు పక్షి దర్శనమిస్తుంది. పక్కనే రాజసంగా నిలిచిన నెమలి, వెనుక కనిపించే ఆలయ నేపథ్యం ఈ అన్నీ పాత్రను అద్భుతంగా ఆవిష్కరిస్తున్నాయి. ఐశ్వర్య మీనన్ మరో కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.నాగబంధం భారతదేశంలోని పురాతన విష్ణు దేవాలయాల నేపథ్యంలో సాగుతుంది. ఈ కథాంశం నాగబంధం సంప్రదాయంలోని పవిత్ర రహస్యాలను అన్వేషిస్తుంది, పురాణాలు, సస్పెన్స్, డివోషన్ బ్యాక్ డ్రాప్‌లో ఒక ఉత్కంఠభరితమైన కథనంగా రూపొందుతోంది. ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో భారీగా విడుదల కానుంది.

# 'సీతా పయనం'లో 'బసవన్న' పాట విడుదల



నటుడు, దర్శకుడు యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో రాబోతోన్న కొత్త సినిమా 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీలో నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అర్జున్ కూడా ఓ ప్రత్యేకమైన పాత్రలో నటిస్తున్నారు. అతని మేనల్లుడు ప్రిన్స్ ధ్రువ సర్జా మరో స్పెషల్ కామియో రోల్ పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్స్ ధ్రువ సర్జా పాత్రను పరిచయం చేస్తూ 'బసవన్న' పాటనం విడుదల చేశారు. ఇందులో బసవన్న పాత్రలో ధ్రువ కనిపించబోతోన్నారు. అనూప్ రూబెన్స్ ఇచ్చిన బాణీలు అందిస్తున్నారు. కాసర్ల శ్యాం సాహిత్యం అందించారు. బసవన్న పాటను నకాస్ అజీజ్, ఎల్. కీర్తన ఆలపించారు. ఈ పాటకు లలితా శోభి, శ్రేష్టి వర్మ కొరియోగ్రఫీ అందించారు. ప్రస్తుతం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్ని పూర్తి చేశారు. ఈ సినిమాను ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో ఈ సినిమా రిలీజ్ కానుంది. జి బాలమురుగన్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ అందించారు.

# 'సంబరాల ఏటిగట్టు' పోస్టర్ రిలీజ్



హీరో సాయి దుర్గతేజ్ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా ఎస్‌వైజీ (సంబరాల యేటి గట్టు) నుంచి కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ హనుమాన్ అందించిన బ్యానర్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పోస్టర్ సాయి తేజ్‌ను విలేజ్ లుక్‌లో ప్రజెంట్ చేస్తోంది. బూడిద రంగు చొక్కా, సాంప్రదాయ పంచె కట్టు ధరించి, గ్రామీణ నేపథ్యంలో చెప్పులు లేకుండా నడుస్తూ, తెల్లటి ఎద్దును సున్నితంగా నడిపిస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. గుబురు గడ్డం, తీక్షణమైన చూపు, చిరునవ్వు ఈ మూడు కలిసి ఆయన లుక్ అదిరిపోయింది. ఈ పాత్ర కోసం సాయి దుర్గ తేజ్ కంప్లీట్ గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. చిత్రంలో ఇప్పటివరకూ ఎన్నడూ చూడని అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన అసుర ఆగమన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. యాక్షన్‌తో నిండిన విజువల్స్ ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చాయి.

# సైబర్ నేర బాధితులకు గుడ్ న్యూస్

## ఎస్ఒపి ఆమోదించిన హోంమంత్రిత్వ శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరాలపై స్పందనను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బాధితులకు త్వరితగతిన సహాయం అందించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు జాతీయ సైబర్ నేర నివేదిక పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) లోని సైబర్ ఫైనాన్షియల్ క్రైమ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్మెంట్ సిస్టమ్ కోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి)కు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి డిజిటల్ వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల పౌరులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కొత్త ఎస్ఒపి ప్రకారం.. రూ.50 వేల కంటే తక్కువ మొత్తంతో జరిగిన చిన్నస్థాయి సైబర్ మోసాల విషయంలో కోర్టు ఆదేశం లేకుండానే బాధితులకు రీఫండ అందే అవకాశం ఉంది. కోర్టు లేదా రిస్టోరేషన్ ఆర్డర్ లేని సందర్భాల్లో, ఆ మొత్తాలపై బ్యాంకులు విధించిన 'హోల్డ్'లను 90 రోజుల్లోగా తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనివల్ల జాప్యం తగ్గి బాధితులపై ఆర్థిక భారం తగ్గనుంది. డిజిటల్ చెల్లింపులు, ఆన్లైన్ బ్యాంకింగ్, ఈకామర్స్ వినియోగం పెరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ నిర్ణయం ప్రత్యేకంగా ప్రాధాన్యత కలిగి ఉంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల్లో డిజిటల్ లావాదేవీలు పెరిగిన కొద్దీ సైబర్ మోసాల ఫిర్యాదులు కూడా పెరుగుతున్నాయి. హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐసిసిసిసి) సేకరించిన డేటా ప్రకారం, గత ఆరు సంవత్సరాల్లో భారత్లో మోసం, చీటింగ్ కేసుల వల్ల ప్రజలు రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయారు.

### మూడు స్టేజీల ఎస్కలేషన్ విధానం..

కొత్తగా ఆమోదించబడిన ఎస్ఒపి ద్వారా బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లు, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బిఎఫ్‌సి), ఈకామర్స్ ప్లాట్‌ఫారంలు, స్టాక్ ట్రేడింగ్ యాప్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు సైబర్ నేర ఫిర్యాదు నమోదైనప్పుడు అనుసరించాల్సిన నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రక్రియను ఏర్పాటు చేశాయి. అలాగే, ఫ్రీజ్ అయిన ఖాతాలు లేదా నిధులకు సంబంధించిన కేసుల వేగవంతమైన పరిష్కారం కోసం మూడు స్థాయిల ఎస్కలేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్ఒపిలో విధానపరమైన ఏకరీతికి ఇచ్చిన ప్రాధాన్యత వేగంగా డిజిటల్ వైపు దూసుకెళ్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఇది సురక్షితమైన, నమ్మదగిన డిజిటల్ ఫైనాన్స్ అనే ప్రభుత్వ విస్తృత లక్ష్యానికి మద్దతునిస్తూ వినియోగదారుల ఇబ్బందులను తగ్గిస్తుందని గతేడాది అక్టోబర్ 31 నాటికి, ఈ ప్లాట్ఫారమ్లో నమోదైన 23 లక్షలకుపైగా ఫిర్యాదుల ద్వారా రూ.7,130 కోట్లకు పైగా సొమ్మును కాపాడగలిగారు.

# గగన తలంలో జూపల్లి సాహస యాత్ర

## గోల్కొండలో అట్టహాసంగా ప్రారంభమైన 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్



ప్రజాపక్షం/హైదరాబాద్: చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో సాహస యాత్ర చేసి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బెలూన్ అప్పాజిగూడ శివారులో దిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని మంత్రి అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ స్వీట్ ఫెస్టివల్' ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు. డెస్టినేషన్ తెలంగాణ ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 'డెస్టినేషన్ తెలంగాణ' అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు (Adventure Sports) ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు. ఇదొక అద్భుత అనుభూతి. సంప్రదాయానికి గౌరవం, సాంకేతికతకు స్వాగతం పలుకుతూ పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం. నేడు ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు.. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ స్థాయి ఎత్తులకు చేరుకోబోతోంది అనడానికి నిదర్శనం' అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, యువత, పిల్లలందరికీ ఈ ఫెస్టివల్ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.
పరేడ్ గ్రౌండ్స్‌లో కనువిందుగా 'హాట్ ఎయిర్ బెలూన్' ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు.

# మెట్రో రెండో దశపై సిఎంకు కేంద్రమంత్రి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిని వేగవంతం చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రోరైల్ విస్తరణ పనులు వేగవంతం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై కిషన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మెట్రో మొదటి దశను ఎల్అండ్‌టి సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించిన నేపథ్యంలో, దానికి సంబంధించిన అన్ని ఒప్పందాలు, లావాదేవీలను త్వరగా పూర్తి చేయాలని కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి మెట్రో రెండో దశపై చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. మొదటి దశ లావాదేవీలు పూర్తయిన వెంటనే రెండో దశ పనులపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఖట్టర్ హామీ ఇచ్చినట్లు కిషన్ రెడ్డి తన లేఖలో వేల్లడించారు. మెట్రో పనుల పర్యవేక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, ఇందులో భాగంగా కేంద్రం నుంచి ఇద్దరు, రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులు సభ్యులుగా ఉండాల్సి ఉందని తెలిపారు.

# ఖమ్మం వేదిక

(మొదటి పేజీ తరువాయి)

తదనంతర పరిణామాలు అందరికీ తెలిసిందే. 1964లో ఉమ్మడి జిల్లాలో సిపిఐ నామ మాత్రంగా మిగిలింది. ప్రధాన నాయకత్వం, ప్రజలు సిపిఐ(ఎం)వైపు వెళ్లగా నల్లమల గిరిప్రసాద్, రావెళ్ల జానకిరామయ్య, కర్నాటి కృష్ణయ్య, పువ్వాడ నాగేశ్వర రావు, ఎం. కొమరయ్య, సర్వదేవభట్ల రామనాథం, విఠల్‌రావు లాంటి అతి కొద్ది మంది మాత్రమే సిపిఐలో మిగిలారు. 1970 తర్వాత మహ్మద్ రజబ్‌అలీ నాయకత్వంలో పెద్ద సంఖ్యలో సిపిఐలో చేరడంతో సిపిఐ పురోగమనం ప్రారంభమైంది. 1980 నాటికి జిల్లాలో సిపిఐ ఒక బలీయ రాజకీయ శక్తిగా నిలిచింది. 1980 దశకంలో రాష్ట్ర మహాసభల సందర్భంగా లక్షలాది మందిని సమీకరించి ఖమ్మంలో సభ జరిపి తన సత్తాను చాటింది. 1981లో జరిగిన శాసన మండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల నుండి పోటీ చేసిన పువ్వాడ నాగేశ్వరరావు మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డిని ఓడించి చట్ట సభలో అడుగుపెట్టారు. 1983లో ఎన్‌టిఆర్ ప్రభంజనాన్ని తట్టుకుని కమ్యూనిస్టులు ఆరు స్థానాల్లో విజయం సాధించారు. సిపిఐ నుంచి మహ్మద్ రజబ్‌అలీ (సుజాతనగర్), బి.భూపతిరావు (పాలేరు), ఊకె అబ్బయ్య (బూర్గంపాడు)నుంచి గెలుపొందగా సిపిఐ(ఎం) నుంచి మంచికంటి రామకిషన్‌రావు (ఖమ్మం), ముర్ల ఎర్రయ్య రెడ్డి (భద్రాచలం), సిపిఐ(ఎంఎల్) నుండి గుమ్మడి నర్సయ్య (ఇల్లందు) విజయం సాధించారు. కాంగ్రెస్ , మధిర, సత్తుపల్లి లోనూ టిడిపి కొత్తగూడెంలోనూ విజయం సాధించాయి. తొమ్మిదిలో ఆరు స్థానాలు గెలుపొంది కమ్యూనిస్టులు సత్తా చాటారు. 1994లో సిపిఐ ఖమ్మం, ఇల్లందు, బూర్గంపాడు, సుజాతనగర్ అసెంబ్లీ స్థానాలతో పాటు 1996లో భద్రాచలం పార్లమెంటు స్థానాన్ని సైతం గెలుపొందింది.

### ఎమర్జెన్సీలో బలోపేతమైన సిపిఐ :

1975లో ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీని విధించినప్పుడు కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలు దెబ్బతిన్నాయి. కానీ ఖమ్మం జిల్లాలో సిపిఐ బలోపేతమైంది. 1970 దశకంలో సిపిఐ చేపట్టిన పోరాటాలే ఇందుకు కారణమయ్యాయి. నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్‌అలీ తదితరుల నేతృత్వంలో చారిత్రిక భూ పోరాటాలు నిర్వహించారు. భూ పోరాటం సందర్భంగా భద్రాచలం సమీపంలో తోటపల్లిలో జరిగిన పోలీస్ కాల్పుల్లో వేల్పుల వీరయ్య మరణించాడు. జిల్లా స్తంభించింది. ప్రజలు పోలీసులను తరిమికొట్టి ఆయుధాలను ఎత్తుకెళ్లారు. అదో చారిత్రాత్మక ఘట్టం. గణేశ్వరం, వినోబానగర్, మల్లెలమడుగు, తోటపల్లి మొదలగు వందలాది గ్రామాలు భూ పోరాట కేంద్రాలుగా మారాయి. సిపిఐని ప్రజలు ఆదరించి ఖమ్మం జిల్లాలో ఒక బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టారు.

### గోదావరి జలాలు- బయ్యారం ఐరన్ వోర్ :

గోదావరి జలాలను ఖమ్మం జిల్లా భూములకు మళ్లించాలని దుమ్ముగూడెం వద్ద ఆనకట్ట నిర్మించాలని తొలుత పోరాడింది సిపిఐ మాత్రమే. గోదావరి జలాలను చేతపట్టుకుని సిపిఐ నేతలు తెలంగాణలో యాత్రలు నిర్వహించారు. అంతకు ముందు నంది కొండ పందికొండ అని కొందరు హేళన చేసినప్పుడు నంది కొండ (నాగార్జున సాగర్) సాధన కోసం పోరాడింది కమ్యూనిస్టు పార్టీనే. దుమ్ముగూడెం ప్రాజెక్టు వైఎస్ఆర్ శంకుస్థాపన తర్వాత పెరిగిన జాప్యాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో సిఎం ఇంటిని ముట్టడించిన చరిత్ర ఖమ్మం సిపిఐకి ఉంది. బయ్యారం ప్రాంతంలో నెలకొన్న అపారమైన ఐరన్‌వోర్‌ను తరలించుకుపోతుంటే అడ్డుకున్నది సిపిఐ. తొలుత నిరసనతో ప్రారంభించి 2012లో జిల్లాను దిగ్బంధించింది. ఈ దిగ్బంధనం ప్రజా పోరాటాలకు కొత్త ఊపును ఇచ్చింది. సిపిఐ పోరాట ఫలితంగా ఐరన్ వోర్ లీజును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇది ప్రజా పోరాటం సాధించిన అతి పెద్ద విజయం. సిపిఐ అనుబంధ ఏఐవైఎఫ్ బయ్యారం ఖనిజ సంపద పరిరక్షణ కోసం బయ్యారం నుండి ఖమ్మం కలెక్టరేట్ వరకు పాదయాత్రను నిర్వహించింది. ఎంఎల్‌సిగా పువ్వాడ నాగేశ్వరరావు, ఎంఎల్ఏగా కూనంనేని సాంబశివరావు చట్ట సభల్లోనూ పోరాడారు.

### తెలంగాణ సాధనోద్యమం సిపిఐ :

తెలంగాణ రాష్ట్ర సాధనకు సిపిఐ నిర్ణయం ఒక కొత్త ఊపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలిపిన తొలి జాతీయ పార్టీ సిపిఐ. తెలంగాణ రాష్ట్ర సాధనకు అప్పటి రాష్ట్ర కార్యదర్శి కె. నారాయణ భద్రాచలం నుంచి బస్సు యాత్ర నిర్వహించారు. శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మణుగూరు నుంచి 450 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. ఈ యాత్రలో అప్పటి జెడ్పి వైస్ ఛైర్మన్ బి. అయోధ్య కూడా పాల్గొన్నారు. కూనంనేని అమరణ నిరాహార దీక్ష చేపట్టగా జైలుకు తరలించారు. జైలులో కూడా కూనంనేని దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అన్ని పార్టీల రాష్ట్ర నాయకులు తరలివచ్చారు. తెలంగాణ సాధనోద్యమంలో ఈ ఘటన కీలక భూమిక పోషించింది.

### ప్రజా పోరాటాలు – 2023 ఎన్నికలు :

ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగిన పోరాటాల్లో సిపిఐ ముందు వరుసలో నిలిచింది. కార్మిక రైతాంగ సమస్యలతో పాటు సబ్బండ వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడింది. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం స్థానం నుండి గెలుపొంది తెలంగాణ శాసనసభలో ప్రాతినిథ్యం సంపాదించింది. పదేళ్ల బిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని అసంఘటిత , సంఘటిత రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసింది చేస్తున్నది సిపిఐ. ఇంతటి చారిత్రిక నేపథ్యం గల సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహిస్తున్నది.ఈ సభ ఒక చారిత్రిక ఘటనగా, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు నాంది పలకనుంది. అధికారం లేకపోతే ఆరు నెలలు బతకలేని పార్టీలున్న ఈ దేశంలో వందేళ్లు అధికారానికి దూరంగా ప్రజలతో మమేకమై నిలిచిన సిపిఐ మరో వందేళ్లు పోరాడేందుకు వెనకాడని క్యాడర్‌ను సంసిద్ధులను చేస్తుంది. సిపిఐ ఆవిర్భావం ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమం తప్ప ఓట్లు, సీట్లు, నోట్లు కాదని సుదర్ఘ ప్రస్థానం నిరూపించింది.
తమ త్యాగమేది వృథా కారాదని
తమ స్వప్నాలకు రూపముందని
ముగింపకుడి విప్లవమని
మిగిలిన పని మీ వంతని
అంతిమ విజయం మనదని
వందేళ్ల ప్రస్థానంలో అమరులైన వారికి నివాళులర్పిస్తూ పోరాటపు బరిలో ఒరిగిన యోధుల త్యాగాలతో పునితమైన పోరు భూమి కమ్యూనిస్టు సమర నినాదమే ఖమ్మం.



సభా వేదికను పరిశీలించిన కూనంనేని, బాగం

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జరిగే ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో సభా స్థలిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు పరిశీలించారు. పూర్తి డిజిటల్ వేదిక కావడంతో తగు సూచనలు చేశారు. అతిథుల ప్రవేశంకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. మూడు ప్రదర్శనలు ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద ఏకమై సభా స్థలిలోకి ప్రవేశించే మార్గాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com